# దారి దీపం
మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 10 జూలై 2025 వెల : రూ.15

సంపన్నులను సృష్టిద్దాం.. పేదరికాన్ని నిర్మూలిద్దాం

ట్రంప్, మోడీ, మెలోనీలది ఒకటే బడి

ఎమర్జెన్సీ : ప్రకటితం వర్సెస్ అప్రకటితం

ప్రపంచ వేదిక మీద మన ప్రతాపం ఎంత ?

మోదీ 75 భగవత్ మాటలో మర్మమేమిటి

సత్యాన్వేషణలో జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు

పెట్టుబడిదారీ వ్యవస్థ - కొనసాగుతున్న అభూత కల్పనలు

వేతనాల అసమానతలు ముక్కలౌతున్న కార్మికవర్గం

నస్ బందీ, నోట్ బందీ దారిలో వోట్ బందీ!

హిందీ పెద్దమ్మ ఎక్కడ ? కనబడుట లేదు!!

కరేడులో ఇంత భారీ విస్థాపన అవసరమా..!?

సైన్స్ రచనల అవసరం ఎప్పుడూ ఎక్కువే!

మహిళా హక్కులపై అంబేద్కర్ కృషి

ది గ్రేట్ డిక్టేటర్‌లో చార్లీ చాప్లిన్ భావోద్వేగ ప్రసంగం

అమెరికా యువతలో కమ్యూనిజంపై ఆసక్తి

జూలై - 2025

పేజీలు : 40

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 10

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) సంపన్నులను సృష్టిద్దాం.. పేదరికాన్ని నిర్మూలిద్దాం - సంపాదకీయం 3

2) ట్రంప్, మోడీ, మెలోనీలది ఒకటే బడి - ఆనంద్ తేల్తుంబ్డే 4

3) ఎమర్జెన్సీ : ప్రకటితం వర్సెస్ అప్రకటితం - రామ్ పునియానీ 9

4) ప్రపంచ వేదిక మీద మన ప్రతాపం ఎంత ? - కె.శ్రీనివాస్ 10

5) మోదీ 75 భగవత్ మాటలో మర్మమేమిటి - రాజ్‌దీప్ సర్దేశాయి 13

6) సత్యాన్వేషణలో జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు - సమీక్షకులు : తంగిరాల చక్రవర్తి 15

7) పెట్టుబడిదారీ వ్యవస్థ - కొనసాగుతున్న అభూత కల్పనలు - ప్రభాత్ పట్నాయక్ 16

8) వేతనాల అసమానతలు ముక్కలౌతున్న కార్మికవర్గం - సంజయ్‌రాయ్ 18

9) నస్ బంది, నోట్ బంది దారిలో వోట్ బంది! - ఎన్.వేణుగోపాల్ 20

10) హిందీ పెద్దమ్మ ఎక్కడ ? కనబడుట లేదు!! - వనజ 21

11) కరేడులో ఇంత భారీ విస్థాపన అవసరమా..!? - జి.రోహిత్ 25

12) సైన్స్ రచనల అవసరం ఎప్పుడూ ఎక్కువే! - డాక్టర్ దేవరాజు మహారాజు 28


13) మహిళా హక్కులపై అంబేద్కర్ కృషి - మాడభూషి శ్రీధర్ 30

14) ది గ్రేట్ డిక్టేటర్‌లో చార్లీ చాప్లిన్ భావోద్వేగ ప్రసంగం 36

15) అమెరికా యువతలో కమ్యూనిజంపై ఆసక్తి 37

16) కార్టూన్స్ 39

17) కొత్త పుస్తకాల స్వీకారం 40




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# సంపన్నులను సృష్టిద్దాం.. పేదరికాన్ని నిర్మూలిద్దాం

అప్పుడప్పుడూ ఒపీనియన్స్ ఛేంజి చేయకపోతే పొలిటీషియన్ కానేరడు అన్నది గిరీశం ఉవాచ. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మనం దానినే చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం తొలి నినాదం స్వర్ణాంధ్రప్రదేశ్. 2047 మోదీ వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రంలో దీనిని సాధిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. స్వర్ణాంధ్ర చూడాలంటే మరో 20, 25 సంవత్సరాలు వేచి వుండాలి. అప్పటికి ఎవరు ఉంటారో తెలియదు. ఎవరు దానిని చూస్తారో, అనుభవిస్తారో తెలియదు. అందుకే ఆ నినాదం ఇప్పుడు అంతగా వినిపించడం లేదు. ఈ ముఖ్యమంత్రి పదవీ కాలం 2029తో ముగుస్తుంది. అప్పటికి స్వర్ణాంధ్ర రాదని తెలుసు. అందుకే పి.4 నినాదానికి ప్లేటు ఫిరాయించారు. స్వర్ణాంధ్రకు బదులు బంగారు కుటుంబాలను సృష్టించే ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. పి.4 అంటే ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌ను జీరో పావర్టీ రాష్ట్రంగా రూపొందించడం లక్ష్యంగా ప్రకటించారు.

చంద్రబాబు అంటే 40 ఏళ్ల అనుభవం, పైగా విజనరీ అయినా కొత్త నినాదాలు తప్పడం లేదు. 'సంపద పెంచుతా.. పేదలకు పంచుతా' అన్న నినాదం చాలా మందిని ఆకర్షించింది. రాష్ట్రంలో సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుందని భావించారు. సంపద పెంచడం అంటే ఉత్పత్తి పెంచడం. వ్యవసాయం విస్తరించాలి. పరిశ్రమలు పెల్లుబికాలి. అది అదనపు సంపద అవుతుంది. కాని, చంద్రబాబు సంపద సృష్టి దీనికి భిన్నంగా కనిపిస్తుంది. మద్యం వ్యాపారాన్ని ప్రైవేటుపరం చేసి వేలం పాటల పేరుతో 4, 5 వేల కోట్ల సంపద సృష్టించారు. వేల కోట్లు అప్పులు చేసి సంపద సృష్టించారు. రాజధాని భూమిని ఎకరా నాలుగు కోట్లకు అమ్మి 80 వేల కోట్ల సంపద సృష్టించబోతున్నట్లు ప్రకటించారు. ఇంకా చెత్త నుంచి సంపద సృష్టిస్తానంటున్నారు. ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే. ఇలా సృష్టించిన సంపదలో పేదల నుంచి దండుకున్నది కనిపిస్తుంది. పేదలకు అదనంగా పంచింది కనిపించడం లేదు. ఇప్పుడు పి.4 ఆయన కొత్త నినాదం ఎత్తుకున్నారు. పది శాతంగా వున్న సంపన్నులు, 20 శాతంగా వున్న కుటుంబాలను పేదరికం నుంచి విముక్తి చేసే పథకంగా ప్రచారం చేస్తున్నారు. ఇచ్చే దాతలు మార్గదర్శులు, పొందే లబ్ధిదారులు 'బంగారు కుటుంబాలు' అవుతాయి. దీనికి కూడా చంద్రబాబే తొలి మార్గదర్శి అయ్యారు. తన కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలకు సృష్టికర్త కాబోతున్నారు.


దాతృత్వమూ, స్వచ్ఛంద సేవ మనకు కొత్త కాదు. చంద్రబాబు పి.4కు ముందే అనేక స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు విద్య, వైద్యం, దివ్యాంగులకు, వృద్ధులకు పలు రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పి.4 పథకంలో వీటిని లీనం చేసి వారు పొందుతున్న గౌరవ ప్రతిష్టలకు వారిని మార్గర్శకులుగా ప్రకటించి రాజకీయ లబ్ధి చంద్రబాబు పొందాలని ప్రయత్నిస్తున్నారు.

పేదరికం పైకి వ్యక్తిగతంగా కనిపించినా అది ఒక సామాజిక సమస్య. దోపిడీ వున్న సమాజం పేదరికాన్ని నిరంతరం ఉత్పత్తి చేస్తుంది. నిరుద్యోగం, అధిక ధరలు, ఒక పక్క మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు అందక వారు నిరంతరం పేదరికంలో అప్పుల ఊబిలో కూరుకుపోతారు. పేదరికాన్ని సృష్టించే వ్యవస్థను మార్చకుండా పేదరికాన్ని శాశ్వతంగా తొలగిస్తామనడం భ్రమ మాత్రమే. ప్రభుత్వం సంపద సృష్టించి పేదలకు పంచే నినాదం మారింది. ప్రభుత్వం సంపన్నులు సృష్టిస్తుంది, వారు పేదరికాన్ని నిర్మూలిస్తారు. ఇదీ పి 4.

- డి.వి.వి.యస్.వర్మ,

సంపాదకులు, 85006 78977

# ట్రంప్, మోడీ, మెలోనీలది ఒకటే బడి



- ఆనంద్ తేల్తుంబ్డే

**మితవాదశక్తులు ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లోకి శక్తివంతంగా చొచ్చుకుపోయాయి. రెట్టించిన శక్తితో, స్పష్టమైన వ్యూహంతో ఈ మితవాద రాజకీయాలను వామపక్ష శక్తులు అధిగమించాలి. ప్రపంచవ్యాప్తంగానే ఇవాళ మితవాద శక్తులకు ఆదరణ పెరిగింది. డొనాల్డ్ ట్రంప్, జార్జియా మెలోని వంటి నాయకులు జాతీయవాద మనోభావాలను రెచ్చగొడుతున్నారు. ఇందులో భాగంగా కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణులను ప్రదర్శిస్తూ, అభ్యుదయ భావజాలాన్ని ఈసడిస్తున్నారు.**

2025 జనవరి 20న ట్రంప్ అమెరికన్ అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరిస్తూ "ఇది విముక్తి దినం" అని అతిశయంగా ప్రకటించారు. సంస్థాగత వివక్షతకు వ్యతిరేకంగా మెల్బోన్న ప్రజల ఇంగిత జ్ఞానానికి తన ఎన్నిక ప్రతీకని మెలోని ప్రకటించుకున్నారు. వీళ్లిద్దరూ వాక్ స్వాతంత్ర్యాన్ని, మత విశ్వాసాలను పరిరక్షిస్తామని వాగ్దానం చేశారు. పరస్పర విరుద్ధమైన ప్రకటన విశ్వాసాలకు, వాక్ స్వాతంత్రానికి పొసగదు. అయినా ఇప్పుడు ప్రపంచమంతటా ఈ మితవాద శక్తుల అబద్ధపు ప్రచారాలదే పైచెయ్యిగా నడుస్తొ ఉన్నది. సామాజిక విస్మరణకు, వెలివేతకు గురైన ప్రజానీకం, పేదలు ఈ మితవాదశక్తుల నుంచి తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.

అమెరికన్ సెనెట్, కాంగ్రెస్ ఉభయసభలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ అధికారం చేపట్టగానే తాను సంతకాలు చేసి హిమపాతంలా వెల్లువెత్తించిన శాసనాలను "ఇంగిత జ్ఞాన విప్లవం"గా ప్రస్తుతిస్తున్నారు. సొంత గొప్పలు చెప్పుకోవడంలో ట్రంప్ శైలే వేరు. అమెరికా చరిత్రలోనే 99 నిమిషాలపాటు సుదీర్ఘంగా ప్రసంగించిన అధ్యక్షుడిని నేనే అని బడాయి పోతూ గత ఆరు వారాల్లో నేను 100 కార్యనిర్వాహక శాసనాల మీద సంతకాలు చేశాను. మన అద్భుతమైన అమెరికన్ భూభాగం అంతటా ప్రజలలో ఆశలు మోసులెత్తేందుకు, వారి రక్షణకు అమెరికా మరింత సంపద్వంతం కావడానికి నేనీ చర్యలు చేపట్టాను" అని ప్రకటించారు. ఇదంతా ఈ సరికే మనకు అనుభవంలోకి వచ్చిన విషయంగా అనిపిస్తే అందుకు ఎవరినీ



తప్పు పట్టాల్సి పనిలేదు. ఎనిమిది నెలల క్రితం ఇండియా బ్లాక్ రాజకీయపక్షాలు పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై స్పందిస్తూ, మన ప్రధాని మోదీ ఏకధాటిగా 135 నిమిషాల సేపు ప్రసంగించారని ప్రచార, ప్రసార సాధనాలు మోతెక్కించి మరీ చాటి చెప్పాయి.

ఇది యాదృచ్ఛికం కానే కాదు. అలాని ట్రంప్ తమ మోదీని కాపీ కొట్టాడని భక్తులు పరవశంగా చేసిన ప్రచారమూ నిజం కాదు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో అధికార పీఠం అధిరోహిస్తున్న మితవాద రాజకీయ నాయకులలో ఉండే సారూప్య లక్షణమే ఇది. ఇటలీ ప్రధాని మెలోని మాటల్లోనే అది స్పష్టంగా ద్యోతకమవుతుంది. 2025 ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో జరిగిన "మితవాద రాజకీయ కార్యాచరణ సదస్సు (సీపీఏసీ)ను ఉద్దేశించి రోమ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తూ "నేను, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీ కలిస్తే మమ్మల్ని ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా అభివర్ణిస్తూ, అదే వామపక్ష భావజాల దేశాధినేతలు కూటమి కడితే వారిని ఆకాశానికి ఎత్తేస్తూ వామపక్షవాదులు ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని" వాపోయారు. నానా రకాల చీలికలకు గురైన వామపక్షశక్తులు మితవాద శక్తుల కూటమిపట్ల గుర్రుగా ఉన్నాయో లేదో అన్న సంగతి పక్కన పెడితే ప్రపంచ వ్యాప్తంగా "ఇంగితజ్ఞాన విప్లవాలు" తీసుకురావడానికి మితవాద శక్తులు అంతర్జాతీయ కూటమిగా ఏర్పడ్డాయనే వాస్తవాన్ని మెలోనీ స్పష్టం చేశారు.

### ఏమిటో ఇంగిత జ్ఞానం?

మితవాద రాజకీయ నాయకులకు తమ విధానాలను, రాజకీయ వ్యూహాలను సమర్థించుకోవడానికి తరచూ ఈ "ఇంగిత జ్ఞానం" అనే పదాన్ని బడాయిగా వాడుతుంటారు. సమర్థింపుకు

ఇంతకన్నా వేరే మార్గం లేదు వాళ్లకి. ప్రస్తుతం నయా ఉదారవాదం పాడె ఎక్కింది. అయితే వాళ్లు వాడే ఈ "ఇంగిత జ్ఞానం" అనే మాట తటస్థపదం కాదు. కొన్ని నిర్దిష్ట రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చడానికి ఉపకరించే సైద్ధాంతిక సాధనం అది. అవి ఏమిటో, ఎలాగో మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం.

**ప్రజాకర్షక వ్యూహం..**

మితవాద రాజకీయ నాయకులు తమ విధానాలు ఇంగిత జ్ఞానంతో కూడిన పరిష్కారాలనీ, పామరజనం ఇట్టే అర్థ చేసుకుంటారనీ, ఎటొచ్చీ మేధావులు, కులీనులు, రాజకీయాలను అర్థం చేసుకోలేని వాళ్లు అర్థం చేసుకోరనీ డాంబికంగా చెబుతుంటారు. తద్వారా మేధావులు, రంగాల వారీ నిష్ణాతులూ, సంప్రదాయ రాజకీయ సంస్థలు పనికిమాలినవి, ప్రభుత్వ వ్యతిరేక శక్తులని ముద్ర వెయ్యగలుగుతారు.

వామపక్ష, అభ్యుదయ వ్యతిరేక మహా కథనాలు ట్రంప్, మోదీ, మెలోనివంటి నాయకులు ఇంగిత జ్ఞానం గురించి ప్రస్తావిస్తున్నారంటే దాని అర్థం సాంస్కృతిక వైవిధ్యం, జెండర్ హక్కులు, పర్యావరణ అంశాలు, సామాజిక న్యాయం వంటి అభ్యుదయకర ఆలోచనలు తృణీకరిస్తున్నారని అర్థం.

అభ్యుదయకర విధానాలను "రాజకీయంగా సరైనవి అంటూ చాలా అతి చేశారు" అని తూలనాడుతూ తాము అనుసరించే మితవాద విధానాల ద్వారా ఆ అతిని సరిచేసి పది మందీ మెచ్చుకునేలా సుపరిపాలన అందిస్తున్నామని నమ్మబలుకుతారు.

**దేశభక్తి, జాతీయవాదం, సాంస్కృతిక అస్తిత్వం..**

- మెలోని చెప్పే "ఇంగిత జ్ఞానం"లో బలమైన జాతీయవాద డాంబికాలు, ఐరోపా యూనియన్ ప్రభావాన్ని వ్యతిరేకించడం వంటి అంశాలు కలగలిసి ఉంటాయి.
- ఇక మోదీ "ఇంగిత జ్ఞానం" హిందూత్వ సిద్ధాంతంతో ముడి పడి, విమర్శకుల మీద దేశద్రోహులని ముద్రవేసి నోళ్లు మూయించడం, మెజారిటీ మతతత్వ రాజకీయాలకు పెద్ద పీట వెయ్యడం ఇమిడి ఉంటాయి.
- ట్రంప్ చెప్పే ఇంగితజ్ఞాన విప్లవంలో "అమెరికా ఫస్ట్" పేరిట వలసదారుల మీద దాడులు, వేధింపులు, అభ్యుదయకర విధానాలను, చట్టాలను అటక ఎక్కించడం పరిపాటిగా ఉంటుంది.

**ఆర్థిక విధానాలు - ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం..**

కులీనులను పైకి విమర్శిస్తూ ఆచరణలో మాత్రం బడా వ్యాపారస్థుల కొమ్ముకాయడం, కార్పోరేట్ సంస్థలకు ఉదారంగా పన్ను మినహాయింపులు ఇవ్వడం, అన్ని రకాల నియంత్రణలను నీరుగార్చడంవంటి విధానాలనే అనుసరిస్తూ ఉంటారు.

మోదీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే ఇందుకు ఒక ఉదాహరణ. పెద్దనోట్ల రద్దు, ప్రైవేటీకరణ, కార్పోరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, ప్రజోపయోగ ప్రభుత్వరంగ సంస్థలు, సేవలను కారుచౌకగా బడాబాబులకు కట్టబెట్టడం వంటి చర్యలన్నీ అందులో భాగమే.

ట్రంప్ ప్రకటించిన పన్ను మినహాయింపులు, నియంత్రణల సడలింపుల మూలంగా బడా బహుళజాతి సంస్థలు, స్టాక్ మార్కెట్లు లబ్ధి పొందాయి. ఇదంతా "అమెరికా ఫస్ట్" పేరిట జనాన్ని బురిడీ కొట్టించే విధానాలే.

> **ఇస్లాం పట్ల ద్వేషం, జాతి విద్వేషం ట్రంప్ ప్రకటించే భద్రతా విధానాలు వలసలకు వ్యతిరేకత, ముస్లింల పట్ల విద్వేషంతో నిండి ఉంటాయి. పదహారు ముస్లిం దేశాల ప్రజానీకం మీద అమెరికాలో అడుగు పెట్టడానికి వీలు లేకుండా నిషేధం విధించడం, మెక్సికో సరిహద్దు గోడ నిర్మించడం వంటివి ఇందులో భాగమే. మోదీ ముస్లింల పట్ల వ్యతిరేకతతో చేపట్టిన పౌరసత్వ సవరణ బిల్లు ఆర్టికల్ 370 రద్దు వంటి చర్యలు ఇందులో భాగమే.**

ఇటలీలో రాజకీయ ఆశ్రయం పొందుతున్న వారిని, శరణార్థులుగా వలస వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకుని వలస నిరోధక చట్టాలు రూపొందించిన మెలోని రాజకీయ చర్యలూ ఈ కోవకు చెందినవే. ఈ రకంగా "ఇంగితజ్ఞానం" అనేది మితవాద రాజకీయ నాయకులకు అందివచ్చిన రాజకీయ సాధనం. తటస్థత పాటిస్తూ సార్వజనీన జనామోదం పొందడానికి బదులు మితవాద రాజకీయ నాయకులు కొత్తగా ఎత్తుకున్న "ఇంగిత జ్ఞాన" నినాదాన్ని అభ్యుదయ ఉద్యమాలను తేరగా తిని కూర్చునే వాళ్లు చేసే ఉబుసుపోని ఆందోళనలుగా అవహేళన చెయ్యడానికి, అప్రతిష్ట పాలు చేయడానికి, జాతీవాదాన్ని, మత విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి, వాస్తవిక దృష్టి పేరిట మెజార్టీవాదాన్ని రుద్దడానికి, సాధారణ ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులమని చెప్పుకుంటూ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అడ్డూ అదుపూ లేకుండా పెంచి పోషించడానికి సైద్ధాంతిక సాధనంగా మలుచుకున్నారు.

**మితవాద శక్తుల ప్రజాకర్షణ..**

మితవాద శక్తులు ప్రజాకర్షక నినాదాలు, ప్రచారాలతో వామపక్ష రాజకీయ శక్తులు ప్రజలతో సంబంధాలు కోల్పోయిన వాటిగా, కొండొకచో ప్రమాదకర శక్తులుగా ముద్ర వెయ్యగలుగుతాయి. సామాజిక న్యాయం, స్త్రీ-పురుష సమానత్వం వంటి సామాజిక అభ్యుదయ విధానాలను "వోకిజం" పేరిట తూలనాడడం ఈ మితవాద శక్తులకు పరిపాటి మెలోని కూడా ట్రంప్ మాదిరే తాను అసలు సిసలైన సామాన్య ప్రజానీకం పరిరక్షకురాలనని చెప్పుకుంటారు. శాస్త్రీయ ఆలోచనలు, సామూహిక చైతన్యం పట్ల మితవాద శక్తులు ప్రదర్శించే విముఖత మూలంగా సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక సంబంధాలను అతి సాధారణీకరించి వాటిని వివిధ సామాన్య ప్రజానీకానికి అవినీతిపరులైన కులీనశక్తులకు మధ్య జరిగే పోరాటంగా చలామణి చెయ్యాలని చూస్తాయి.

ట్రంప్ ప్రవచించే "అమెరికా ఫస్ట్" నినాదం గానీ, మెలోనీ ప్రదర్శించే కుహనా జాతీయవాదం గానీ దేశసార్వభౌమత్వం గురించి డాంభికమైన ప్రచారానికి దారి తీస్తుంది. ఇందుకు అంతర్జాతీయ సంబంధాలను మూల్యంగా చెల్లించాల్సి వచ్చినా లెక్క చెయ్యరు. వీళ్లు అనుసరించే విధానాల మూలంగా ప్రపంచవ్యాప్త దారిద్ర్య నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించే లక్ష్యాలతో పనిచేసే ఐక్యరాజ్యసమితి తదితర బహుళజాతి అంతర్జాతీయ సంస్థలు బలహీన పడతాయి. అంతర్జాతీయ సవాళ్లను సమష్టిగా ఎదుర్కొని పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని పనికి మాలనిదిగా ముద్రవేసి తమకు తమ జాతీయ ప్రయోజనాలే ముఖ్యం అంటూ దేశీయంగా ప్రజామద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచి, పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన క్యోటో ప్రోటోకాల్ నుంచి అమెరికా వైదొలుగుతుందని ట్రంప్ ప్రకటించడం ఇందులో భాగమే.

మితవాదశక్తులు దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంపొదిస్తామనీ లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని, కార్మికులందరికీ మెరుగైన వేతనాలు అందేలా చూస్తామని భారీ వాగ్దానాలు చేసి ఓట్లు దండుకుని అధికారం చేపట్టాక బడాకార్పోరేట్ సంస్థలు, సంపన్న వర్గాల సేవలో తరించిపోతుంటాయి. నియంత్రణలు తొలగించడం, సంపన్నులకు మరిన్ని పన్ను రాయితీలు కల్పించడం, సంక్షేమ పథకాల వ్యయంలో కోతపెట్టడం ద్వారా సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలు మరింత పెరిగిపోయేలా చేస్తారు. ఆర్థిక విధానాలు ఇలా నయా ఉదారవాద మార్గం పట్టడం మూలంగా కార్మికుల హక్కులకు కత్తెర పడుతుంది. సామాజిక సంక్షేమ పథకాలు కోతకు గురవుతాయి. అన్నిటికీ మించి వర్ధమాన దేశాల్లోని మెజారిటీ కార్మికవర్గం, పేదలు మరిన్ని ఇక్కట్ల పాలవుతారు.

మితవాద శక్తులు తరచూ న్యాయస్థానాలను మీడియాను, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను తులనాడుతూ, అప్రతిష్ట పాల్జేయడానికి ప్రయత్నిస్తూ ప్రజాస్వామిక సంస్థలపై దాడికి తెగబడుతుంటాయి. ట్రంప్ తన విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలను ప్రజలకు శత్రువులని, ఫేక్ న్యూస్ ప్రచారకర్తలని విరుచుకుపడుతుంటారు. మెలోని అయితే వామపక్ష ఉద్యమాలు ఇటలీ ఉనికికే ప్రమాదం తెచ్చిపెడుతున్నాయని ఆరోపిస్తూ నియంతృత్వ పాలన సాగించడానికి అనువైన వాతావరణం సృష్టించుకున్నారు. ప్రజాస్వామిక సంస్థలపై మితవాద రారజకీయ నాయకులు చేసే ఈ దాడులమూలంగా అణిచివేత ధోరణులను ఎదుర్కోవడానికి పౌరచైతన్యాన్ని, న్యాయస్థానాలను ఆశ్రయించే నిమ్నవర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోంది.

ఈ 21వ శతాబ్దంలో ప్రపంచంలోని అనేక దేశాలలో మితవాద శక్తులు అధికారంలోకి వస్తున్నాయి. అమెరికాలో ట్రంప్, మనదేశంలో మోదీ, బ్రెజిల్‌లో జైర్ బోల్సనారో, అర్జెంటీనాలో జేవియర్ మిలే, ఇటలీలో మెలోనీ వీరంతా ఈ కోవకే చెందుతారు. ఉదారవాద ప్రజాస్వామిక సూత్రాలను తోసిరాజని నియంతృత్వ పోకడల పరిపాలన సాగించడానికి మొగ్గుచూపుతారు. ఇందులో భాగంగానే సామాజిక అభ్యుదయ ఉద్యమాల అణిచివేతకు పాల్పడుతూ, ప్రజాస్వామ్యవాదులు, ఉదారవాదులు, వామపక్ష శక్తులపై నిర్హేతుకమైన దాడులకు తెగబడుతూ, సమాజంలోని సాంస్కృతిక బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని తృణీకరిస్తూ ఉంటారు. ఈ భావజాలానికి చెందిన వారిని దేశద్రోహులుగా, ప్రమాదకరవ్యక్తులుగా చిత్రీకరిస్తూ ఉంటారు.

**మితవాదశక్తులు ఇంత విస్తృతంగా అనేక దేశాల్లో అధికారంలోకి రావడానికి తోడ్పడిన కొన్ని కీలకమైన కారణాలు ఏమిటో ఇప్పుడు పరిశీలిద్దాం.**

- **నయా ఉదారవాద విధానాలు విఫలమై ఆర్థికంగా తీవ్ర అసంతృప్తి ప్రబలడం** : ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం ముగియడంతో ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాద విధానాల అమలు ఊపందుకున్నది. ఈ విధానాలు కార్మిక వర్గ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీశాయి. ఒక వైపున జీతభత్యాల్లో ఎదుగూబొదుగూ లేకుండా పోవడం, మరోపక్కన యాంత్రీకరణ పెరుగుదల మూలంగా ఉన్న ఉద్యోగాలకు ఎసరు రావడంతో కార్మికవర్గంలో ఆర్థిక అభద్రతాభావం పెరిగిపోయింది. మితవాదశక్తులు తమని తాము సామాన్య ప్రజల, కార్మికుల ప్రయోజనాల పరిరక్షకులుగా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకోవడం మూలంగా సాధారణ ప్రజానీకం ఈ ప్రచార మాయా

జాలంలో చిక్కుకున్నారు.

- **ఉదారవాదశక్తులలో నెలకొన్న సంక్షోభం** : మధ్యేవాద, ఉదారవాదవామపక్ష రాజకీయ పార్టీలు సామాజిక – ఆర్థిక అసమానతలను పరిష్కరించడంలో విఫలం కావడంతో ప్రజలలో ఈ పార్టీలపై ఉన్న భ్రమలు తొలిగిపోయాయి. కార్పోరేట్ ఆధిపత్యం, ప్రైవేటీకరణ, పొదుపు చర్యలకు ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించకపోవడం మూలంగా ఈ రాజకీయ శక్తులపై సాధారణ ప్రజానీకంలో అపనమ్మకం ఏర్పడింది. ఇదే అదనుగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి తామే అసలైన ప్రతినిధులమంటూ మితవాద శక్తులు నిర్వహించిన ప్రచారహోరును ప్రజలు నిజమని విశ్వసించి వారికి అధికారం కట్టబెట్టారు.
- **సాంస్కృతిక జాతీయవాదం, వలస వ్యతిరేక భావోద్వేగాలు** : వలసలు, ప్రపంచీకరణ, బహుళ సాంస్కృతికవాద ప్రమాదాల నుంచి జాతిని, జాతి సంస్కృతిని కాపాడే సత్తా తమకే ఉన్నదని మితవాద శక్తులు ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రచారానికి పూనుకున్నాయి. ట్రంప్ "అమెరికా ఫస్ట్" అని నినాదం ఇచ్చినా, "సంప్రదాయ ఇటలీ జాతీయ విలువలు పరిరక్షిస్తానని" మెలోని ప్రచారం చేసినా, "అన్య మతాలపై విద్వేష ప్రచారానికి తెగబడి మరీ హిందువులు, హిందూమతం ప్రమాదంలో పడ్డాయ"ని మోదీ ప్రచారం చేసినా ఇవన్నీ లేని శత్రువును సృష్టించి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందడమే.
- **మీడియా, సామాజిక మాధ్యమాల పాత్ర:** సామాజిక మాధ్య మాల విస్తృతి పెరిగింది. దీంతో మితవాదశక్తుల తప్పుడు ప్రచారవ్యాప్తికి ఊతం చిక్కింది. ప్రధాన స్రవంతి మీడియా వామపక్ష శక్తుల గుప్పిట్లో ఉందని, పక్షపాత ధోరణులు ప్రదర్శిస్తుందని తెగబడుతూ మితవాదశక్తులు బలం పుంజుకున్నాయి.
- **"వోకిజం" పేరిట దాడి:**జెండర్ సమానత్వం, జాత్యహంకార ధోరణుల నియంత్రణ, పర్యావరణ సమస్యల పేరిట అభ్యు దయ ఉద్యమాలు వాక్‌స్వాతంత్రాన్ని పరిహరిస్తున్నాయి. కొత్త తరహా నియంతృత్వానికి పాల్పడుతున్నాయని మితవాద శక్తులు నానాయాగీ చేస్తున్నాయి.
- **మితవాదశక్తుల వ్యూహాత్మక పొత్తులు** : వామపక్ష "హిపోక్రసీ"ని ఎండగట్టే పేరిట ట్రంప్, మోదీ, మెలోనీలు కూటమి కట్టారు. "మేం కూటమి కడితే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ముంచుకొచ్చిందని ప్రచారం చేసే వామపక్ష, ఉదారవాద శక్తులు వాళ్లలో వాళ్లు కూటమి కట్టి దానిని అభ్యుదయంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది తగునా" అని బాధితుల స్వరం వినిపిస్తూ తమ పునాదిని మితవాదశక్తులు విస్తరించుకుంటున్నాయి.

## పేదలపై ప్రభావం..

మితవాదశక్తులు అనుసరించే విధానాల మూలంగా పేదలు, బలహీనవర్గాలు తీవ్ర ప్రతికూల పరిస్థితులకు లోనవుతున్నారు.

- **అసమానతలు తీవ్రతరం కావడం** : ప్రైవేటీకరణ, సంపన్నులకు పన్ను రాయితీలు, ప్రజోపయోగసేవలకు కేటాయించే నిధులలో కోతల మూలంగా అల్పాదాయ వర్గాల ప్రజానీకం, పేదలపై విపరీతమైన ఆర్థికభారం పడుతోంది. మితవాదశక్తులు అనుసరించే ఆర్థికవిధానాలు కార్మికవర్గం జీవన ప్రమాణాలను ఘోరంగా దెబ్బ తీస్తున్నాయి. సంక్షేమ పథకాల్లో కోత, ఆరోగ్య సేవల్లో కోతల మూలంగా లక్షలాది మంది ప్రజానీకం నిత్యజీవితం బతుకుపోరాటంగా మారిపోతుంది.
- **కార్మిక, సామాజిక న్యాయ ఉద్యమాల అణిచివేత** : కార్మిక సంఘాలు, వామపక్ష ప్రజాసంఘాల విద్యార్థి ఉద్యమాలు, సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేసే గొంతుకలు ఇవన్నీ దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా మారాయని మితవాద శక్తులు ముద్రవేస్తాయి. ప్రభుత్వ దన్నుతో కార్పొరేట్ శక్తులు పనికి తగిన వేతనాలు, పని ప్రదేశంలో తగిన రక్షణలు కల్పించడం, పదవీ విరమణానంతర సౌకర్యాల కల్పనవంటి కార్మికుల ఉద్యోగుల డిమాండ్లను అణిచివేస్తాయి.
- **పర్యావరణ పరిరక్షణ కార్యాచరణకు విఘాతం** : పర్యావరణ నష్టానికి దారి తీసే చర్యలు ఒట్టి హంబగ్ అని మితవాదశక్తులు తేలిగ్గా కొట్టి పారేస్తాయి. పర్యావరణ అనుమతులు, నియంత్రణలను పలుచన చేసేస్తాయి. జాతీయ ప్రయోజనాలు, ఆర్థికాభివృద్ధికి ఇవి చేటు చేస్తున్నాయని తప్పుడు ప్రచారానికి పాల్పడతాయి. దీని మూలంగా ప్రకృతి ఉత్పాతాల సందర్భంగా పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజానీకం తీవ్రంగా నష్టపోతారు.
- **జాత్యహంకార ధోరణులు పెచ్చరిల్లడం, మైనార్టీల హక్కు లకు భంగం కలగడం** : పరాయి దేశాల నుంచి వలసలు పెరగడం మూలంగా దేశం భ్రష్టుపట్టిపోతుందనే ప్రచారంతో మితవాద శక్తులు సమాజంలో జాత్యహంకార ధోరణులు, విద్వేషాలను రెచ్చగొడతాయి. తత్ఫలితంగా మైనారిటీలపై భౌతికదాడులు, హింసాత్మక అణిచివేతల పెరుగుదలకు ఆస్కారం కల్పిస్తారు. ప్రజల మధ్య నెలకొని ఉండే సామాజిక సమరసతను ఛిన్నాభిన్నం చేసి తగని చేటు చేస్తారు. ట్రంప్, మెలోనీల రూపంలో తలెత్తిన మితవాద శక్తులు సమిష్టి న్యాయసూత్రాలు, అంతర్జాతీయ సౌభ్రాతృత్వం, శాస్త్రీయమైన పరిపాలనా విధానాల మీద సైద్ధాంతికంగా పెద్ద ఎత్తున దాడికి తెగబడుతుంటాయి. అవి

అనుసరించే జాతివాదం, ఆర్థిక నియంత్రణల సడలింపు. వామపక్ష వ్యతిరరేక వాగాడంబరత్వం – ఇవన్నీ ప్రజాస్వామిక సంస్థలను దుంపనాశనం చేస్తాయి. ఆర్థిక అసమానతలు తీవ్రతరమై పేదల మీద పోషించనలవి కానీ రీతిలో భారాలు మోపుతాయి. సమ్మిళిత ఆర్థిక విధానాలు, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారాలను పెంపొందించే విధంగా ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తే తప్ప ఈ తిరోగమన శక్తులను నిలవరించలేం. ఈ మితవాద శక్తులను ప్రతిఘటించలేకపోతే నియంతృత్వాధి కారం బలపడిపోతుంది. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లిపోతాయి.

**మితవాద శక్తులను ఎదుర్కొనే మార్గాలు..**

మితవాద శక్తుల దూకుడును శక్తివంతంగా నిలవరించాలంటే వామపక్షశక్తులు సిద్ధాంత విభేదాలను పక్కన పెట్టి మితవాద శక్తుల విధానాలకు బలవుతోన్న ప్రజానీకాన్ని విశాలప్రాతిపదికన ఐక్యం చేసే కృషి చేపట్టాలి. ఇందుకు అనుగుణంగా తగిన రాజకీయ, సైద్ధాంతిక వ్యూహాలను రూపొందించుకోవాలి. ఈ వ్యూహాలు సృజనాత్మకంగా ఉండాలి. అయితే కొన్ని సాధారణ అంశాలను ఆ వ్యూహంలో భాగం చేసుకోవాలి.

- **ఆర్థిక న్యాయం కోసం పిలుపు** : ఆర్థిక అసమానతల మూలాల్లోకంటూ వెళ్లి అందుకు దారితీసిన తప్పుడు ఆర్థిక విధానాలను వామపక్ష శక్తులు ప్రజలలో ఎండగట్టాలి. అస్తిత్వ రాజకీయాల గుంజాటనలో పడకుండా కార్మికవర్గ హక్కుల మీద, సంపద పంపిణీ విధానాల మీదా, ప్రజా సంక్షేమం మీద దృష్టి కేంద్రీకరించడం ద్వారా కార్మికులను, కష్టజీవులను మితవాదశక్తుల ప్రభావం నుంచి దూరం చేయవచ్చు.
- **బలమైన ప్రత్యామ్నాయ ప్రచారం చేపట్టాలి** : దేశభక్తి, రక్షణ, రక్షిత ఆర్థిక విధానాలపై మితవాద శక్తుల కథనాల నియంత్రణను బద్దలు కొట్టాలి. ఇందుకుగాను వామపక్ష శక్తులు ప్రజాస్వామ్యం, హేతుబద్ధమైన పాలన, ప్రజా ప్రయోజనాలు కేంద్రకంగా ప్రభుత్వ విధానాలు ఉండాలనే డిమాండ్‌లతో పటిష్టమైన ప్రచారం చేపట్టాలి.
- **పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలను పూడ్చుకోవాలి** : గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజానీకం నగర జీవిత శైలితో పోల్చుకుంటే పరాయీకరణకు గురయ్యామని భావిస్తారు. మితవాద శక్తులు ఈ విధంగా పరాయికరణకు గురైన ప్రజానికాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తాయి. కాబట్టి వామపక్ష శక్తులు ఈ అంశాన్ని విస్మరించకుండా పరాయికరణకు దారితీసిన భౌతిక పరిస్థితుల పరిష్కారం కోసం కృషి చెయ్యాలి.
- **ప్రజాస్వామిక సంస్థల పరిరక్షణ** : మితవాద శక్తులు న్యాయవ్యవస్థ స్వతంత్ర్యతను, మీడియా స్వేచ్ఛను, ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసేదానికి ప్రయత్నిస్తుంటాయి. కాబట్టి వామపక్షశక్తులు ఈ ప్రజాస్వామిక సంస్థలను కాపాడుకుంటూ, వీటిని మరింత బలోపేతం చేసి, సమాజంలోని అణగారినవర్గాలకు ప్రయోజనాలకు ఈ సంస్థలు పూచీపడేలా చూడాలి.
- **అంతర్జాతీయ సౌభ్రాతృత్వం** : మితవాద శక్తులు తమ పట్టును కోల్పోకుండా, మరింత బలపడేదాని కోసం సారూప్య శక్తులు అన్నింటితో అంతర్జాతీయంగా పటిష్టమైన సంబంధ బాంధవ్యాలు నెలకొల్పుకుంటాయి. కాబట్టి వామపక్ష శక్తులు కూడా ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణల ఆధారంగా అంతర్జాతీయంగా కలిసి వచ్చే శక్తులన్నింటినీ కూడగట్టాలి.
- **తప్పుడు ప్రచారాలను ఎండగట్టడం** : మితవాద శక్తులు తప్పుడు ప్రచారవ్యాప్తి ద్వారా ప్రజలలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. ప్రజలలో వివిధ తరగతుల ప్రజానీకం మధ్య వైషమ్యాలు, శతృత్వ భావనలు పెంచి పోషిస్తుంటాయి. వామపక్షశక్తులు ఈ ప్రయత్నాలను పెద్ద ఎత్తున, బలంగా తిప్పి కొట్టాలి. మరీ ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో సాగే డిజిటల్ ప్రచారంలో చురుగ్గా ఉండాలి.

**మితవాద శక్తులు బలం పుంజుకోవడం ఆర్థిక-సామాజిక సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి, హేతుబద్ధమైన పరిపాలనకు కడుప్రమాదం. మితవాద శక్తులు ఇప్పటికే ప్రజల ఆర్థిక సాంస్కృతిక సంక్లిష్ట ఆందోళనలను తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. వామపక్ష శక్తులు రెట్టించిన బలంతో స్పష్టమైన వ్యూహంతో ఈ మితవాద రాజకీయశక్తుల ఆటకట్టించాలి. వామపక్ష శక్తులు మాత్రమే ఈ చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతాయి. ఈ కర్తవ్య నిర్వహణలో వామపక్ష శక్తులు ఏ మాత్రం తడబడినా, వెనకడుగు లేసినా సామాజిక, అభ్యుదయ ఉద్యమాలు దెబ్బ తినిపోవడమే కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య సంక్షోభం తీవ్రతరమవుతుంది.** ❑

(అనువాదం : కె.సత్యరంజన్)

# ఎమర్జెన్సీ : ప్రకటితం వర్సెస్ అప్రకటితం



- రామ్ పునియానీ

లోక్‌సభ స్పీకర్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తరువాత ఓం ప్రకాష్ బిర్లా 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ఖండిస్తూ ఒక తీర్మాన పాఠాన్ని చదివి వినిపించారు. జయప్రకాష్ నారాయణ ప్రారంభించిన సంపూర్ణ క్రాంతి ఉద్యమం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడానికి తక్షణ నేపథ్యం. గుజరాత్‌లో కళాశాల క్యాంటీన్ బిల్లుల పెంపును నిరసిస్తూ విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమాన్ని బీహార్ విద్యార్థి లోకం కొనసాగించింది. చివరకు విద్యార్థులు జాతీయస్థాయి ఉద్యమానికి నాయకత్వం వహించాల్సిందిగా జయప్రకాశ్ నారాయణను కోరే స్థాయికి చేరింది. పార్లమెంటును, అసెంబ్లీలను ముట్టడించాలని జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. 1975 జూన్ 15న రామ్ లీలా మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో పోలీసు, సైన్యం, ప్రభుత్వాదేశా లను ధిక్కరించాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభ జరగడానికి మూడు రోజుల ముందు అలహాబాద్ హైకోర్టు 1971 నాటి ఇందిరాగాంధీ పార్లమెంట్ ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జూన్ 24వ తేదీన సుప్రీంకోర్టు స్టే విధించింది.

ఇందిరాగాంధీ పాలనకు దేశవ్యాప్తంగా పెరుగుతోన్న ప్రతిఘటన నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 352ని ఉపయోగించుకొని 1975 జూన్ 25వ తేదీన ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని విధించింది. పౌర హక్కులు, స్వేచ్ఛ రద్దు, దాని కొనసాగింపుగా మొదలైన మానవ హక్కుల హననం 1977లో ఎమర్జెన్సీని ఉపసంహరించుకొని ఎన్నికలు జరిపేంత వరకు 21 నెలలపాటు నిరాఘాటంగా కొనసాగింది.

1978 జనవరి 24వ తేదీన యావత్మల్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఎమర్జెన్సీ కాలంలో జరిగిన కృత్యాలు, అరాచకాల పట్ల ఇందిరాగాంధీ క్షమాపణలు కోరారు. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాల గురించి కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ కూడా దేశాన్ని క్షమాపణ కోరారు. వామపక్షాల నుంచి సంఘ్ పరివార్ వరకు అనేకమంది నేతలు 1975 నుంచి 77 వరకు కటకటాలు లెక్కించారు. అందులో లాలూ ప్రసాద్ యాదవ్ ఒకరు. ఈ మధ్యనే జర్నలిస్ట్ నలిన్ వర్మతో కలిసి లాలూ ప్రసాద్ యాదవ్ ఎమర్జెన్సీ గురించి ఒక వ్యాసం రాశారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రతిపక్ష పార్టీల నేతలను అరెస్ట్ చేసినా ఎలా గౌరవంగా చూశారో వివరించారు.

జూన్ 25వ తేదీన భారత ప్రజాస్వామ్యంలో చీకటి దినంగా భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. ఎమర్జెన్సీ కాలంలో సంఘ్ పరివార్ రికార్డు కూడా ఎన్నో వివాదాస్పద అంశాలు పరిణామాలతో నిండి ఉన్నది.

స్వాతంత్రోద్యమంలో గౌరవనీయమైన స్థానం కలిగిన జయ ప్రకాశ్ నారాయణ ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌ను భాగస్వామి చేసుకోవడానికి వెనకాడ లేదు. ఈ మధ్యనే భారతరత్నగా కీర్తించబడిన ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో కీలకమైన వ్యక్తి నానాజీ దేశముఖ్ ఇందిరా గాంధీ వ్యతిరేక ఉద్యమానికి కీలకమైన సారథిగా బాధ్యతలు చేపట్టారు. మహాత్మా గాంధీ హంతకుడు ఆర్ఎస్ఎస్ పరివారంలో భాగమన్న కారణంగా అప్పటి వరకు ఒక గౌరవనీయమైన సామాజిక సంస్థగా గుర్తింపుకు నోచుకోని ఆర్ఎస్ఎస్‌కు జయప్రకాశ్ నారాయణ ప్రారంభించిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం గొప్ప గుర్తింపును గౌరవాన్ని తెచ్చిపెట్టింది.

సంపూర్ణ క్రాంతి ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ కీలకమైన పాత్ర పోషించడం ద్వారా ప్రజల దృష్టిలో అదొక గుర్తింపు కలిగిన గౌరవనీయమైన సంస్థగా నిలిచింది. కానీ ఎమర్జెన్సీ విధించిన తర్వాత అనేక రాజకీయ పార్టీలు సంస్థలకు చెందిన నాయకులను అరెస్టు చేయడంతోపాటు ఆర్ఎస్ఎస్ నాయకత్వాన్ని కూడా ఇందిరాగాంధీ అరెస్టు చేయించింది. దాంతో ఇందిరాగాంధీ ప్రభుత్వంతో ఆర్ఎస్ఎస్ కాళ్ళ బేరానికి వచ్చింది. అనేకమంది ఆర్ఎస్ఎస్ నాయకులు క్షమాభిక్ష కోరి మరీ జైళ్లల్లో నుంచి విడుదలయ్యారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన రాజకీయ శక్తులలో తామే ప్రధాన స్రవంతికి చెందిన వారమని చెప్పుకునే ప్రయత్నంలో బీజేపీ తలమునకలవుతోంది. కొన్నేళ్ల క్రితం ప్రముఖ జర్నలిస్టు ప్రభాస్‌జోషి తెల్కా ఒక పత్రికలో రాసిన పరిశోధనాత్మక వ్యాసంలో అనేక విషయాలను ఆధారాలతో సహా ప్రస్తావించారు. “సంజయ్‌గాంధీ ప్రతిపాదించిన 20 సంవత్సరాల కార్యక్రమానికి తాము సంపూర్ణంగా మద్దతిస్తామని అప్పటి ఆర్ఎస్ఎస్ అధినేత బాలసాహెబ్ దేవరస్ ఇందిరాగాంధీకి రాసిన లేఖలో చెప్పారు. ఆర్ఎస్ఎస్ నిజ స్వరూపం ఇది. ఒక కార్యక్రమం శైలి ఓ పద్ధతి ఆర్ఎస్ఎస్ మాటల్లోను చేతల్లోనూ గమనించవచ్చు. ఎమర్జెన్సీలో కూడా అనేకమంది ఆర్ఎస్ఎస్, జన సంఘ నాయకులు జైళ్ల నుంచి రావడానికి విడుదలకు కావటానికి క్షమాపణ పత్రాలను సమర్పించారు. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సాగించిన ఉద్యమంలో క్షమాపణ **(మిగతా 13వ పేజీలో)**

# ప్రపంచ వేదిక మీద మన ప్రతాపం ఎంత ?



- కె.శ్రీనివాస్

జాతీయవాదం దాని మంచి దానికుంది. కానీ, దానితోపాటు పరిమితులు, బలహీనతలు, దుర్మార్గాలూ అనేకం ఉన్నాయి. కొన్ని చారిత్రక, పారంపర్య అస్తిత్వాల ఆధారంగా మెజారిటీని ఒక జాతిగా నిర్వచించుకుని, నిర్మించుకుని అది పనిచేస్తుంది. తన లోపలి మైనారిటీలతోనే కాదు. బయటి మెజారిటీ జాతులతో కూడా వైరాన్ని నిర్వహించుకుంటుంది. తాను, ఇతరులు అన్న ద్వంద్వంలో ఎప్పుడూ కొట్టుమిట్టాడుతుంది. ఆధిక్య భావననో, బాధిత భావననో తన ప్రజలలో కలిగిస్తూ ఉంటుంది. తన సమూహం అనుకున్న దాని ప్రయోజనాలను రక్షించడం, పెంపొందించడం పేరుతో, అందులోని ప్రాబల్య శ్రేణుల ప్రయోజనాలను స్థిరపరుస్తుంది. తిరుగులేని అధికారాన్ని సమకూర్చుకుంటుంది. ఆధునిక ప్రపంచంలో, జాతీయవాద ప్రభుత్వాలు, తమ దేశంలోపల ఒక పరిస్థితిని నిర్మించుకుంటాయి. సాపేక్షంగా బలమైన ఇతర జాతీయవాద రాజ్యాలతో బలహీన సంబంధాలలోకి వెళతాయి.

భారతదేశంలో ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీకి తీవ్ర జాతీయవాద (అల్ట్రా నేషనలిస్ట్) పార్టీ అన్న పేరుంది. సాంస్కృతికంగా 'సనాతన' జాతీయవాదాన్ని, మెజారిటేరియన్ ఆధిక్యాన్ని బలపరచే ఈ పార్టీ, ఆర్థికంగా ఉదారవాద ఆర్థిక విధానాలు అని పిలిచే ప్రపంచీకరణ ప్రక్రియను అంగీకరించి అమలు జరుపుతుంది. ప్రపంచీకరణలో అన్ని రాజ్యాలు సమానం కావు. బలహీన, వర్ధమాన దేశాల మార్కెట్లను తమకు అందుబాటులోకి తెచ్చుకునే వరకు సమాన ప్రాతిపదికలను చెబుతూ వచ్చే అగ్రరాజ్యాలు, తమ ప్రయోజనాల దగ్గరికి వచ్చేసరికి, కొత్తవాదనలు తెస్తాయి, అప్పటిదాకా ఖండిస్తూ వచ్చే ప్రొటెక్షనిస్టు చర్యలను తామే అమలు జరుపుతాయి. ఈ వాతావరణంలో, జాతీయవాద పార్టీ పాలనలో భారతదేశం తన ప్రయోజనాలను రక్షించుకుంటూ, తనవంటి దేశాలకు అండగా నిలుస్తూ స్వతంత్ర వైఖరిని ప్రకటిస్తుందని ఆశిస్తాము. ప్రపంచంలో కొన్ని దేశాలు మునుపు, ఇప్పుడు కూడా తీవ్ర జాతీయవాదాన్ని అనుసరిస్తూ, అంతర్జాతీయ రంగంలో కూడా తమ సార్వభౌమాధికారాన్ని వక్కాణించడాన్ని ఆ వైఖరిలో భాగంగా పరిగణిస్తూ వస్తున్నాము. కానీ, భారతదేశం సరళి జాతీయవాద ఆదర్శాలకు అనుగుణంగా కాక, వివాదాలకు దూరంగా మెలిగే ఆత్మరక్షణ ధోరణిలో కనిపిస్తోంది. 1990ల నుంచి ఇట్లాగే ఉంది. దానికది ఏమీ తప్పు కాదు. ఉన్న పరిస్థితులలో మనుగడను కాపాడుకోవడం, దేశ ప్రయోజనాలను




ప్రధానంగా తీసుకుని వివాదాలకు దూరంగా మెలగడం, ఆచరణాత్మక విధానంగా పరిగణిస్తారు. కానీ, ప్రపంచంలో భారత్ ప్రతిష్ఠను పెంచారని భావిస్తున్న నరేంద్రమోదీ హయాంలో కూడా ఈ "ఆత్మరక్షణ" ధోరణి కొనసాగడం ఆశ్చర్యమే. భారతదేశం తన ప్రస్తుత విదేశాంగ విధానం వెనుక అంతస్సూత్రం 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' (స్ట్రాటెజిక్ అటానమీ) అని చెప్పుకుంటోంది.

భారతదేశానికి తన ఇరుగు పొరుగుతో, ముఖ్యంగా పాకిస్తాన్‌తో, చైనాతో సమస్యలున్నాయి. ఆ రెండు దేశాలతో వ్యవహరించే తీరులోను తేడాలున్నాయి. పెహల్గామ్ ఘాతుకం తరువాత, భారత్ పాకిస్థాన్ మీద కఠినమైన ప్రతీకారచర్యలు తీసుకుంది. భారత్-పాక్ ద్వంద్వంలో, ఉభయదేశాల ప్రజల మనోభావాలు చారిత్రకంగా పరస్పర శత్రుపూరితంగా రూపు దిద్దుకున్నాయి. 'ఆపరేషన్ సిందూర్" సందర్భంగా భారతదేశంలో వ్యక్తమైన భావావేశాలు, ప్రభుత్వ స్పందనల మీద వెల్లువెత్తిన ప్రశంసలు, సైన్య శక్తి మీద పెరిగిన వీరారాధనలు-జాతీయవాద దేశభక్తి తీవ్రతను సూచిస్తాయి. కానీ, అంతర్జాతీయ సమాజం, మీడియా భారత ప్రభుత్వ జాతీయావేశాల మీద చన్నీళ్లు చల్లింది. పాకిస్థాన్‌కు భారతదేశం కలిగించిన నష్టాన్ని అవి ధ్రువీకరించలేదు. పైగా, భారతదేశం అంగీకరించని నష్టాలను పదే పదే చెబుతూ వచ్చాయి. పాకిస్థానే

కాళ్ల బేరానికి వస్తే, తాము కాల్పుల విరమణ చేశామని భారత్ చెబుతుండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన జోక్యం వల్లనే యుద్ధం ఆగిందని పదే పదే చెప్పసాగారు. భారతదేశం ఎన్నిసార్లు ఖండించినా సరే, ట్రంప్ మాత్రం తగ్గలేదు. ఇటీవల భారత భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ఒక విద్యాసంస్థ కార్యక్రమంలో మాట్లాడుతూ, న్యూయార్క్ టైమ్స్‌తో సహా పశ్చిమ దేశాల మీడియా ఎట్లా పక్షపాతంతో ఉందో చెప్పారు. పాకిస్థాన్‌కు భారత్ కలిగించిన నష్టాల ఫోటోలు ఎన్నో మీడియాల్లో వచ్చాయని, భారత్‌కు నష్టం కలిగిందని చెప్పేవారు ఒక్క ఫోటో కూడా చూపించలేకపోయారని ఆయన గుర్తుచేశారు. భారతదేశ జాతీయవాద నాయకత్వానికి, ప్రపంచ పెద్దలకు మధ్య ఉన్న ఒక పోటీని, వైరుధ్యాన్ని ఈ ఫిర్యాదులు సూచిస్తాయి. భారత-పాక్ వైరుధ్యాలలో ప్రపంచం భారత్ వైపు పెద్దగా లేదు అన్నది ఒక వాస్తవం. ఇండియా ఎంత వివాదాలకు దూరంగా ఉండాలనుకున్నా, దాన్ని ఎవరూ పూర్తి విశ్వాసంతో చూడడం లేదు. ఒక పెద్ద మార్కెట్‌గా తప్ప, ఒక గౌరవనీయ శక్తిగా పరిగణన మిగలడం లేదు. భారత్ ఆధిక్యాన్ని తగ్గించి చూపడమే కాకుండా, పాకిస్థాన్ సైన్యాధికారిని వైట్‌హౌస్‌కు పిలిచి మరీ విందు ఇచ్చిన ట్రంప్, ప్రపంచంలోని ఏ దేశాల మధ్య సంధి కుదరాలో, ఎవరు ఎవరి మీద గెలవాలో, ఎవరిది సరైన పక్షమో నిర్ణయించవలసింది తానేనని కుండబద్దలు కొట్టారు.

బ్రెజిల్‌లో 'బ్రిక్స్' సదస్సు జరుగుతుండగానే, బ్రిక్స్‌తో ఉంటే సుంకాలు పెంచుతా అన్నారు ట్రంప్. ఆ సదస్సుకు హాజరు అయినవాళ్లనే కాదు, అందులో వ్యవస్థాపక సభ్య దేశమైన భారత్ మీద కూడా ఆయన కొరడా ఝుళిపించారు. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీ గురించి ఆలోచించడమే బ్రిక్స్ చేసిన నేరం. బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఆ విషయంలో పట్టుదలగా ఉన్నాయి. భారతదేశం మాత్రం ప్రత్యామ్నాయ కరెన్సీ విషయంలో ఆసక్తిగా లేదు. అట్లాగని, డాలర్‌ను వ్యతిరేకించే లేదా డాలర్‌తో నిమిత్తం లేని వాణిజ్యం నుంచి భారత్ లాభపడలేదని కాదు. రష్యాతో రూబుల్-రూపీ వ్యాపారం చేసినప్పుడూ, మొదటి గల్ఫ్ యుద్ధం తరువాత, ఇరాక్ మీద ఆంక్షలు విధించిన కాలంలోను, గత రెండు దశాబ్దాలుగా ఇరాన్ మీద ఆంక్షలు ఉన్న కాలంలోను, వస్తుమార్పిడి పద్ధతిలో, డాలర్‌ను దాట వేసిన లాభదాయకమైన వాణిజ్యాన్ని భారత్ అనుభవించింది. అగ్రరాజ్యానికి ఆగ్రహం వస్తుందని తెలిసీనా, ద్వైపాక్షిక సంబంధాల పేరుతో దాన్ని కొనసాగించింది. కానీ, డాలర్ రహిత వాణిజ్యాన్ని ఒక రాజకీయార్థిక ప్రతిపాదనగా మూడో ప్రపంచ దేశాలు ముందుకు తీసుకువస్తే, ఆ ఉద్యమంలో పాల్గొనడానికి మాత్రం భారత్ ధైర్యం చేయడం లేదు. బ్రిక్స్ గురించి ట్రంప్ బెదిరింపుల మీద భారత్ ఎటువంటి స్పందనలూ ఇవ్వలేదు. భారత్ వాణిజ్యంపై ట్రంప్ విధిస్తున్న సుంకాల విషయంలో కూడా, సాధ్యమైనంత అనుయయంగా ఉభయతారకమైన ఒప్పందం చేసుకోవాలని చూస్తున్నది.

మరి అలీనోద్యమం కాలంలో, ప్రపంచంలో ఎక్కడ ఏ స్వాతంత్ర్య పోరాటం జరిగినా, జాతి విముక్తి ఉద్యమం జరిగినా, వివక్షలు కొనసాగుతున్నా, భారత్ వాటిని ఖండించడంలో ముందుండేది. అది కేవలం, సోవియట్ యూనియన్ అండ చూసుకుని మాత్రమేనా ? ఏకధ్రువ ప్రపంచం ఏర్పడుతున్న సూచనలు కనబడగానే, మనం మారిపోయామా ? మొదటి గల్ఫ్ యుద్ధం సందర్భంగా, ఇరాక్ నుంచి, కువాయిట్ నుంచి భారతీయులందరినీ క్షేమంగా వెనక్కు తీసుకురావడానికి దౌత్య స్నేహాన్ని ఉపయోగించుకుని, ఆ వెనువెంటనే, అమెరికా విమానాలకు ఇంధనం నింపుకునే వెసులుబాటు కల్పించిన చరిత్ర ఆనాటి ప్రభుత్వాలది. సాంప్రదాయ మైత్రిని చెప్పుకుంటూ, ఇరాన్ నుంచి చవుకగా చమురును సంపాదిస్తూ, ఆ దేశానికి కష్టం వచ్చినప్పుడు, మాటసాయం కూడా మనం చేయలేకపోయాం. అటు యుక్రెయిన్ విషయంలో రష్యాను ఖండించలేదు, గాజా ఊచకోతలనూ వద్దనలేదు. దేశంలోపల మహా శౌర్యంతో ఏకపాత్రాభినయాలు చేస్తూ, లోకపు కొలువు కూటంలో విదురనీతులూ, సన్నాయినొక్కులూ ప్రసాదిస్తే ఎట్లా? ఇజ్రాయిల్‌తో, అమెరికాతో ఎన్నో మొహమాటాలు ఉన్న దేశాలు కూడా ఇరాన్ మీద అమెరికా దాడిని ఖండించాయి. మన మెందుకు ఆ పని చేయలేకపోయాము? ఇది కేవలం తీవ్ర జాతీయవాద పాలనలోనే జరుగుతున్నది కాదు. మూడున్నర దశాబ్దాలుగా అన్ని పార్టీల హయాంలోనూ జరుగుతూ వస్తున్నదే. కాకపోతే, దేశభక్తిని, స్వాభిమానాన్ని ఎక్కువగా ఉచ్చరించే పాలకుల కాలంలో కూడా మనం ఎందుకు 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' పేరుతో 'నొప్పించక తానొవ్వక' తిరుగుతున్నామన్నదే ప్రశ్న.

మనతో వాణిజ్య అవసరాలు, సహకార అవసరాలు ఉన్న చిన్న దేశాలు, ఘనస్వాగతాలు ఇస్తాయి. పౌరపురస్కారాలు అందిస్తాయి. అక్కడ మనకు కాంట్రాక్టులు లభిస్తాయి. అక్కడ ఉండిన వలస భారతీయులకు మనం ఓసిఐ కార్డులు ఇస్తాము. బాగానే ఉంటుంది. కానీ, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌తో ఖచ్చితంగా నిలబడిన ఒక్క దేశం కూడా లేకపోవడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి? మన దేశంతో వాణిజ్య అవసరాలున్న టర్కీ అవసరమైనప్పుడు పాకిస్థాన్‌తో నిలబడింది. అట్లా భారత్‌తో ఎవరు నిలబడ్డారు? చాటుగా, నర్మగర్భంగా సమర్థనలు ఇవ్వడం వేరు. పాకిస్థాన్‌కే తన ఓటు అన్నట్టు అమెరికా బాహాటంగా ఎందుకు వ్యవహరించింది? అసలు దక్షిణాసియాలో ఏ ఒక్క దేశంతోనూ భారతదేశానికి మంచి పొరుగు సంబంధాలు ఎందుకు సాధ్యం కావడం లేదు? ఒక ఆత్మ విశ్వాసంతో, రాజకీయ నిబద్ధతతో కూడిన విదేశాంగ

విధానం లేకపోవడమే ఇందుకు కారణం కాదా? అన్నిటికీ దూరంగా ఉండడం, అన్నది ఎవరికీ కానీ వారముగా మనల్ని మార్చి వేయడం లేదా?

ఈ పరిస్థితి భారతదేశ ప్రజల మీద ఎటువంటి ప్రభావం వేస్తుంది? విదేశాంగ విధానంలో సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండాలా లేదా అన్నది పెద్ద చర్చ. ఇజ్రాయిల్ మీద జాతిహనన ఆరోపణలతో అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లవలసిన అగత్యం దక్షిణాఫ్రికాకు ఏమిటి? బాహుబలి వంటి అమెరికా మీద ప్రతీకార దాడులు చేయగలిగే తెంపరితనం ఇరాన్‌కు ఏమిటి? అమెరికా మీద ఆధారపడకుండా, సొంత సైనికశక్తిని పెంచుకోవాలని మాట్లాడగలిగే ధైర్యం ఫ్రాన్స్‌కు ఎట్లా వచ్చింది? అమెరికా వెలివేతతో ఒంటరి దేశంగా అణగారిపోతున్నప్పటికీ క్యూబాకు పశ్చిమాసియా యుద్ధాలలో వైఖరులు తీసుకోవలసిన అవసరం ఏమిటి? ప్రపంచంలో అనేక దేశాలు, తమ విశ్వాసాల మీద పట్టింపుతో ప్రమాదంతో కూడిన విధానాలను అనుసరిస్తున్నారు. వాళ్ల ప్రజలు ఆయా దేశాల ప్రభుత్వాల వెంట ఉన్నారు. నిజానికి, ఆ ప్రజలలో ఉన్న మనోభావాలు, సైద్ధాంతిక భావాలే పాలకుల తీరును శాసిస్తున్నాయి. మరి మన దేశ ప్రజలు ఇప్పుడు దేశభక్తితో ఉప్పొంగిపోతున్న స్థితిలో ఉన్నారు. ప్రపంచదేశాలను సవాల్ చేయగలిగితే నాయకులను మరింత గాఢంగా ఆరాధిస్తారు. మరి నేతలు అట్లా ఎందుకు లేరు? పాకిస్థాన్ మీదకే మన ప్రతాపాలను పరిమితం చేయడం ఏమీ జాతీయవాదం ? ప్రజలు కూడా, మన నాయకులు ప్రపంచ వీధిలో యాభైయ్యారు అంగుళాల ఛాతీ విప్పార్చుకుని నడవాలని ఎందుకు ఆశించడం లేదు?

యాభై ఏళ్ల కింద, బయటి ప్రపంచానికి విముక్తి ఉద్యమాల సమర్థకురాలిగా ఇండియా కనిపిస్తున్నప్పుడు, దేశంలోపల ప్రజల ఆకాంక్షలను అణచివేస్తూ దుష్పరిపాలన అందిస్తున్నది. ఆ వైరుధ్యాన్ని టంకశాల అశోక్ "అలీనభుజంగాలు" అన్న కవితలో ప్రభావవంతంగా నిలదీశారు. "బయటి ప్రపంచానికి నువ్వు ఏమైనప్పటికీ, ఇంట్లో మాత్రం నువ్వు హీనమైన, క్రూరమైన దానివే" అని ఆ కవిత అభిశంసిస్తుంది. ఇప్పుడు ఆ విమర్శ తలకిందులు కావలసివస్తుంది. దేశీయంగా దుష్పరిణామాలకు లోటేమీ లేదు. మరిన్ని కోరలు కత్తులు మొలిచాయి. బయటి ప్రపంచానికి ప్రదర్శన ఉదాత్త మోహమూ ఇప్పుడు లేదు. కాకపోతే, లోపలి, బయటి మోహాలను ఖాతరు చేయకుండా నేతల భక్తి పారవశ్యంలో తరించే సమాజం రూపొందింది. అశోక్ తరహాలో ఇప్పుడు నిలదీయాలంటే, "ఇంట్లో నువ్వెంత వీరుడివైనా బయట మాత్రం భీరుడివే" అని అనాలి. ఇంట్లోనే, ఇంట్లో మాత్రమే పల్లకిమోత! ❑

## ఎమర్జెన్సీ : ప్రకటితం వర్సెస్ అప్రకటితం

**(9వ పేజీ తరువాయి)**

కోరిన తొలి సామాజిక, రాజకీయ శక్తి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, జన సంఘలే. వాళ్ల నాయకులు మాత్రమే జైళ్ల బయట ఉన్నారు. నామమాత్రంగా జైలు జీవితం గడిపిన వారిలో అటల్ బిహారి వాజ్‌పేయి (ఎక్కువకాలం ఆసుపత్రిలోనే ఉన్నారు), ఎల్‌కే అద్వానీ, అరుణ్ జైట్లీ మాత్రమే. ఆర్‌ఎస్‌ఎస్ ఎమర్జెన్సీ వ్యతిరేకంగా పోరాడనే లేదు. మరి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట కీర్తిని సంపాదించడానికి బీజేపీ ఎందుకు ప్రయత్నం చేస్తుంది?" అంటూ ప్రభాస్ జోషి ప్రశ్నించారు.

తర్వాత కాలంలో దేవరస్ రాసిన లేఖలన్నీ హిందూ సంఘటన పాలక రాజకీయాలనే పుస్తకంగా ప్రచురించబడ్డాయి. నోయిడా కేంద్రంగా ఉండే జాగృతి ప్రకాశన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ విషయాన్ని అప్పట్లో ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా ఉన్న టీవీ రాజేశ్వర్ కూడా వెల్లడించారు.

పత్రికలపై నియంత్రణ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, మురికివాడల తొలగింపు ఆ కాలపు చీకటి జ్ఞాపకాలు. కానీ గత పదేళ్లలో పౌరమేధావులను, శాంతియుత పోరాటాల్లో పాల్గొనే వారిని, జర్నలిస్టులను అరెస్టు చేయటం చూస్తున్నాము. ప్రధాన స్రవంతి మీడియా పాలకవర్గం ముందు వొంగిపోవటాన్ని లొంగిపోవటాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాము. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని దేశ ద్రోహులుగా ముద్ర వేయడం చూస్తున్నాము. 146 మంది పార్లమెంట్ సభ్యులను బహిష్కరించడం చూస్తున్నాము.

ఈ కాలంలో మానవ హక్కుల ఉల్లంఘనలో ప్రభుత్వానికి ఎంత పాత్ర ఉందో ఆర్‌ఎస్‌ఎస్ పదాతి దళాలకు అంతే పాత్ర ఉంది. 1975 నాటి ప్రకటిత ఎమర్జెన్సీతో పోలిస్తే గత పదేళ్ల కాలంలో పరిస్థితులు మరింత దిగజారాయి. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విమర్శించిన నయనతార వర్తమాన పరిస్థితిని అప్రకటిత ఎమర్జెన్సీగా పిలవటాన్ని ఈ కోణంలోనే అర్థం చేసుకోవాలి. నయనతార సెహగల్ మాటల్లో "ప్రస్తుతం మనం అప్రకటిత ఎమర్జెన్సీలో బ్రతుకుతున్నామన్నది సందేహానికి తావులేని విషయం. భావప్రకటన స్వేచ్ఛపై జరుగుతోన్న అనూహ్యమైన దాడిని చూశాము. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిపాదిత భారతదేశమనే భావనలో ఇమడని భారతీయులను పట్టపగలే చంపేస్తున్నారు. అంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంది. ఈ పీడకలతో పోల్చదగినదేమీ లేదు." 1975 నాటి ఎమర్జెన్సీ రోజులను మనం గుర్తు చేసుకుంటున్నాము. ప్రస్తుతం మన కళ్ళ ముందు అమలవుతోన్న అప్రకటిత ఎమర్జెన్సీని అధిగమించ డానికి అడుగు ముందుకు వేయాల్సిన అవసరం ఉంది. ❑

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

# మోదీ 75 భగవత్ మాటలో మర్మమేమిటి



- రాజ్‌దీప్ సర్దేశాయి

'మా కాంగ్రెస్‌లో ముఠా కుమ్ములాటలు బహిరంగంగా జరుగుతాయి. ఎటువంటి దాపరికం ఉండదు. భారతీయ జనతా పార్టీలో కలహాలు, కుమ్ములాటలు అన్నీ మూడోవాడి కంటికి కనిపించకుండా గుట్టుగా సంభవిస్తుంటాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు వాపోయారు. బహిరంగ ఆరోపణలు, ప్రత్యారోపణలతో స్వీయ లక్ష్యాలు సాధించు కోలేకపోగా ప్రత్యర్థి పార్టీలకు ప్రయోజనాలు చేకూర్చడమనే ప్రవృత్తి కాంగ్రెస్ నేతలలో మెండుగా కనిపిస్తోంది. కేరళలో శశిథరూర్, పీసీసీ నాయకుల మధ్య వాగ్వాదాలు కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాల పరస్పర నిందలు అందుకు తాజా నిదర్శనాలు. కాంగ్రెస్‌కు విరుద్ధంగా బీజేపీ, సంఘ్ పరివార్‌లో అధికారానికి, ఆధిపత్యానికి అంతర్గత పోటీలు చాలా చాలా అరుదుగా మాత్రమే ప్రజల దృష్టికి వస్తాయి. కారణమేమిటి ? చిన్నపాటి జగడం సైతం మీడియా దృష్టికి వెళ్లకుండా సంఘీయులు, బీజేపీ శ్రేణులు అత్యంత జాగ్రత్త వహించడమేనని చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్ పాలనా వ్యవహారాలలో పెత్తనానికై అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ మధ్య ఎడతెగని పోటీ, బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో నెలల తరబడి జాప్యానికి ఆరెస్సెస్, బీజేపీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం పతాక శీర్షికలుగా కాదు కదా వార్తలుగా కూడా కనిపించడం అరుదే. అంతర్గతంగా జరుగుతోన్న వాదోపవాదాల గురించి ఏమి మాట్లాడితే ఏమి ముప్పు వాటిల్లుతుందో అన్న భయాందోళనలు సంఘ్, బీజేపీ శ్రేణులను కట్టడి చేయడం పరిపాటి.

ప్రజా జీవితంలో ఉన్న వారు 75 ఏళ్ల వయస్సు రాగానే బాధ్యతల నుంచి వైదొలగాలని, పదవీ విరమణ చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ సలహా ఇవ్వడం పలువురిని విస్మయపరిచింది. ఎంతో మందిని దిగ్భ్రాంతిపరిచింది. కొంత మందికి కించిత్ అసంతృప్తి కలిగించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 75వ పుట్టినరోజు జరుపుకోనున్నారు. అదే నెలలో మోహన్ భగవత్ సైతం 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. సంఘ్ అధినేత వ్యాఖ్యలకు ప్రతిపక్షాలు వెన్వెంటనే ఆనందోత్సాహాలతో ప్రతిస్పందించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారసుడు ఎవరో తక్షణమే నిర్ణయించేందుకు సంఘ్ నాయకత్వం ఆరాటపడుతోందని అనేందుకు భగవత్ వ్యాఖ్యలే తార్కాణమని విపక్షాలు గట్టిగా అభిప్రాయపడుతున్నాయి. 'మోదీ తరువాత, ఎవరు?' దశాబ్దాల క్రితం నాటి 'నెహ్రూ తరువాత, ఎవరు?' అన్న చర్చను జ్ఞాపకం చేస్తోంది. మోదీ తరువాత ఎవరు అన్నది చాలా ఆసక్తికరమైన విషయం, సందేహం లేదు. చర్చలు మొదలయ్యాయి, ముమ్మరమయ్యాయి. అయితే వాస్తవాన్ని పరిశీలిస్తే వాద్‌నగర్ నుంచి ప్రభవించిన వ్యక్తి చాలా మంది ఆశిస్తున్నట్టు చాలా తొందరగా ఆ ప్రతిష్ఠాత్మక పదవి నుంచి వెళ్లిపోతారా? పోరు, కచ్చితంగా. 2024 సార్వత్రిక ఎన్నికలపై నేను రాసిన పుస్తకంలో పేర్కొన్న ఒక ఆసక్తికరమైన ఉదంతాన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను. ఆరు నూరైనా సరే అధికారంలో కొనసాగడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తారనేది ఆ ఉదంతం విశదం చేస్తుంది. నవ యువకుడిగా ఉన్నప్పుడు మోదీ అహ్మదాబాద్‌లో తన బాబాయి టీ స్టాల్‌లో కొంతకాలం పనిచేశారు. వాద్‌నగర్ నుంచి అహ్మదాబాద్‌కు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులో వెళుతుండేవారు. అదే బస్సులో తిరిగి వాద్‌నగర్‌కు వెళ్లేవారు. అహ్మదాబాద్ చేరగానే తిరిగి వెళ్లేందుకు సీటు రిజర్వేషన్‌కై తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలివేసేవారట! ఈ కథ నుంచి తెలుసుకోవల్సిన విషయమేమిటి ? మోదీ ఒకసారి ఒక కుర్చీలో కూర్చుంటే దాన్ని మరెవరూ ఆయన నుంచి లాక్కోలేరు! గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఈ ఆసక్తికరమైన కథను నాకు చెప్పారు. నిజం కావచ్చు, కాకపోవచ్చు.

అయితే దానిలో అంతర్లీనంగా ఉన్న సందేశమిది : అధికారం చెలాయించడం, పెత్తనం చేయడం మోదీ సహజ స్వభావం. తన భవిష్యత్తుపై తనకు పూర్తి నియంత్రణ లేకపోవడమనేది ఆయనకు సుతరామూ నచ్చని విషయం. అటువంటి నాయకులు పదవీ విరమణ చేయడం కాదు కదా అప్రధానంగా ఉండడానికి ఏ మాత్రం ఇష్టపడరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు ఏ విషయంపైన అయినా ఆచితూచి మాట్లాడుతారు. మరి మోహన్ భగవత్ హఠాత్తుగా పదవీ విరమణకు 75 ఏళ్ల వయస్సు గురించి ఎందుకు ప్రస్తావించారు? సంఘ్‌లో ఒక వర్గంవారు బీజేపీలో తరం మార్పును కోరుకుంటున్నారని అధికార నడవాలలో గుసగుసలు గట్టిగా విన్పిస్తున్నాయి. బీజేపీ, ఆరెస్సెస్ నాయకత్వాల మధ్య గుంజాటన 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో బహిర్గతమయింది. ఆరెస్సెస్ మద్దతు

తప్పనిసరిగా అవసరమైన నాటి కాలం నుంచి బీజేపీ ఇప్పుడు బాగా ఎదిగిందని, తన వ్యవహారాలను తానే బాగా చక్కదిద్దు కోగల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా సంతరించుకున్నదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. నడ్డా వ్యాఖ్యలు సంఘ్ పరివార్ నాయకత్వ శ్రేణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. మోదీ ఆరాధన కేంద్రంగా పెంపొందిన రాజకీయ పరిస్థితుల పట్ల ఆరెస్సెస్ నాయకత్వంలో నెలకొన్న అసంతృప్తి, చిరాకును ఆ ఆందోళన ప్రతిబింబించింది. పెచ్చురిల్లిపోతున్న మోదీ వ్యక్తిపూజ పట్ల మోహన్ భగవత్ తన ఆవేదనను గత సెప్టెంబర్‌లో వెలువరించిన ఒక ఉపన్యాసంలో ఇలా వ్యక్తం చేశారు : **'ప్రజాహిత కృషి ద్వారా ప్రతి ఒక్కరూ గౌరవాదరాలు పొందవచ్చు. అయితే మనం అటువంటి సమున్నత స్థితికి చేరామా లేదా అన్నది నిర్ణయించవలసింది ఇతరులే కాని మనకు మనమే కాదు. ఎవరైనా సరే తనకు తానుగా భగవంతుడనని ఎట్టి పరిస్థితులలోను ప్రకటించుకోకూడదు'.** మోదీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని నిశ్చితంగా చెప్పవచ్చు.

అయితే తమ రాజకీయ, భావజాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే మోదీ నాయకత్వం తప్పనిసరి అన్న విషయం ఆరెస్సెస్‌కు బాగా తెలుసు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఒక సర్వేలో మోదీకి లభిస్తున్న ప్రజాదరణ బీజేపీకి ఉన్న ప్రజా మద్దతు కంటే అధికంగా ఉన్నదని వెల్లడయింది. ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు ప్రధానమంత్రి నాయకత్వం కారణంగానే తాము బీజేపీకి ఓటు వేశామని చెప్పారు. మోదీ నాయకత్వం లేకపోతే బీజేపీ దుర్బలమైపోవడం ఖాయమని ఆ సర్వే స్పష్టం చేసింది. బ్రాండ్ హిందుత్వకు రాజకీయ చిహ్నం మోదీ. హిందుత్వ శ్రేణులకు ఆయన సర్వసేనాధిపతి. ప్రజలను హిందుత్వ వైపు ఆకర్షించే ప్రధానశక్తి ఆయనే. ఒక విధంగా మనం 'మోదిత్వ' యుగంలో ఉన్నాం. వ్యక్తిపూజ మెల్లమెల్లగా మతపరమైన మెజారిటేరియ నిజంగా పరిణమిస్తున్న శకమిది. విస్తృత వ్యాప్తి, పెరిగిన పలుకుబడితో సంఘ్ పరివార్‌లో సైతం ప్రభావ శక్తుల నాయకత్వ ధోరణులలో ఒక స్పష్టమైన మార్పు వచ్చింది. తన వందేళ్ల మనుగడలో ఆరెస్సెస్, సంఘ్ పరివార్ భావజాల గంగోత్రిగా ఉన్నది సంఘ్ మాటే తుది మాట. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం.

నరేంద్రమోదీ జాతీయస్థాయిలో రంగంలోకి వచ్చిన తరువాత, సంఘ్, బీజేపీ మధ్య సంబంధాలలో మార్పులు అనివార్యమయ్యాయి. అయితే బీజేపీ ఇప్పటికీ తనకు అవసరమైన మద్దతును అట్టడుగు స్థాయిలో సువ్యవస్థితంగా పాదుకుపోయిన సంఘ్ శాఖల నుంచే పొందుతున్నది. అయితే నాయకత్వ స్థాయిలో ఇప్పుడు బీజేపీకి ప్రధాన ఆలంబన ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే, సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కాదు. భగవత్ సమానుల్లో ప్రథముడు మాత్రమే. వాజపేయి ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మోదీ ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మధ్య సంభవించిన మార్పు ఇది. నాడు ఇరవైకి పైగా పార్టీలు భాగస్వాములుగా ఉన్న కూటమికి నాయకత్వం వహిస్తున్న వాజపేయిని సంఘ్ ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై విమర్శిస్తుండేది. మోదీ సైతం ఆరెస్సెస్ ప్రచారక్ స్థాయి నుంచి జాతీయస్థాయి రాజకీయ వేత్తగా పరిణమించిన అనితరసాధ్యుడు అనేది ఎవరూ విస్మరించరు, విస్మరించలేరు. వాజపేయి హయాంలో ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న కేఎస్ సుదర్శన్ బహిరంగంగానే ప్రభుత్వాన్ని విమర్శించేవారు.

వాజపేయి పాలనా నిర్ణయాలు తీసుకొంటున్న తీరుతెన్నులను ఆయన ఆక్షేపించేవారు. వాజపేయిని బహిరంగంగానే విమర్శించేవారు. సుదర్శన్ వ్యవహరిస్తున్న తీరుకు వాజపేయి చిరాకుపడేవారు. సహనం కోల్పోయిన వాజపేయి ఒకసారి, 'నేను అలసిపోలేదు, పదవీ విరమణ చేయను' అని స్పష్టంగా ప్రకటించారు. వాజపేయి పట్ల సుదర్శన్ వ్యవహరించినట్లుగా మోదీని తాను నేరుగా ఎదుర్కోలేనన్న విషయం మోహన్ భగవత్‌కు బాగా తెలుసు. ప్రస్తుత సర్ సంఘ్ చాలక్ చేయగలిగిందల్లా ఒక లక్ష్మణ రేఖ గీయడమే. తద్వారా మోదీ–షా ద్వయం నిరంకుశాధికార నాయకత్వానికి పరిమితులు ఉన్నాయని స్పష్టం చేయడం మాత్రమే. 75 ఏళ్ల వయసు వచ్చినవారు పదవుల నుంచి నిష్క్రమించాలని ప్రకటించడం ఒక ప్రారంభ ఎత్తుగడ మాత్రమే. మొదటి ఎత్తుగడే ఆట కట్టిస్తుందా? అసాధ్యమన్న విషయం భగవత్‌కు తెలుసు.

**75 ఏళ్ల వయసు పైబడిన ఎల్‌కే అద్వాణీ, మురళీమనోహర్ జోషీ లాంటి పార్టీ అతిరథ మహారథులను రంగం నుంచి తొలగించేందుకు మోదీ–షా నాయక ద్వయం 2015లో 'మార్గదర్శక్ మండల్' అనే భావనను ప్రవేశపెట్టడం ద్వారా ఆ ఇరువురు సీనియర్ నాయకులను పూర్తిగా విశ్రాంత జీవితంలోకి పంపించారు. అది పదేళ్ల కిందటి మాట. అయితే ప్రస్తుత దశలో 'మార్గదర్శక్' లాంటి పాత్రకు పరిమితమయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బలవంతం చేయలేమన్న యథార్థాన్ని ఆరెస్సెస్ గ్రహించింది.**


మోదీ అనంతర బీజేపీకి యువ నాయకత్వాన్ని సమకూర్చేందుకు మరింత సర్వ జనామోద మార్గాన్ని సృష్టించాలని సంఘ్ అభిలషిస్తోంది. 'కౌన్ బనేగా బీజేపీ ప్రెసిడెంట్' అన్న క్లిష్టమైన ప్రశ్న ఇప్పుడు అటు సంఘ్‌కు ఇటు బీజేపీకి చిరాకు కలిగిస్తోంది. ఈ ప్రశ్నకు లభించే సమాధానం–ఆధిపత్యానికి చాలా గుట్టుగా జరుగుతున్న అంతర్గత పోరులో సానుకూలతలు ఎవరికి ఉన్నాయనేది స్పష్టం చేస్తుంది. ❑

# సత్యాన్వేషణలో జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు

సమీక్షకులు : తంగిరాల చక్రవర్తి

తెలుగు రాష్ట్రాల్లో కవిగా, విమర్శకునిగా, అనువాదకునిగా, అధ్యాపకునిగా సౌభాగ్య ప్రసిద్ధులు. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో సౌభాగ్య విశేష కృషి చేశారు. సంధ్యా బీభత్సం, కృత్యా వ్యవస్థ, సింహావలోకనం, పునరుత్థానం, ప్రేమ కవితలు, ప్రసిద్ధ ఉర్దూ కవులు, ఆధునిక ప్రపంచకవులు, ఇరవయ్యో శతాబ్దం ఇంగ్లీషు కవులు, ఈ కాలం కవులు, ప్రపంచ సాహిత్య పరిచయం గ్రంథాలు, ఆస్కార్ వైల్డ్ ఆలోచనలు, పాశ్చాత్య సంగీతకారులు, ఈసఫ్ కథలు, గ్రీకు రోమన్ కథలు, అక్బర్ బీర్బల్ కథలు, ఓషో రచనల పరిచయంలాంటి ఎంతో విలువైన గ్రంథాలను సౌభాగ్య రాశారు. సాభాగ్య అనేది కలం పేరు. అసలు పేరు విజయకుమార్. తెలుగు పాఠకలోకానికి జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలను పరియచం చేస్తూ "జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు" అనే పుస్తకాన్ని సౌభాగ్య రాశారు. ద్వైదీభావాన్ని, వైరుధ్యాన్ని అధిగమిస్తూ అధ్యయనం చేయాల్సిన పుస్తకం ఇది.

తన తమ్ముడు చనిపోవడంతో ఒంటరిగా మిగిలిపోయిన జిడ్డు కృష్ణమూర్తి సత్యాన్వేషణలో పడ్డారు. కోట్ల ఆస్తిని వదిలి బుద్ధుని అన్వేషణలో మునిగారు. ప్రపంచమంతా పర్యటించారు. ఆ తర్వాత తనకు తెలిసిన జ్ఞానం, జీవిత సత్యాలు, ఉపన్యాసాలుగా కృష్ణమూర్తి ప్రజలకు చెప్పారు. ఈ క్రమంలోనే ఒకానొకసారి జిడ్డు కృష్ణమూర్తిని అనిబిసెంట్ ఐరోపా తీసుకెళ్లారు. అయితే, ఆయన ఆలోచనలు తెలియజేస్తూ సత్యం ఎంత బలమైనదో 45 భాగాల్లో సౌభాగ్య అద్భుతంగా, అర్థవంతంగా అక్షరీకరించారు. ఈ పుస్తకంలో సత్యం అన్నది ఎంత "స్వచ్ఛమైనదో, మన సరిహద్దులకు లొంగనిదో గ్రంథం తెరిస్తే తెలిసి వస్తుంది. ఎన్నో జీవిత సత్యాలను జిడ్డు కృష్ణమూర్తి తెలియజేస్తే, సౌభాగ్య తెలుగుపాఠకులకు పరిచయం చేశారు. ఏకాంతం-ఒంటరితనం, జీవించడం-మరణించడం, మతం-దేవుడు,




ధ్యానం-జ్ఞానం, యధార్థం-సత్యం, బాధ- విషాదం, హింస-భయం, కోరిక-సెక్స్, మానవ సంబంధాలు- నమ్మకం, ఆధిపత్యం-అధికారం, చర్య-చేతన, తెలివి- బుద్ధి బలంలాంటి అంశాలపై చక్కటి విశ్లేషణతో పాఠకులకు అవగాహన కల్పిస్తారు. సీరియస్‌గా ఒక లక్ష్యం, ఆశయం, తర్కబద్ధమైన ఆలోచనతో అర్థం చేసుకుంటూ ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. సాంకేతిక జ్ఞానం-మానసిక జ్ఞానం మనిషికి ఎంతో అవసరం. వివేకం ఉండాలి. మన అంతః చేతనలో, చేతనలో పేరుకు పోయిన గతాన్ని నిర్మూలించాలి. అప్పుడే ప్రేమ పుడుతుంది. ఆత్మజ్ఞానం అన్నది ఏ క్షణానికాక్షణం తెలిసి వచ్చేదే. ఈర్ష్య, ద్వేషం, దురాలోచన, భయం, కాంక్ష, అత్యాశ, వగైరాలన్నీ మనలిని ఒకలాగే నడిపిస్తాయి. ఆర్థిక-సామాజిక అంతరాలు మనలిని వేరు చేస్తున్నాయి. మనిషి నమ్మకంతో పనిచేయాలి. మనమే ప్రపంచం, మన సమస్యలే ప్రపంచ సమస్యలు. ఇలా ఎన్నో అంశాలు, శాస్త్రీయ అన్వేషణా పూర్వక విశ్లేషణే "జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు" అనే ఈ గ్రంథం. ❑

**మీ జీవితాన్ని నడిపిస్తున్న ప్రతి దానినీ ప్రశ్నించండి. మీ గురించి మీరు ఏర్పరుచుకున్న మనోబింబాన్ని పరీక్షించండి. మీ అపోహలను వదిలేయండి. మీ బాంధవ్యాలపై శ్రద్ధ చూపండి. ఆధ్యాత్మిక జీవనంలో ఆధిపత్యం చలాయించడానికి ఎవరికీ హక్కులేదు. మత గ్రంథాలకు లేదు. గురువులకు లేదు. ప్రతీ మానవుడు తన విముక్తిని కొత్తగా కనిపెట్టవలసిందే.**

**మిమ్మల్ని మీరు తెలిసికోవడం ఆరంభించిన క్షణం నుంచి మీలో అసాధారణమైన సృజనాత్మకత వికసించడం మొదలు పెడుతుంది. మీరెంతో పిసినిగొట్టులో, ఎంత జగడాల మారులో, ఎంత కోపిష్టులో, ఎంత అసూయాపరులో, ఎంత తెలివి మాలినవారో, ఉన్నది వున్నట్లుగా మీ నిజ స్వరూపం బయటపడడం మొదలవుతుంది.**

**- జిడ్డు కృష్ణమూర్తి**

# పెట్టుబడిదారీ వ్యవస్థ - కొనసాగుతున్న అభూత కల్పనలు

- ప్రభాత్ పట్నాయక్



ఆర్థికవేత్తలు పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి అభూత కల్పనలు చాలానే అల్లారు. అటువంటి కల్పనల్లో డేవిడ్ రికార్డో అల్లినది రెండు శతాబ్దాలకుపైనే కొనసాగింది. యంత్రాలను ప్రవేశ పెట్టడాన్ని మొదట్లో చాలా ఉత్సాహంగా ఆహ్వానించినవాడు రికార్డో. అతని కాలంలో కార్మిక సంఘాలు యంత్రాల ప్రవేశం వల్ల నిరుద్యోగం పెరుగుతుందని చేసిన వాదనలన్నింటినీ అతడు తోసిపుచ్చాడు. "ఆర్థిక సూత్రాలు" అన్న అతడి గ్రంథం మూడవ ప్రచురణలో మాత్రం ఒక అధ్యాయాన్ని ప్రత్యేకంగా యంత్రాల గురించి అదనంగా చేర్చాడు. అందులో యంత్రాల ప్రవేశం వల్ల నిరుద్యోగం పెరుగుతుందని రికార్డో అంగీకరించాడు. ఐతే, అది తాత్కాలికమేనని, యంత్రాల వల్ల లాభాల రేటు పెరుగుతుంది కనుక సంపద పోగు పడడానికి, వృద్ధి వేగవంతం కావడానికి అది తోడ్పడుతుందని, దీర్ఘకాలంలో దాని వలన మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని వాదించాడు.

రికార్డో వాదనను కార్ల్‌మార్క్స్ తన "అదనపు విలువ సిద్ధాంతం"లో చాలా నిశితంగా విమర్శించాడు. రికార్డో వాదన పలు కారణాల రీత్యా తప్పు అని స్పష్టం చేశాడు.

**మొదటిది :** రికార్డో యంత్రాలను ప్రవేశ పెట్టడం అనేది ఏదో ఒకసారి మాత్రమే జరిగే ప్రక్రియగా పరిగణించాడు. కాని పెట్టుబడిదారీ సమాజంలో సాంకేతిక మార్పులు అనేవి నిరంతరం జరిగే ప్రక్రియ. ఒక స్థాయి యంత్రాలకు బదులు మరొకస్థాయి యంత్రాలను తరచూ ప్రవేశ పెడుతూనే వుంటారు. అటువంటి సాంకేతిక పురోగతి ఫలితంగా లాభాల రేటు, సంపద పోగుబడడం అనేది పెరుగుతూనే వుంటుంది. అందుచేత అటువంటి యాంత్రీకరణ ఫలితంగా అందరికీ ఉపాధి కల్పించే పరిస్థితి అంతకంతకూ దూరమైపోతూ వుంటుంది.

**రెండవది :** సే సూత్రం చెల్లుబాటు అవుతుందని రికార్డో భావించి దాని ప్రాతిపదికన తన వాదనను రూపొందించాడు. ఆ సూత్రం ప్రకారం "స్థూల డిమాండ్‌కు ఏనాడూ కొరత ఉండదు. పెట్టుబడిదారుల వద్ద పోగుబడిన సంపదనంతటినీ మళ్ళీ పెట్టుబడుల రూపంలో పెడతారు గనుక పోగుబడే సంపద పెరిగిన మేరకు పెట్టుబడులూ పెరుగుతూ పోతాయి. దాని వలన అదనపు ఉపాధి అవకాశాలూ పెరుగుతూ పోతాయి. మార్కెట్ పెరుగుదలను అనుసరించి పెట్టుబడులు ఉండవు. ఎందుకంటే సంపదను డబ్బు రూపంలో దాచుకునేందుకు ఎవరూ సిద్ధంగా ఉండరు. అందువలన ఆ సంపద యావత్తూ పెట్టుబడులుగా మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. దాని వలన ఉపాధీ పెరుగుతుంది. డిమాండ్ కూడా పెరుగుతుంది." ఐతే ఈ వాదన అవాస్తవికమేగాక, తార్కికంగా కూడా చెల్లదు.

పెట్టుబడి ఎప్పుడూ మార్కెట్ పెరుగుదలను బట్టి ఉంటుంది అన్న వాస్తవాన్ని మనం గుర్తించినప్పుడు యంత్రాల ప్రవేశం కారణంగా కార్మికుల వేతనాల కోసం అంతవరకూ వెచ్చించిన సొమ్ము తగ్గి లాభాలు పెరుగుతాయి. అదే సమయంలో లాభాలు పెరిగే రేటు తగ్గుతుంది. ఎలాగో చూద్దాం. యంత్రాల ప్రవేశం ఫలితంగా వెంటనే నిరుద్యోగం పెరుగుతుంది. శ్రామిక ఉత్పాదకత పెరుగుతుంది కాని వేతనాల ఖర్చు మాత్రం పెరగదు. అందువలన వేతనాలకు చేసే ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయి. కార్మికుల వేతనాలను వారు దాదాపు పూర్తిగా ఖర్చు చేస్తారు. కాని లాభాల్లో ఒక చిన్న భాగాన్ని మాత్రమే యజమానులు ఖర్చు చేస్తారు. అందువలన మొత్తం ఆదాయంతో పోల్చినప్పుడు మొత్తం వినిమయం తగ్గుతుంది. దాని వలన సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోతాయి. అధికోత్పత్తి స్థితి ఏర్పడుతుంది. దాని ఫలితంగా వాస్తవంగా సంపద పోగుబడే రేటు తగ్గిపోతుంది.

యంత్రాలను ప్రవేశపెట్టడం వలన అంతిమంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న రికార్డో వాదనకు భిన్నంగా, వాస్తవానికి ఆ యాంత్రీకరణ ఉపాధి అవకాశాల పెరుగుదలను దెబ్బ తీస్తుంది. ఏదైనా ప్రత్యేక కాలాల్లో కొత్త యంత్రాలను వేటినీ ప్రవేశ పెట్టకుండా పాతస్థాయి యంత్రాలనే కొనసాగించినప్పుడు నిరుద్యోగం తగ్గవచ్చు. కాని అందుకు తొలుత చేపట్టిన యాంత్రీకరణ ఎంతమాత్రమూ కారణం కాదు. యాంత్రీకరణ కారణంగా ఎన్ని ఉద్యోగాలు పోయాయో వాటివరకూ అయినా తిరిగి కల్పించడం అనేది కొంతకాలం దాటిన తర్వాత జరగదు.

రికార్డో చిత్రించిన ఈ పెట్టుబడిదారీ రూపం పెట్టుబడిదారీ విధానానికి ప్రమాణంగా నేటికీ ఆమోదించబడుతోంది. మొదట్లో ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా, అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అందరికీ సౌభాగ్యాన్ని అందిస్తుంది అని నమ్ముతూంటారు. ఐతే ఇది ఏ మాత్రమూ వాస్తవం కాదు. పెట్టుబడిదారీ విధానం ప్రవేశపెట్టినప్పుడు తలెత్తే ఇబ్బందులను, కష్టాలను తర్వాత కాలంలో లేకుండా చేయగల ఏర్పాటు ఏదీ పెట్టుబడిదారీ విధానంలో లేనే లేదు. ఇక్కడ ఒక ప్రశ్న

రావొచ్చు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం మొదట ప్రారంభం అయిన పశ్చిమ యూరప్ దేశాలలో ప్రజల జీవన పరిస్థితులు ప్రారంభం నాటికన్నా తర్వాత కాలంలో వాస్తవంగా చాలా మెరుగుపడ్డాయి కదా? ఇదెలా జరిగింది?

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరిగిన చారిత్రిక సందర్భాలు రెండు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. **మొదటిది :** యూరప్ నుంచి చాలా భారీ సంఖ్యలో కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి ఉష్ణ, సమశీతోష్ణ మండలాలలకు వలసలు పోయారు. ఈ దేశాలన్నీ వారి ఆక్రమణకు గురయ్యాయి. వారంతా అక్కడే స్థిరపడ్డారు. ఆ తర్వాత కాలంలో యూరప్ నుంచి ఇండియా, చైనా, ఇండోనేషియా, ఇండో-చైనా వంటి దేశాలకు పోయినవారు వాటిని తమ వలసలుగా మార్చుకున్నారు. మొదటి దశలో వలసలు పోయిన ప్రదేశాల్లో భూములను ఆక్రమించుకున్నారు. వాటిని సాగు చేయసాగారు. అప్పుడు యూరప్‌లో ఉండిపోయిన కార్మికుల కనీస వేతనాల స్థాయి పెరిగింది. నిరుద్యోగమూ తగ్గింది. ఆ విధంగా ఈ వలసలు యూరప్‌లో యాంత్రీకరణ దుష్ఫలితాలైన నిరుద్యోగం వంటివి కొనసాగకుండా చేయగలిగాయి.

యూరప్ జనాభాతో పోల్చితే అక్కడి నుండి జరిగిన వలసల స్థాయి చాలా ఎక్కువ. దాదాపు 19వ శతాబ్దం అంతా, మొదటి ప్రపంచ యుద్ధం మొదలయే దాకా, యూరప్ నుండి వలసలు పోతూనే వున్నారు. వారు దాదాపు 5 కోట్ల మంది! బ్రిటన్ వంటి దేశంలోనైతే దేశ జనాభా వృద్ధి ఏటేటా ఎంత ఉండేదో, దాదాపు అందులో సగం మేరకు వలసలు ఉండేవి. ఇటువంటి స్థాయిలో వలసలు పోవడం, అది కూడా దీర్ఘకాలం పాటు కొనసాగడం వలన యూరప్ దేశాల్లో కార్మికులకు చాలా డిమాండ్ ఉండేది. ఆ దేశాలు యాంత్రీకరణ కారణంగా ఏర్పడిన నిరుద్యోగాన్నంతటినీ వలసల రూపంలో ఎగుమతి చేసేశాయని చెప్పవచ్చు. ఇది తమ తమ దేశాల హద్దులను దాటిపోయి ఇతర ప్రదేశాలను ఆక్రమించుకోడం కారణంగా జరిగిన పరిణామమే తప్ప అంతర్గతంగా ఆయా దేశాల్లోని పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కరించినది కాదు.

**రెండవ కారణం :** తాము జయించి వలసలుగా మార్చుకున్న ఇండియా వంటి దేశాలలో స్థానికంగా ఉన్న పరిశ్రమలను నాశనం చేసి సామ్రాజ్యవాద దేశాలు తమ ఉత్పత్తులను ఆ వలస దేశాల మార్కెట్లలో ప్రవేశ పెట్టడం జరిగింది. అందు వలన తమ స్వంత దేశాల్లో యాంత్రీకరణ కారణంగా తలెత్తే నిరుద్యోగాన్ని దేశీయ ఆర్థిక వ్యవస్థ ద్వారా గాక, ఇతర దేశాల్లో మార్కెట్లను ఆక్రమించడం ద్వారా పరిష్కరించుకున్నారు. ఇప్పటికీ మూడవ ప్రపంచ దేశాలలోని భారీ నిరుద్యోగాన్ని తమ స్వంత లాభాలను పెంచుకోడానికి వాడుకుంటూనే వున్నారు.

ఈ విధంగా పశ్చిమ దేశాల్లో యాంత్రీకరణ ఫలితంగా తలెత్తిన నిరుద్యోగాన్ని వలసలకు పోవడం ద్వారా, కొన్ని దేశాలను వలసలుగా మార్చి దోపిడీ చేయడం ద్వారా పరిష్కరించుకున్నారన్న చారిత్రిక కారణాలను పరిశీలించకుండా, ఆ పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలలో యాంత్రీకరణ పర్యవసానాలను అక్కడి వరకే పరిశీలించడం వలన మనకు తప్పుడు నిర్ధారణలు వస్తాయి. ఆ దేశాల్లో యాంత్రీకరణ ఫలితంగా ఏర్పడిన నిరుద్యోగం తర్వాత కాలంలో అదృశ్యమైపోయినట్లే మన దేశంలో కూడా జరుగుతుందన్న భ్రమ కలుగుతుంది.

ప్రస్తుతం మూడవ ప్రపంచ దేశాలకు చాలా కీలకమైన సమస్య ఇది. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ అను నిత్యమూ సాగించే ప్రచారాన్ని దైవ వాక్కులాగా స్వీకరిస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాలు పెట్టుబడిదారీ విధానాన్ని ఎటువంటి పరిమితులూ, నియంత్రణలూ లేకుండా అమలు జరిపితే కాలక్రమంలో మన దేశాలు కూడా పశ్చిమ యూరప్ దేశాల మాదిరిగా సంపన్న దేశాలు అయిపోతాయన్నదే ఆ ప్రచారం. పశ్చిమ యూరప్ అనుభవాన్ని ఉదాహరణగా చూపించడం వలన వాస్తవాన్ని సక్రమంగా అర్థం చేసుకోలేని స్థితి ఏర్పడుతోంది.

మన దేశంలో తొలి తరం ప్రణాళికావేత్తలు పి.సి.మహలనోబిస్ వంటి వారికి పశ్చిమ యూరప్ అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు పూర్తిగా తెలుసు. అందుకే వారు పెట్టుబడిదారీ విధానాన్ని దాని ఇష్టానికి వదిలి పెట్టలేదు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని వారు తలిచారు. అంతేకాక, చిన్న, కుటీర పరిశ్రమలను రక్షించడం ప్రభుత్వ విధానంలో భాగంగా ఉండాలని భావించారు. ఒకపక్క భారీ పరిశ్రమల స్థాపనను మహలనోబిస్ బలంగా సమర్థిస్తూనే, రెండవ పంచవర్ష ప్రణాళిక నాటికి ఆయన ఉపాధి కల్పనకు, వినిమయ వస్తువులు ఎక్కువగా అందుబాటులోకి రావడానికి వీలుగా చిన్న, కుటీర పరిశ్రమల విస్తరణ జరగాలని నిర్దేశించారు. చైనాలో కూడా ఇదే కాలంలో ఇదే విధంగా ఆలోచనలు జరిగాయి. వలస విధానం నుండి విముక్తి పొందిన మూడవ ప్రపంచ దేశాలలో ఎక్కువ చోట్ల అమలు జరిగిందిదే.

ప్రస్తుతం దేశంలో ఆర్థిక విధానాల మీద చర్చ దయనీయంగా దిగజారింది. 200 సంవత్సరాల క్రితం పెట్టుబడిదారీ విధానం గురించి ప్రచారం చేసిన అభూత కల్పనలనే నేటికీ వాస్తవం అని భావిస్తూ ప్రచారం చేస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాల్లో, మన దేశంతో సహా, పేదరికం తగ్గిపోయిందంటూ అబద్ధాలను ప్రచారం చేస్తూ అభూత కల్పనలను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ అభూత కల్పనల నుండి ఎంత త్వరగా బైట పడితే దేశానికి అంత మంచిది. ❑

# వేతనాల అసమానతలు ముక్కలౌతున్న కార్మికవర్గం

- సంజయ్‌రాయ్

**కరోనా మహమ్మారి ప్రభావంతో కార్మికుల వేతనాలు దిగజారడం గాని, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవడం గాని జరిగింది. ఆ పరిస్థితిలో తాజాగా కొంత మార్పు వచ్చిందని, ప్రపంచమార్కెట్‌లో కార్మికుల నిజ వేతనాలలో కొంత పెరుగుదల చోటు చేసుకుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదిక వెల్లడించింది. అయితే గత రెండేళ్ల కాలంలో కార్మికుల వేతనాలలో కొంత పెరుగుదల కనిపించినా, వారి వేతనాల్లో అసమానతలు పెరుగుతూనే వున్నాయి. పెట్టుబడి ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచంలో ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి సంచరించగలిగిన శక్తితో పెట్టుబడి ఉంది. కాని అదే విధమైన స్వేచ్ఛ కార్మికవర్గానికి లేదు. అందువలన ఎక్కడ చౌకగా కార్మికుల శక్తి దొరుకుతుందో అక్కడికిపోయి ఆ చౌక కార్మిక శక్తిని కొల్లగొట్టేందుకు పెట్టుబడి పూనుకుంటోంది. సరుకుల ఉత్పత్తిని ఒక దగ్గర కేంద్రీకరించకుండా దాన్ని ముక్కలు చేసి ఏ ఉత్పత్తి క్రమంలోనైతే కార్మికుల పాత్ర ఎక్కువగా అవసరమో ఆ భాగాన్ని మాత్రం చౌకగా కార్మికులు లభించే ప్రాంతానికి తరలించడం ప్రపంచీకరణలో అంతర్భాగం.**

స్వేచ్ఛా మార్కెట్ నేడు ఉనికిలో ఉందని అనుకోవడంకన్నా పెద్ద భ్రమ మరొకటి లేదు. గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువ స్థాయిలో నేడు ప్రపంచస్థాయి బహుళజాతి కార్పొరేట్లు తమ ఉత్పత్తి నెట్‌వర్క్‌లను అత్యంత కేంద్రీకృత పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాయి. తాము ఉత్పత్తి చేసే సరుకులకు అవసరమైన ముడి సరుకులను, విడి భాగాలను సరఫరా చేసే ఆయా సప్లయర్ల మధ్య పోటీ నెలకొనేలా చేస్తున్నాయి. ఎవరైతే అతి తక్కువ ధరలకు సప్లై చేయగలుగుతారో వారే ఆ సరఫరా కాంట్రాక్టులను చేజిక్కించుకోగలుగుతారు. దాని ఫలితంగా వారు తమ వద్ద పని చేసే కార్మికుల శ్రమను అతి తక్కువ స్థాయిలో తొక్కిపట్టి ఉంచడానికి పూనుకుంటున్నారు. అలా



చేసినప్పుడు కార్మికుల నుండి ప్రతిఘటన రాకుండా ఉండడానికి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. లేబర్ మార్కెట్‌లో అతి తక్కువ వేతనాలు లభించే చోట్ల మహిళా కార్మికుల శాతం పెరుగుతోంది. వేతనం చెల్లించే పద్ధతి కూడా అమలు కాకుండా గుండుగుత్తగా (ఇంత పనిచేయడానికి ఇంత సొమ్ము చెల్లిస్తాం, ఎంతమంది పని చేశారు, ఎంత కాలం పని చేశారు అన్నదానితో మాకు నిమిత్తం లేదని యజమానులు చేసుకునే ఒప్పందాలు) పనులకు నియమించడం పెరుగుతోంది.

ఈ పద్ధతుల వలన ఒక వైపు కార్మికుల వేతనాలలో అసమానతలు పెరుగుతున్నాయి. మరొక వైపు ఆ కార్మికులు పలువిధాలుగా ముక్కలౌతున్నారు. కాని పెట్టుబడి కేంద్రీకరణ మాత్రం పెరుగుతోంది. సంపద పోగు బడడమూ పెరుగుతోంది. ముక్కచెక్కలౌతున్న కార్మికవర్గంలో ఒక ముక్కను మరొక ముక్కకు వ్యతిరేకంగా పోటీ పెట్టి, అధికార, అనధికార నియంత్రణా పద్ధతులను ఉపయోగించి పెట్టుబడిదారులు మాత్రం తమ లాభాలను పెంచు కోగలుగుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా వేతనాల తీరు తెన్నులు ఏ విధంగా ఉన్నాయన్నది తాజాగా ఐఎల్‌వో విడుదల చేసిన ప్రపంచ వేతన నివేదిక (గ్లోబల్ వేజ్ రిపోర్ట్) వెల్లడించింది. ద్రవ్యోల్బణం కారణంగా 2023 వరకూ నిజ వేతనాలు బాగా పడిపోయాయి. కాని 2023 తర్వాత ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో కొంతవరకూ కోలుకున్నాయి. ఐతే ఈ పరిస్థితి ప్రపంచం అంతా ఒకే విధంగా లేదు. ఐఎల్‌వో అధ్యయనం చేసిన 160 దేశాలకు గాను 96 దేశాల్లో ద్రవ్యోల్బణం వలన నిజవేతనాలకు కలిగిన నష్టాన్ని పూర్తిమేరకు భర్తీ చేయలేదు. దాని వలన పెరిగిన సంపదలో కార్మికుల వాటా తగ్గుతూనే వుంది. జీడీపీ

పెరుగుదలను బట్టి చూసినా అందులో కార్మికులకు దక్కిన వాటా తగ్గు తూనే వుంది. సంపన్న దేశాల వరకే చూసినా, గత 25 ఏళ్లలో అక్కడ కార్మికుల ఉత్పాదకత 29 శాతం పెరిగితే, వారి నిజ వేతనాలు మాత్రం 15 శాతమే పెరిగాయి. రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన అనంతర కాలంలో యజమానుల లాభాల వాటా, కార్మికుల వేతనాల వాటా మారకుండా కొన్ని దశాబ్దాలపాటు స్థిరంగా కొనసాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కార్మికుల వాటా పడిపోతూనేవుంది.

గత రెండేళ్ల కాలంలో మొత్తం మీద చూసినప్పుడు కార్మికుల నిజవేతనాలలో పెరుగుదల కనిపించినా, ఆ వేతనాల అసమానతలు మాత్రం పెరుగుతున్నాయి. వేతనాల స్థాయిని బట్టి ప్రపంచ దేశాలను కనిష్ట, మధ్య తరహా, గరిష్ట స్థాయి దేశాలుగా వర్గీకరించి పరిశీలించితే, గరిష్ట స్థాయి వేతనాలు ఉన్న దేశాలలో వేతనాల్లో అసమానతలు తక్కువగా ఉన్నాయి. కనిష్ట, మధ్య తరహా దేశాల్లో అసమానతలు ఎక్కువగా ఉన్నాయి. దీనికి కారణం అసంఘటిత రంగం ఆ దేశాల్లో ఎక్కువగా పెరగడమే. కనిష్ట స్థాయి వేతనాలు ఉన్న దేశాలలో అసంఘటిత కార్మికులు 90 శాతం వరకూ ఉన్నారు. మధ్య తరహా దేశాల్లో 49 నుండి 75 శాతం దాకా ఉన్నారు.

వేతనాలను నిర్ణయించడం అనేది ప్రస్తుత నయా ఉదారవాదయుగంలో రానురానూ ఒక రాజకీయ ప్రక్రియగా మారిపోతోంది. అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడే రాజకీయ ప్రతినిధులు ఎవరూ లేకపో వడంతో వారు నోరులేని జీవులుగా మిగిలిపోతున్నారు. దాంతో తీవ్రస్థాయి దోపిడీకి గురౌతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి కాని, చట్టపరంగా గాని వారికి ఎటువంటి రక్షణా లభించడం లేదు. ఇటువంటి పరిస్థితి గరిష్ట స్థాయి వేత నాలు అమలౌతున్న దేశాల్లో లేదు. అందుచేత ఆ దేశాల్లో వేతనాల్లో అసమానతలు తక్కువ మోతాదులో ఉన్నాయి. మూడవ ప్రపంచ దేశాల్లో అత్యధికంగా ఉన్న అసంఘటిత కార్మికులను దోపిడీ చేస్తూ వారి శ్రమను కొల్లగొట్టి పోగేసు కున్న సంపదను సంపన్న దేశాలు తరలించుకు పోతున్నాయి.

ఐఎల్‌వో నివేదిక ప్రపంచవ్యాప్తంగా అమలౌతున్న వేతనాల స్థాయిని పరిశీలించింది. డాలర్ కొనుగోలుశక్తి ప్రపంచంలో ఎక్కడైనా ఒకే స్థాయిలో ఉంటుందన్న ప్రాతిపదికన (డాలర్ పర్చేసింగ్ పవర్ పారిటీ, పిపిపి) వేత నాలను సరిపోల్చింది. అలా చూసినప్పుడు కనిష్ట స్థాయి వేతనాలున్న అత్యధిక మూడవ ప్రపంచ దేశాలలో వేతనాలు 201డాలర్లు ఉన్నాయి. అదే మధ్య తరహా దేశాల్లోనైతే 630 డాలర్లు ఉన్నాయి. ఇక గరిష్ట స్థాయి దేశాల్లోనైతే వేతనాలు 3333 డాలర్లు ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే కనిష్ట స్థాయి దేశాల్లో కార్మికుడి కొనుగోలు శక్తి మధ్యతరహా దేశాల కార్మికుడితో పోల్చితే మూడో వంతు మాత్రమే ఉంది. కొత్త టెక్నాలజీని రానున్న కాలంలో పెద్ద ఎత్తున ప్రవేశపెట్టనున్నారు. దీని వలన ఉత్పత్తిలో మానవ శక్తిని వినియోగించవలసిన అవసరం మరింత తగ్గుతుంది. అదే సమయంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ ప్రత్యేక నైపుణ్యాన్ని పొందాలంటే అందుకు కావలసిన విద్యను, నిపుణతను పొంద గలగాలి. విద్య ప్రయివేటుపరం అయిన అనంతరం ఆర్థిక స్తోమత ఉన్న కొద్దిమంది మాత్రమే ఈ ఆధునిక విద్యను, సాంకేతికను దొరకబుచ్చుకోగలుగుతారు. తక్కినవారు, అత్యధిక మెజార్టీగా ఉన్నవారు ఈ కొత్త సాంకేతికతకు దూరంగానే మిగిలిపోతారు. వారంతా వేతనాల విషయంలో కనిష్ట స్థాయికి దిగజారిపోతారు.

ఆధునిక సాంకేతికతను, రోబోలను ఎంతగా వినియోగించినప్పటికీ, సూపర్వైజరీ పనులు, సంరక్షణకు సంబంధించిన పనులు (శివు సంరక్షణ, వైద్య సంరక్షణ వగైరా) ఇంటి పనులు వంటివి చేయడానికి మానవ వనరులే అవసరం. అందుకే ఈ రంగాల పనులను అతి తక్కువ వేతనాలతో చేయించుకోడానికి వీలుగా ఈ రంగాల్లో మహిళా కార్మికులను అత్యధికంగా నియోగిస్తున్నారు. కొత్త సాంకేతికత ప్రవేశపెట్టిన ఫలితంగా కొద్దిమంది వేతనాల స్థాయిలో గరిష్టానికి చేరుకున్నా, అత్యధికులు, ముఖ్యంగా మహిళలు కనిష్ట స్థాయికి పడిపోతారు. వేతన అసమానతలతో జెండర్ అసమానతలు కలిసి పెరిగిపోతాయి.

**మొత్తం మీద చూసినప్పుడు నిజ వేతనాలు పెరిగినట్టు ఐఎల్‌వో నివేదిక చెప్పినప్పటికీ, వేతనాల్లో అసమానతలు వేగంగా పెరగడం అనేది వాస్తవం అన్నది వెల్లడైంది. పెట్టుబడి ఎంత ఎక్కువగా, ఒకే దగ్గర ఎంత వేగంగా పోగుబడుతూ వుంటుందో, అంతే వేగంగా వేతనాల అసమానతలు పెరుగుతూ పోతాయి. దానితోబాటు కార్మికులను ముక్కచెక్కలుగా విడగొట్టడమూ పెరుగుతూ పోతుంది. కార్మికశక్తి మీద, ఉత్పత్తి క్రమం మీద పెట్టుబడి రాజకీయంగా పైచేయి సాధించడం వల్లనే ఇది సాధ్యపడుతోంది. ఈ పెట్టుబడి ఆధిక్యతను ప్రతిఘటించి, పెరుగుతున్న అసమానతల నుండి బయట పడాలంటే ముక్కముక్కలుగా ఉన్న కార్మికవర్గంలో సమిష్టి వర్గ చైతన్యాన్ని పెంపొందించే రాజకీయ ప్రక్రియను వేగవంతం చేయడమే పరిష్కారం.** ❑

# నస్ బందీ, నోట్ బందీ దారిలో వోట్ బందీ!



- ఎన్.వేణుగోపాల్

ఎమర్జెన్సీ యాభై సంవత్సరాల సందర్భంగా, సంజయ్ గాంధీ ప్రోద్బలంతో 1975-77ల్లో జరిగిన నస్ బందీ (బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స) గురించి చాలా మంది తలచుకున్నారు. అలాగే, తొమ్మిదేళ్ల కిందటి నోట్ బందీ (పెద్ద నోట్ల రద్దు) పర్యవసానాలు అందరికీ స్వానుభవమే. సరిగ్గా ఎమర్జెన్సీ దినానికి ఒకరోజు ముందు కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాన్ని ఇప్పుడు ప్రతిపక్షాలు వోట్ బందీ అంటున్నాయి. అది జూన్ 24న ఎన్నికల సంఘం బిహార్‌లో ప్రత్యేక తీవ్రతర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్-సర్) కోసం ఇచ్చిన ఆదేశం.

బిహార్‌లోని 7,80,22,933 మంది వోటర్లలో 2003లో ఉండిన నాలుగు కోట్ల మంది పోగా, మిగిలిన వోటర్లలో ప్రతి ఒక్కరినీ కలిసి అర్హులా అనర్హులా ధృవీకరించి, కొత్త వోటర్ల జాబితా తయారు చేయాలనేది ఈ ఆదేశం. ప్రస్తుతం ఉన్న వోటర్ల జాబితా తప్పుల తడక అని, అందులో పేర్లన్నీ అనుమానాస్పదమైనవని ఎన్నికల సంఘం అంటున్నది. ప్రస్తుతం ఉన్న 77,895 బూత్ లెవల్ ఆఫీసర్లు, కొత్తగా నియమించనున్న 20,603 మంది ఇంటింటికీ వెళ్లి జాబితాలు సవరిస్తారు. విపరీతమైన వర్షాలతో, రాష్ట్రంలో 70 శాతం భూభాగం వరదల్లో చిక్కుకుని ఉన్న ప్రస్తుత స్థితిలో ఈ ఇంటింటి పర్యటన సాధ్యమా అనుమానమే.

2003 జాబితా తర్వాత చేరిన వోటర్లందరూ బర్త్ సర్టిఫికేట్, ప్రభుత్వోద్యోగి ఐడెంటిటీ కార్డ్, పెన్షన్ కార్డ్, పాస్ పోర్ట్, విద్యార్హతల సర్టిఫికేట్, నివాస ధృవీకరణ పత్రం, అటవీ హక్కుల సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, జాతీయ పౌర రిజిస్టర్, స్థానిక అధికారులు తయారు చేసిన కుటుంబ పట్టిక, ప్రభుత్వం భూమి పంపిణీ చేసి ఉంటే ఆ పత్రం వంటి పదకొండు పత్రాలలో ఏదైనా ఒకటి చూపితేనే అర్హుడైన వోటర్‌గా లెక్కిస్తారు. ఈ అర్హతా పత్రాలలో ఆశ్చర్యకరంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, గ్రామీణ ఉపాధి హామీ పథకపు జాబ్ కార్డులు లేవు. చివరికి ఎన్నికల కమిషన్ తానే స్వయంగా జారీ చేసిన వోటర్ కార్డ్ కూడా లేదు. బిహార్ లాంటి వెనుకబడిన రాష్ట్రంలో ఆ పదకొండు పత్రాలలో ఏదో ఒకటికన్నా వోటర్ కార్డ్, జాబ్ కార్డ్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ ఉండే అవకాశమే ఎక్కువ. కొన్ని రోజులు గడిచాక, అర్హత నిర్ధారణను బూత్ లెవల్ ఆఫీసర్ల విచక్షణకు వదులుతున్నాం అని ఎన్నికల సంఘం అంది. అంటే ఒక వ్యక్తి వోటరా కాదా అన్నది స్థానిక అధికారి ఇష్టాయిష్టాల మీద ఆధారపడుతుందన్నమాట!

ఈ కార్యక్రమం అనుమానాస్పదంగా ఉన్నదని, దీన్ని ఆపాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను కలిసి ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేసినప్పుడు ఆయన స్వయంగా బిహార్ వోటర్ల జాబితా నుంచి కనీసం ఇరవై శాతం పేర్లు తొలగించవలసి ఉంటుందని అన్నారు. అంటే ఒక కోటీ అరవై లక్షల వోటర్ల అర్హత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వాళ్లలో కొందరు నిజంగానే అనర్హులు కావచ్చు గాని, ఈ పేరుతో అధికార పక్షం చాలా మంది పేర్లు తొలగించదలచుకున్నదనే అనుమానాలు విస్తారంగా ఉన్నాయి.

ఎన్నికలు మరొక నాలుగు నెలల్లో ఉండగా ఇంత భారీ కార్యక్రమం గందరగోళానికే దారితీస్తుంది. ఈ కార్యక్రమానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన నెల రోజుల కాల వ్యవధి ఎంత మాత్రం సరిపోదు. గతంలో 2003లో వోటర్ల జాబితాను సవరించినప్పుడు, ఆ ప్రక్రియ పూర్తి కావడానికి రెండు సంవత్సరాలు పట్టింది. ఇప్పుడు ఇచ్చిన సమయం నెల కాగా, అందులో ఐదు రోజులు శిక్షణకే సరిపోయాయి. వోటర్ల నమోదు పత్రాలు, ఇతర సామగ్రి నియోజకవర్గ కేంద్రాలకు చేరడానికి మరొక ఐదు రోజులు పట్టింది. అంటే వాస్తవంగా గతంలో 700 రోజులు జరిగిన కార్యక్రమాన్ని ప్రస్తుతం 19 రోజుల్లో తూతూ మంత్రంగా ముగిస్తారన్నమాట.

ఈ ప్రక్రియతో బిహార్‌లో రేపు ఎన్నికల్లో తనకు వోటు వేసే అర్హత ఉంటుందా లేదా అని ప్రతి ఒక్కరూ భయపడే పరిస్థితి వచ్చింది. ఎన్నికల సంఘం ప్రకటనలను బట్టి మొత్తం కోటీ అరవై లక్షల వోటర్ల అర్హత ప్రశ్నార్థకమయింది. ఇంత పెద్ద ఎత్తున దొంగ వోటర్లు ఉండే అవకాశం ఎప్పుడూ ఎక్కడా ఉండదు. ఈ పేరుతో అధికార పార్టీ, ఆ భావజాలం ఉండే అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా కొన్ని లక్షల మంది వోటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే అవకాశం, ప్రమాదం ఉంటాయి. అసలు వోటర్ల జాబితాలు ఎప్పటికప్పుడు పునర్నవీకరణ చెందుతూనే ఉంటాయి. కొత్తగా వోటు వయసు వచ్చిన వారి పేర్లు చేర్చడం, చనిపోయిన వారి పేర్లు తొలగించడం, నిర్ణీత కాలం కన్న ఎక్కువ కాలం వలస వెళ్లినవారి పేర్లు తొలగించడం, మరో చోటి నుంచి వలస వచ్చి స్థిరపడిన వారి పేర్లు చేర్చడం, పట్టణీకరణ వల్ల అవసరమయ్యే మార్పులూ **(మిగతా 38వ పేజీలో)**

# హిందీ పెద్దమ్మ ఎక్కడ ? కనబడుట లేదు!!

- వనజ

**మా ఇంటి పక్కన భవన నిర్మాణంలో పనిచేసే బిహార్‌కి చెందిన కూలివాళ్ళు ఇక్కడి వాళ్ళతో హిందీలో మాట్లాడతారు. కానీ, వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకునేది మాత్రం హిందీ కాదు. వేరే భాష. వాళ్ళ మాతృభాష. హిందీ తెలిగ్గా అర్థమయ్యే ఎవరికైనా ఆ భాష అస్సలు అర్థం కాదు. మా ఇంటి చుట్టుపక్కల రాజస్థాన్‌కి చెందిన చాలా మార్వాడి కిరాణా షాపులున్నాయి. వాళ్ళంతా కస్టమర్లతో హిందీలోనే మాట్లాడతారు. కానీ వాళ్ళ కుటుంబ సభ్యులతో, వాళ్ళ ప్రాంతం వారితో మాట్లాడేది హిందీ కాదు. వేరే భాష. అది మనకు అర్థం కాదు. మరి వీళ్ళంతా హిందీ బెల్ట్ అని చెప్పుకునే ప్రాంతాల నుంచి వచ్చిన వారే కదా? వీళ్ళు హిందీలోనే కదా మాట్లాడాలి. మరి వీళ్ళు హిందీలో కాకుండా వేరే భాషలో ఎందుకు మాట్లాడుకుంటున్నారు ?**

ఎందుకంటే - హిందీ భాష, హిందీ రాష్ట్రాలు, హిందీ ప్రజలు.. మొత్తంగా హిందీ బెల్ట్ అనేది కేవలం కొందరు రాజకీయ లబ్ధి కోసం ఆయా ప్రాంతాల ప్రజల మీద నిర్దాక్షిణ్యంగా కప్పిన కృత్రిమ తొడుగు. అదే హిందీ గొడుగు.

హిందీ రాష్ట్రమైన మహారాష్ట్రలోనే హిందీకి వ్యతిరేకంగా పోరాడుతుంటే.. ఏ విషయంలోనూ ఏ మాత్రం అవగాహన లేని పవన్‌కల్యాణ్ మాత్రం హిందీ లేకపోతే భవిష్యత్తే లేదనీ, హిందీ పెద్దమ్మ అనీ ఏవేవో మాట్లాడుతున్నారు. ఆ మాటలకు విలువివ్వాల్సిన అవసరం లేకపోయినా జెండా కూలీల బానిసత్వం, అజ్ఞానాన్ని దృష్టిలో పెటుకుని ఆ భయంతో అయినా స్పందించక తప్పని దుస్థితి ఏపీలో దాపురించింది. ఏం చేస్తాం ! రాయి విసిరేది పిచ్చోడే అయినా తిప్పికొట్టక తప్పదు. దీనికితోడు ఈ 'తండ్రీ కొడుకులు' బీజేపీ మెప్పు కోసం హిందీని జాతీయ భాష చేసేశారు. జాతీయభాష హోదా దేవుడెరుగు, అసలు హిందీ భాషకు ప్రాంతీయ హోదా అయినా ఉందా అనేది పెద్ద ప్రశ్న ! నిజంగా హిందీ మాతృభాషగా ఉండి, హిందీ మాట్లాడేవాళ్ళు ఈ దేశంలో ఎంత మంది ?

'దక్షిణ భారతదేశంలో సరే గానీ మహారాష్ట్రలో హిందీకి వ్యతిరేకత ఏంటి ?' ఆశ్చర్యంగా అన్నాడు నా ఫ్రెండ్ మొన్నా మధ్య ఓ సారి. చాలా మంది ఇదే తప్పుడు అభిప్రాయంతో




ఉంటారు. దక్షిణ భారతీయులు మాత్రమే హిందీ భాషా వ్యతిరేకులు అనుకుంటారు. నిజానికి దక్షిణాది రాష్ట్రాలకంటే ఉత్తరాది రాష్ట్రాలే హిందీ వల్ల ఎక్కువగా నష్టపోయాయి. తమ మాతృభాషల్ని, సంస్కృతీ సంప్రదాయాల్ని తద్వారా తమ అస్తిత్వాలనే కోల్పోయే ప్రమాదంలో పడిపోవడంతో తమ భాషల్ని బతికించుకోవాలనే ఆకాంక్షతోపాటు దానికి అడ్డుపడుతున్న హిందీ పట్ల వ్యతిరేకత ఉత్తరాది ప్రజల్లో (మీడియా కవర్ చేయకపోయినా) తీవ్రస్థాయిలోనే ఉంది.

### హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో మాట్లాడేది హిందీయేనా?

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్, ఢిల్లీ, హర్యానా, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ - ఈ పది రాష్ట్రాలను హిందీ బెల్ట్‌గా పిలుస్తున్నాం. భారతదేశమనేది భిన్న సంస్కృతులతో భిన్న భాషలతో మిళితమై ఉంది. 'కోస్ కోస్ పర్ బద్లే పానీ, చార్ కోస్ పర్ వాణీ' - (ప్రతీ కోసు దూరానికీ నీటిలో మార్పు, ప్రతీ నాలుగు కోసులకూ భాషలో మార్పు) అని హిందీలో ప్రసిద్ధ నానుడి. మరి పశ్చిమాన రాజస్థాన్ నుంచి తూర్పున బిహార్ వరకు ఉత్తరాన హిమాచల్ నుంచి దక్షిణాన చత్తీస్‌గఢ్ వరకూ కొన్ని వేల కిలోమీటర్లు ఒకే భాష హిందీ భాష ఉండడం ఎలా సాధ్యం!

### అవన్నీ మాండలికాలేనా ?

అవన్నీ హిందీ భాష మాండలికాలని కొందరు బుకాయించొచ్చు. తెలుగు భాషకూ మాండలికాలు వున్నాయి. ఉత్తరాంధ్ర, కోస్తా, తెలంగాణ, రాయలసీమ మాండలికాల్లో ఎంత తేడా ఉన్నా, కొన్ని పదాలు అర్థం కాకపోవచ్చు కానీ తెలుగు తెలిసిన ఎవరికైనా మాండలిక భాష అర్థమవుతుంది. కానీ హిందీ

భాషలో పండితులైన వారికి కూడా హిందీ బెల్ట్‌లోని ప్రజలు మాట్లాడే మగధి, అవధి, భోజ్‌పురి, బ్రజ్, బుందేలి, బగేలి, భౌలి, కాంగ్డీ, గడ్వాలి, హరియాన్వీ, మార్వాడి, మాల్వీ, చత్తీస్‌గఢి, కనౌజి, కడిబోలి, కొట్ట, పహాడి, మైథిలి వంటి అనేక భాషల్లో ఒక్కటి కూడా అర్థం కాదు. ఎందుకంటే ఈ భాషలన్నీ హిందీ మాండలికాలు కావు. దేనికది ప్రత్యేకమైన భాష. ఇలాంటి 56 మాతృభాషల్ని హిందీ గొడుగు కింద హిందీలో కలిపేసుకుని ఆయా భాషలు మాట్లాడే వారిని హిందీ ప్రజలుగా ముద్ర వేసేశారు.

భారతదేశ ప్రజలు మాట్లాడే మాతృభాషలు రెండు వేలకు పైగా ఉన్నాయి. అత్యధిక ప్రజలు మాట్లాడే అనేక మాతృభాషలు గుర్తింపుకు నోచుకోలేక హిందీ ముసుగులు, ముద్రలు వేసుకున్నాయి. ఈ ముసుగు తీస్తే నిజంగా హిందీ మాతృభాషగా ఉన్న ప్రజలు ఈ దేశంలో ఎంతమంది ?

- 2011 జనాభా లెక్కల ప్రకారం 44% భారతీయుల మాతృభాష హిందీ.
- 1961 జనాభా లెక్కల సమయంలో హిందీ బెల్ట్‌లో 10 మాతృభాషల్ని హిందీలో కలిపి దేశ జనాభాలో హిందీ ప్రజల శాతాన్ని 30.39%కి తీసుకొస్తే, 1971 జనాభా లెక్కల్లో మరి కొన్ని భాషల్ని కలిపి 37% తెచ్చారు.
- 1991లో ఇంకొన్ని భాషల్ని మింగి హిందీ ప్రజల్ని 39.29% తెస్తే.. 2001లో మరిన్ని భాషల్ని ఆక్రమించి 41.11% 2011లో 56 మాతృభాషల్ని అణచి హిందీ ప్రజల్ని 44 శాతానికి చేర్చారు.
- ఇప్పటికి 15 ఏళ్ళయ్యింది. రాబోయే జనాభా లెక్కల్లో హిందీ ఇంకెన్ని భాషల్ని మింగనుందో, దేశంలో హిందీ ప్రజల శాతం ఇంకెంత పెరగనుందో! కేంద్ర నాయకుల మాయాజాలమే ఈ కృత్రిమ పెంపు.

**2011 జనాభా లెక్కల ప్రకారం చూసినా..**

- పెద్ద రాష్ట్రమైన రాజస్థాన్‌లో 37% మంది రాజస్థానీ భాష మాట్లాడితే.. హిందీ మాట్లాడేది 26% మాత్రమే. ఇతరుల మాతృభాష మార్వాడి, మాల్వీ, జయ్‌పూరి మొదలైనవి.
- హిమాచలప్రదేశ్‌లో 32% మంది పహాడీ, 36% మంది కాంగ్డీ, గడ్వాలి భాషలు మాట్లాడితే హిందీ మాట్లాడే ప్రజలు కేవలం 15%.
- ఛత్తీస్‌గఢ్‌లో 62% ప్రజలు ఛత్తీస్‌గఢీ మాట్లాడితే.. హిందీ మాట్లాడే ప్రజలు కేవలం 10%.
- జార్ఖండ్‌లో 60% పైగా ప్రజల మాతృభాష కొట్టా.
- బిహార్‌లో భోజపురి, మైథిలి, మగధి లాంటి అధిక సంఖ్యాకులు మాట్లాడుకునే భాషలతోపాటు 146 అల్ప సంఖ్యాకుల మాతృభాషలు ఉనికిలో ఉన్నాయి. ఆ రాష్ట్రంలో హిందీ మాతృభాష 10% కంటే తక్కువ.
- ఉత్తరాఖండ్ ప్రజలు మాట్లాడే భాషల్లో మొదటి 5 జాబితాలో హిందీ అసలు లేనే లేదు!
- 2011 జనాభా లెక్కల ప్రకారం భోజ్‌పూరి మాట్లాడే ప్రజలు 5 కోట్లకు పైగా ఉన్నారు. రాజస్థానీ మాట్లాడేవారు 2.5 కోట్ల పైగా, ఛత్తీస్ గఢీ 1.5 కోట్ల పైగా ఉంటే హర్యాన్వీ మాట్లాడే ప్రజల సంఖ్య కోటికి పైగా ఉంది.

> 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం ప్రకారం దేశంలో భోజ్‌పూరి మాట్లాడేవారి సంఖ్య 15 కోట్ల పైగానే ఉంటుంది. ఉత్తరప్రదేశ్ లో 7 కోట్లు, బిహార్‌లో 8 కోట్లు. వీరికి చిత్ర పరిశ్రమ కూడా ఉంది. భోజ్‌పూరి భాషలో అనేక సినిమాలు రూపు దిద్దుకున్నా యి. దేశంలో అధిక సంఖ్యాక ప్రజలు మాట్లాడే భాషల జాబితాలో భోజ్‌పూరి కచ్చితంగా 2 లేక 3 స్థానాల్లో ఉంటుంది. అయినప్పటికీ ఈ భాషకు గుర్తింపు లేదు. ఈ భాషలకు అధికారిక గుర్తింపు లేకపోవడంతో జనాభా లెక్కల్లో వీరి మాతృ భాష హిందీ అయ్యి కూర్చుంది. వీళ్ళంతా హిందీ వాళ్ళు అయి పోయారు. హిందీ బెల్ట్ ముసుగులో వందల ఏళ్ళుగా ప్రజల నాలుకలపై సజీవంగా ఉన్న అనేక భాషలకు నిన్నగాక మొన్న పుట్టిన హిందీ మాండలిక ముసుగు వేసుకునే ఖర్మ పట్టింది.

**హిందీ ఎప్పుడు.. ఎలా పుట్టింది?**

వైదిక సంస్కృతం నుంచి సౌరసేని ప్రాకృత భాషలు పుట్టాయి. కడిబోలి, కనౌజి, పర్యాన్వీ, బ్రజ్ లాంటి అనేక ఉత్తరాధి భాషలకు ఈ ప్రాకృత భాషే మూలం. 1206లో ఢిల్లీ సుల్తాన్లు అధికారం చేపట్టే నాటికి ప్రాకృత భాష నుంచి పుట్టిన కడిబోలి భాష ఢిల్లీ ప్రజల మాతృభాషగా ఉండేది. సుల్తాన్లు పర్షన్ భాషను అధికారిక భాషగా ప్రకటించుకుని పాలన సాగించడంతో ఈ కడిబోలి భాష పర్షన్‌తో కలిపి ఒక కొత్త భాష పుట్టింది. దాన్నే హిందుస్థాని అన్నారు.

1526లో బాబర్ రాకతో మొగల్ సామ్రాజ్యంలో ఈ హిందుస్థానీ మరింత ఎక్కువగా పర్షన్ ప్రభావానికి లోనై ఉర్దూ భాషకు జన్మనిచ్చింది. 18వ శతాబ్దంలో బ్రిటిష్ వారు పర్షన్ భాషను తొలగించి ఢిల్లీ స్థానికులు అధికంగా మాట్లాడే ఉర్దూని స్థానిక అధికారిక భాషగా ప్రకటించారు. ఉర్దూ భాష అరబ్

లిపిని అనుసరించడంతో మతపరమైన సమస్యలు తలెత్తాయి. దాన్ని ముస్లిం భాషగా పరిగణించి హిందూ పెద్దలు తమ కోసం ప్రత్యేక భాష కావాలనే ఉద్దేశంతో హిందుస్థానీలో మరింత సంస్కృతాన్ని చొప్పించి కొత్త భాషను అభివృద్ధి చేశారు. అదే హిందీ. దీనికీ ఉర్దూకీ పెద్దగా తేడా లేకపోయినా దేవనాగరి లిపిని అనుసరించడం వల్ల హిందువుల భాషగా ప్రచారం చేశారు.

### ఆ సాహిత్య సంపద హిందీ సొంతమా?

ఇప్పటికీ హిందీ భాష వయసు మూడు శతాబ్దాలకు మించి లేదు. మగధి, భోజ్‌పూరి, బ్రజ్, బగేలీ, హరియాన్వీ, మైథిలి వంటి హిందీకంటే భిన్నంగా ఉండే అనేక భాషలు హిందీ కంటే చాలా పురాతనమైనవి. సాహిత్య సంపద కలిగిన భాషలు. తులసీదాస్ రాసిన రామ్‌చరితమానస్, హనుమాన్ చాలీసాలు అవధి భాషలో ఉన్నాయని ఎంత మందికి తెలుసు ? సూర్‌దాస్, రహీమ్ దోహేలు బ్రజ్ భాషలో.. మీరాబాయి రచనలు రాజస్థానీ భాషలో.. కబీర్‌దాస్ దోహేలు అవధి, బ్రజ్, భోజ్‌పూరి భాషల్లో.. 12వ శతాబ్దపు ప్రసిద్ధ కవి ఆలాఖండ్ బుందేలీ, బగేలీ భాషల్లో రాశారు. అయినా ఈ సాహిత్యం అంతా హిందీ సాహిత్యంగా మోసపూరిత ప్రచారం జరుగుతూనే ఉంది.

ఈ భాషలకు లిపి లేకపోవడం వల్ల అవి గుర్తింపు పొందలేకపోతున్నాయని కొందరు అంటుంటారు. మరి హిందీకి కూడా లిపి లేదు. ఈ అన్ని భాషలూ ఉపయోగించే దేవనాగరినే హిందీ కూడా అనుసరిస్తుంది. నిజానికి మొదట్లో చాలా భాషల రచనలు వాటి ప్రత్యేక లిపిలోనే జరిగాయి. మైథిలి భాష రచనలు తొలి దశలో దేర్హోతియా మిథిలాక్షర్ అనే స్క్రిప్ట్‌లో ఉండేవి. భోజ్‌పూరికి కైతీ స్క్రిప్ట్, రాజస్థానీ, మార్వాడీకి మహాజనీ స్క్రిప్ట్, పహాడీ భాషకు టాకరీ స్క్రిప్ట్.. ఇలా ప్రత్యేకంగా ఉండేవి. తరతరాలుగా వాటిని భద్రపరుచుకోవడంలో, ముందు తరాలకు నేర్పించడంలో జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఆ రాతలు అంతరించిపోయాయి. నేడు అన్నిటికీ దేవనాగరి లిపే గతయ్యింది. హిందీ ఆధిపత్యానికి తలొగ్గే పరిస్థితి దాపురించింది.

### ఎనలేని ప్రాచుర్యం ఎందుకొచ్చింది?

కొందరికి రాజకీయ, సాంఘిక, సామాజిక ఆధిపత్య ధోరణి ప్రదర్శించడానికి హిందీ భాషాధిపత్యం కూడా అవసరమైంది. దీంతో జయ్‌శంకర్ ప్రసాద్, మహాదేవి వర్మ, సుమిత్రానందన్, మైథిలీ శరణ్ గుప్త్ వంటి ఎందరో సాహితీవేత్తలు హిందీని గొప్ప భాషగా కీర్తిస్తూ రచనలు సాగించారు. హిందీకి ఎనలేని ప్రాచుర్యం తెచ్చిపెట్టడంలో నార్త్ ఇండియా మీడియా, బాలీవుడ్ సినిమా పరిశ్రమ ప్రధాన పాత్ర పోషించాయి. 90 దశకంలో వచ్చిన రామాయణ్, మహాభారత్ వంటి టివీ సీరియల్స్ హిందీని ఇంటింటికీ చేర్చాయి.

గత 75 ఏళ్ళుగా కేంద్ర ప్రభుత్వం హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని బలవంతంగా రుద్దడానికి వేల కోట్లు ఖర్చుచేస్తూనే ఉంది. ఇప్పుడు బీజేపీ అధికార ఛత్రఛాయలో హిందీ భాషాధిపత్యం మళ్ళీ పుంజుకుంది. ప్రస్తుతం 70% పైగా క్యాబినెట్ పత్రాలు హిందీలోనే ఉంటున్నాయి. ఉప రాష్ట్రపతే ఏకంగా హిందీని జాతీయ భాష అని అసత్య భాషణలు చేస్తారు. సెంట్రల్ యూనివర్శిటీల శాలరీ స్లిప్స్‌లో పేర్లు హిందీలోనే ఉంటున్నాయి. కేవలం మూడు సంవత్సరాల్లో హిందీ టీచర్ల కోసం 349 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

విచిత్రమైన విషయమేంటంటే – దేశంలో హిందీ భాషకు ఏ మాత్రం ఆదరణ లేని 1881 సంవత్సరంలోనే పెద్ద రాష్ట్రమైన బిహార్‌లో హిందీని అధికార భాషగా ప్రకటించారు. అప్పుడు ఆ రాష్ట్ర ప్రజల్లో 99% మందికి హిందీ రాదు, ఆ భాష అర్థం కూడా కాదు. క్రమంగా హిందీని ప్రస్తుతం చెప్పుకునే హిందీ బెల్ట్ రాష్ట్రాల్లోకి బలవంతంగా చొప్పించారు. ఇంకా హిందీని క్లాసిక్ భాషగా, పండితుల, అక్షరాస్యుల భాషగా కీర్తిస్తూ, స్థానికుల మాతృ భాషల్ని నిరక్షరాస్యుల భాషగా అవహేళన చేస్తూ వస్తున్నారు. హిందీ నేర్చుకోకపోతే ఉత్తర భారతదేశంలో ఏ పనీ దొరకని పరిస్థితులు కల్పించారు.

### స్వాతంత్ర్యానికి ముందే ప్రయత్నాలు

హిందీని జాతీయభాషగా గుర్తించాలని స్వాతంత్ర్యానికి ముందు నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. విభిన్న సంస్కృతుల, భాషల ప్రజలు నివసించే ఈ దేశంలో అన్ని భాషలకూ సమాన గుర్తింపుగాక ఏదో ఒక భాషను అందలం ఎక్కించి దాని కనుసన్నల్లో మిగతావి మెలగాలంటే ? ఈ ఆధిపత్య ధోరణి దేశ ఐక్యతను దెబ్బ తీస్తుందన్న విషయం ఈ దేశ పాలకులకు 1962లోనే చాలా బాగా తెలిసొచ్చింది.

స్వాతంత్ర్యానంతరం హిందీతోబాటు ఇంగ్లిష్‌ను కూడా 15 ఏళ్ళపాటు అధికార భాషగా ప్రకటించారు. ఈలోపు దేశ ప్రజలందరి మీదా బలవంతంగా అయినా హిందీ రుద్దేసి (నేర్పించి) హిందీని జాతీయభాషగా ప్రకటించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. 15 ఏళ్ళు గడిచాక 1962లో మళ్ళీ ఇంగ్లిష్‌ని తొలగించి హిందీని జాతీయభాషగా వివాదాస్పదమైన ప్రతిపాదన తెరపైకి వచ్చేసింది. దీంతో దక్షిణ భారతీయులే కాదు దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వెల్లువెత్తేసరికి అప్పటి హోం మంత్రి లాల్‌బహద్దూర్ శాస్త్రి జాతీయ భాష అనే భావన పక్కపెట్టి, దేశ ప్రజలు హిందీని ఆమోదించనంత వరకూ హిందీ, ఇంగ్లిష్ రెండూ అధికార భాషలుగా కొనసాగేలా 1963లో చట్టం తీసుకొచ్చారు.

## పోరాటాలతో అధికార భాషా హెూదాలు

1951లో రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్‌లో కేవలం 14 భాషలనే అధికారికంగా గుర్తించారు. తర్వాతి కాలంలో తమ భాషను నాశనం చేస్తున్న హిందీ ఆధిపత్యాన్ని భరించలేని అనేక భాషల వాళ్ళు తీవ్రస్థాయిలో పోరాటాలు సాగించారు, ఇంకా సాగిస్తూనే ఉన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే రాజ్యాంగంలోని 21వ సవరణలో కొన్ని భాషలకూ, 71వ సవరణలో కొన్ని భాషలకూ, 92వ సవరణలో దశాబ్దాల పోరాటం తర్వాత మైథిలీ భాషకూ, మరో నాలుగు భాషలకూ ఎట్టకేలకు 2003లో అధికార హెూదా, గుర్తింపు లభించింది. దాంతో ప్రస్తుతం ఈ దేశంలో గుర్తింపు పొందిన భాషల సంఖ్య 22కి చేరుకుంది. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్ర భాష మైథిలీ.

> పాలకుల స్వార్థం, రాజకీయ లెక్కలు ఎంత దారుణంగా ఉంటాయంటే జార్ఖండ్‌లో గుర్తింపు పొందిన మైథిలీ భాషకు బిహార్‌లో మాత్రం గుర్తింపు లేదు. అక్కడి లక్షల సంఖ్యలో ఈ భాష మాట్లాడుతున్నప్పటికీ బిహార్‌లో మైథిలీని అధికారికంగా గుర్తిస్తే అంతకంటే ఎక్కువ కోట్ల సంఖ్యలో ప్రజలు మాట్లాడే భోజ్‌పురి, మగధి భాషలను కూడా గుర్తించాల్సి ఉంటుంది. మైథిలీ లాంటి భాషల విజయంతో భోజ్‌పూరి, మగధి, రాజస్థానీ, ఛత్తీస్‌గఢి లాంటి మరికొన్ని భాషలు హిందీ నుంచి తమ ఉనికిని కాపాడుకోవడం కోసం తీవ్ర స్థాయిలో పోరాటం చేస్తున్నాయి. ఈ పోరాటంలో 39 మాతృభాషలున్నాయి. తమ భాషను 8వ షెడ్యూల్లో కచ్చితంగా చేర్చాలన్న డిమాండ్ ఉత్తర భారత రాష్ట్రాల్లో పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇదే జరిగితే ఆయా ప్రజల్ని ఆ భాషా ప్రజలుగానే గుర్తిస్తారు. అప్పుడు హిందీ ప్రజలుగా మిగిలేది ఎవరు ?

రాబోయే ఈ ప్రమాదాన్ని పసిగట్టిన హిందీ ఉద్ధారకుల, సంరక్షకుల ప్రొఫెసర్ గ్రూప్ ఒకటి ఇటీవల ప్రధాని మోడీకి ఒక లేఖ రాసింది. భోజ్‌పురి, రాజస్థానీ, ఛత్తీస్‌గఢీ, హర్యాన్వీ లాంటి అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించవద్దని, 8వ షెడ్యూల్లో కలపవద్దని ఆ లేఖ సారాంశం. ఈ భాషల్ని గుర్తిస్తే లెక్కల్లో చూపించే హిందీ ప్రజల సంఖ్య తారుమారవుతుందని ఈ ప్రొఫెసర్ గుంపు చెబితే కానీ తెలుసుకోలేనంత అమాయకులు కాదుగా బీజేపీ నాయకులు!

పాపం పహాడీ భాషల్లో స్వల్ప సంఖ్యాకులు మాట్లాడే అనేక గిరిజన భాషలున్నాయి. హిందీ ఆధిపత్యాన్ని ఎదిరించి నిలబడే శక్తి లేని, తమ ఉనికి కోసం పోరాటాలు సాగించలేని ఈ భాషలన్నీ అత్యంత ప్రమాదంలో పడిపోయాయి. రాబోయే 50 ఏళ్ళలో హిందీ ఆధిపత్యానికి సుమారు 400 భాషలు అంతరించిపోయే ప్రమాదం కనిపిస్తోంది.

## ఏపీ పాలకుల తీరు ఇదీ

ఉత్తర భారత భాషలతో సంబంధం లేకుండా తమకంటూ భిన్నమైన అస్తిత్వం, ప్రాచీనస్థాయి సాహిత్యాలున్న ద్రవిడ భాషలపైన నిన్నగాక మొన్న పుట్టిన హిందీ పెత్తనాన్ని సహించలేని ఇక్కడి రాష్ట్రాలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ పాలకులు మాత్రం స్వలాభం కోసం, కేంద్ర మెప్పు కోసం తెలుగు భాషను ప్రమాదంలోకి నెడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి మరీ హిందీకి స్వాగతం పలుగుతున్నారు. ఈ ధోరణిని తెలుగు ప్రజలు గుర్తించి వ్యతిరేకించకపోతే, తిరస్కరించకపోతే అది మన మాతృభాషకు మనం చేసుకున్న ద్రోహమే అవుతుంది.

## చివరిగా..

హిందీని వ్యతిరేకించే పంజాబ్ రాష్ట్రం, త్రిభాషా పద్ధతిని అనుసరించక తప్పని పరిస్థితుల్లో ఇంగ్లిష్, పంజాబీ తర్వాత మూడో భాషగా తెలుగుని చేర్చింది. ఇది కూడా ఘోరమైన తప్పిదమే. పరాయి భాషలు ఇష్టంతో ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. బలవంతంగా పిల్లల మీద రుద్ది తప్పనిసరిగా నేర్చుకోవలసిన పరిస్థితి కల్పించడం మాత్రం అన్యాయం. పంజాబ్ స్కూళ్ళలో తెలుగు నేర్పించే టీచర్లకు తెలుగు రాదు యూట్యూబ్‌ల నుంచి మొదట వాళ్ళు నేర్చుకుని దాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు. ఉచ్చారణ దోషాలే కాదు, ఒకరకంగా చెప్పాలంటే వారి చేతుల్లో తెలుగుభాష ఖూనీ అవుతోంది. కొంతకాలానికి తెలుగు భాష పట్ల పంజాబీ విద్యార్థులకు విరక్తి పుట్టొచ్చు. ఈ దుస్థితికి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టలేము. అక్కడ హిందీ టీచర్లు దొరికినట్టు తెలుగు టీచర్లు దొరకరు కదా. త్రిభాష అంటే హిందీనే అవసరం లేదు ఏ భారతీయ భాష అయినా నేర్చుకోవచ్చు అని వ్యర్థ మాటలు చెప్పే వారికి బాగా తెలుసు హిందీయేతర రాష్ట్రాల్లో మూడో భాషగా హిందీనే గతి అవుతుందని. అందుకే తమిళనాడు ప్రభుత్వం చాలా తెలివిగా తమ భాష మీద ఎవరి పెత్తనాన్నీ ఆమోదించని ద్విభాషా విధానమే అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలూ ఈ త్రిభాషా విధానాన్ని తిరస్కరించి తమ మాతృభాషకు పెద్ద పీట వేయకపోతే.. 'పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికినట్టు' హిందీ మెల్లమెల్లగా మీ భాషను మింగేసి తన ఆధిపత్యాన్ని చాటుకుంటుంది. ❑

# కరేడులో ఇంత భారీ విస్థాపన అవసరమా..!?

- జి.రోహిత్

**నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తలపెట్టిన స్వయం సమీకృత సౌర పలకల తయారీ పరిశ్రమ (వెర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ సోలార్ ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్. టూకీగా సౌర పలకల పరిశ్రమ) కోసం ప్రభుత్వం సుమారు 8500 ఎకరాలు సేకరించే ప్రయత్నంలో ఉంది. ఇప్పటికే సుమారు 4500 ఎకరాల సేకరణకు సంబంధించి, 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ప్రాథమిక ప్రకటన ఇచ్చారు. అయితే స్థానికులు, గ్రామస్తులు ఈ పరిశ్రమ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గ్రామసభలను అడ్డుకున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేశారు. వారి అభ్యంతరాలు, వ్యతిరేకత న్యాయమైనవే. ఎందుకు న్యాయమైనవో చెప్పడానికే ఈ వ్యాసం.**

ఈ పరిశ్రమలో తయారు చేసేది సౌర విద్యుత్తు తయారీలో వినియోగించే సౌర పలకలు. వీటి తయారీ ఆరు అంచెల ప్రక్రియ. ఈ పరికరాల తయారీకి మూల ఖనిజం క్వార్ట్జ్. ముఖ్యమైన ముడిపదార్థం పోలిసిలికాన్. క్వార్ట్జ్ నుంచి పోలిసిలికాన్ తయారుచేసి, దాని నుంచి అంతిమంగా పలకలు(మాడ్యూల్స్) తయారుచేస్తారు. పోలిసిలికాన్‌లో చైనాది గుత్తాధిపత్యం. ఆ దేశం ఇష్టాయిష్టాలని బట్టి మిగతా దేశాలకు ఈ ముడిపదార్థం అందుబాటులో ఉంటుంది. అందుకే అనేక దేశాలు ఇప్పుడు సప్లై చైన్ మొత్తం తమ అధీనంలో ఉండేటట్టు ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భారతదేశం ఒకటి. ఇప్పటి వరకు ఇక్కడ ఈ రంగం పలకల అసెంబ్లేజ్ వరకే పరిమితం అయ్యి ఉంది. అంటే పలకలకు అవసరమైన సెల్స్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకుని, వాటిని ఇక్కడ పలకలుగా అమరుస్తున్నారు. ఆ తర్వాత వాటిని ఎక్కువగా అమెరికాకి ఎగుమతి చేస్తున్నారు. అయితే మొత్తం తయారీ ప్రక్రియ దేశీయంగా ఉంటే లాభమని కేంద్ర ప్రభుత్వం ఈ పరిశ్రమను ప్రోత్సహిస్తున్నది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా ఆర్థిక మద్దతు అందిస్తున్నది.

ఈ నేపథ్యంలో ఇండోసోల్ సోలార్ సంస్థ 69,000 కోట్ల పెట్టుబడితో 'క్వార్ట్జ్ నుంచి మాడ్యూల్' పద్ధతిలో మొత్తం పలకల తయారీ ఇక్కడే చేస్తామని చెప్పి ముందుకు వచ్చింది. ఇటువంటి పరిశ్రమ ప్రపంచంలోనే ఇదే మొదటిదనే ప్రచారం జరిగింది. ఇది 2022 నాటి విషయం.

మొదట్లో తాము 10 గిగావాట్ల పలకలు తయారు చేస్తామని, అందుకు తమకు 5148 ఎకరాలు కావాలని, వివిధ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. ప్రభుత్వం అన్నిటికీ ఒప్పుకుంది. ఆ తరువాత 2023లో తమకు మరో 3200 ఎకరాలు కావాలని కోరింది. ప్రభుత్వం దానికీ ఒప్పుకుంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం దగ్గర భూములు కేటాయించింది. ఆ తరువాత ప్రభుత్వం మారాక 2025లో తమకు రామాయపట్నం బదులు కరేడులో భూములు ఇవ్వమని, మరిన్ని సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇవ్వమని అడిగింది. అలాగే, ఉత్పత్తి సామర్థ్యం 10 గిగావాట్ల నుంచి 20 గిగావాట్లకు పెంచుతామని పేర్కొంది. మొత్తం ఏడు దఫాలలో సెప్టెంబరు 2028 నాటికి పరిశ్రమను నిర్మిస్తామని పేర్కొంది. కూటమి ప్రభుత్వం అందుకు ఒప్పుకుంది. అడిగిన సబ్సిడీలన్నీ ఇవ్వటానికి ఆమోదం తెలిపింది. అంతా బానే ఉంది. మరి ఇటువంటి మంచి పరిశ్రమని వ్యతిరేకించడం ఎందుకు ?

**మొదటిది భూమి,** ఈ పరిశ్రమ కోసం నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో 20 గ్రామాలలో భూమి కావాలని ఇండోసోల్ అడిగింది. నెల్లూరులోని ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోను, గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలోను 8,462.5 ఎకరాలు, ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ మండలం సింగరాయకొండ, బింగినపల్లి గ్రామాలలో విస్తీర్ణం ఎంతో తెలియని భూమి అడుగుతోంది ఈ సంస్థ. నిజానికి ఇటువంటి పరిశ్రమకి ఇన్ని వేల ఎకరాల భూమి అవసరం లేదు. ఇప్పటి వరకు పోలిసిలికాన్ నుంచి పలకల వరకు ఒకే చోట లేదా ఒకే సంస్థ తయారు చేసే విధానం దాదాపుగా లేదు. ఇప్పుడిప్పుడే ఆ ఒరవడి మొదలయ్యింది.

అయితే, ఇండోసోల్ సంస్థ అడిగినంత భూమి అవసరం లేదనే దానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. ఆ ఉదాహరణలు మన దేశంలోనూ, చైనాలోనూ ఉన్నాయి. మన దేశంలో గుజరాత్‌లో ఇటువంటి సామర్థ్యంతోనే, అంటే 20 గిగావాట్ల సామర్థ్యం గల ఇటువంటి పరిశ్రమనే కేవలం కొన్ని వందల ఎకరాలలోనే ఏర్పాటు చేసి ఉన్నాయి. చైనాలో కూడా అదే పరిస్థితి. 2027 వరకు ఇండోసోల్ మూడంచెల ఉత్పత్తికి

మాత్రమే పరిమితం ఉంటుంది. దానికి 500-600 ఎకరాలు చాలు. ఆరంచెల ఉత్పత్తికి మరో ఐదారు వందల భూమి సరిపోతుందని మనకు ఉదాహరణలు చెబుతున్నాయి. అంటే మొత్తంగా 1500-2000 ఎకరాలు సరిపోతాయి. మరి దాదాపు 8500 ఎకరాలు ఎందు కోసం ? ఎవరి కోసం ? అది కూడా బహుళ పంటలు పండే కరేడులో ఎందుకు ?

ఈ భూమి దాహం ఇక్కడితో అయిపోలేదు. వారు తమ పరిశ్రమ విద్యుత్తు అవసరాల కోసం సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు కట్టుకుంటామని, వాటికి భూమి కేటాయించమని అడిగారు. కర్నూలు, కడప జిల్లాలలో 5 గిగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రం, కర్నూలు, నంద్యాల జిల్లాలలో 2.5 గిగావాట్ల పవన విద్యుత్తు కేంద్రం, కడప జిల్లాలో 2.2 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ తమకు అవసరం అని చెప్పారు. దీనికీ ప్రభుత్వం ఒప్పుకుంది. సంవత్సరానికి ఎకరానికి 31,000 రూపాయల లీజుకు ప్రభుత్వం అక్కడ భూములు ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. అవసరమైతే ఈ భూములను వాళ్ళకు అమ్ముతామని తెలిపింది.

ఒక గిగా వాట్ సౌర విద్యుత్తు కేంద్రానికి 4000-5000 ఎకరాలు కావాలి. అంటే 5 గిగా వాట్ల సౌర కేంద్రానికి 20,000-25,000 ఎకరాలు. అలాగే ఒక గిగావాట్ పవన విద్యుత్తు కేంద్రానికి 2000 ఎకరాలు కావాలి. అంటే 2.5 గిగావాట్ల పవన విద్యుత్ కేంద్రానికి 5000 ఎకరాలు. ఒక గిగా వాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు 600 ఎకరాల వరకు కావాలి. రెండు గిగా వాట్లకు అంటే 1200 ఎకరాలు. అంటే వీటన్నిటికీ కలిపి 26 వేల నుంచి 31 వేల ఎకరాల దాకా కావాలి. ఇది కాక ఈ సంస్థకు కావాల్సిన క్వార్ట్జ్ గనుల కోసం గనుల చట్టంలో సవరణ తీసుకువచ్చి కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలలో 200 ఎకరాలు కేటాయించారు. వారం పది రోజుల ముందు వాటికి అనుమతులు వచ్చేశాయి. చట్టరీత్యా అనుమతులు ఇవ్వడానికి వీలు లేదని అభ్యంతరాలు తెలిపినా వాటిని కాదని అనుమతులు ఇచ్చేశారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని లెక్కేస్తే ఈ ఇండోసోల్ సౌరపలకల పరిశ్రమ కోసం అవసరమైన భూమి 35,000 నుంచి 40,000 ఎకరాల పైమాటే. ఐదు జిల్లాలలో 30 గ్రామాలలో విస్తరించి ఉన్న భూమి ఇది. ప్రపంచంలో ఇంత విస్తీర్ణంలో ఏర్పడబోయే సౌర పలకల పరిశ్రమ ఇదే మొదటిది అవుతుంది. విజయవాడ నగర విస్తీర్ణానికి రెండింతల కన్నా ఎక్కువ భూమి ఇది.

ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో సౌర విద్యుత్తు సామర్థ్యం 4.6 గిగా వాట్లు. అంటే ఇప్పుడున్న రాష్ట్ర మొత్తం సామర్థ్యం కన్నా ఈ ఒక్క పరిశ్రమ చేయబోయేదే ఎక్కువ. పవన విద్యుత్తుతో అదే పరిస్థితి. అంతేకాక ఈ కేంద్రాలలో ఉత్పత్తి చేసే విద్యుత్తును బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. క్వార్ట్జ్ గనులకు ఇది వర్తిస్తుంది. ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేయడం ఒక్కటే ప్రజా ప్రయోజనమా, ఇంత పెద్ద ఎత్తున ప్రజలు కోల్పోతున్న భూమి సంగతేమిటి? 'అభివృద్ధి' కలలకి కాస్తంతైనా వాస్తవిక అంచనా ఉండొద్దా?

**రెండవది సంస్థ నేపథ్యం,** ఈ ఇండోసోల్ సోలార్ కంపెనీ షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు అనుబంధ సంస్థ. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ కడప ప్రధాన కేంద్రంగా డిస్కంలకు ట్రాన్‌ఫార్మర్లు ఉత్పత్తి చేసి, సరఫరా చేసే సంస్థ. మూడు, నాలుగేళ్ల క్రితం వరకు ఈ సంస్థ పేరు దాదాపు ఎవరికీ తెలీదు. అయితే గత ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ డిస్కంలకు ట్రాన్‌ఫార్మర్లు, స్మార్ట్ మీటర్లు అధికంగా సరఫరా చేసి పేరు గడించింది. ఎంతలా అంటే ఈ సంస్థ ఆదాయంలో 80 శాతం ఆంధ్రరాష్ట్ర డిస్కంల నుంచే పొందేంతగా.

ఈ సంస్థ ఆదాయాన్ని చూస్తే మరికొన్ని విషయాలు అర్థం అవుతాయి. 2014లో ఈ సంస్థ పన్ను అనంతర లాభం 7.59 కోట్లు. 2019 నాటికి అది రూ.113.61 కోట్లకు చేరుకుంది. ఐదేళ్ళలో, అంటే 2024 నాటికి ఏకంగా 608.05 కోట్లకు చేరుకుంది. దాదాపుగా తన ఆదాయం మొత్తం 3 డిస్కంల నుంచి సంపాదించిన సంస్థ ఇప్పుడు రూ.69,000 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తుంది అంటే నమ్మటానికి కష్టంగానే ఉంటుంది. అంతేకాదు, ఆంధ్రప్రదేశ్‌లో తప్ప బయట పెద్దగా వ్యాపారం లేని ఈ సంస్థకు ప్రపంచంలోనే మొట్ట మొదటి 'క్వార్ట్జ్ నుంచి మాడ్యూల్స్' పరిశ్రమకు అవసరమైన సాంకేతికత ఉందా?

సౌర పలకలు తయారు చేయడానికి వివిధ టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు మనం చెప్పుకున్నది సిలికాన్ ఆధారిత టెక్నాలజీ. కరేడు పరిశ్రమ అదే టెక్నాలజీ ఆధారంగా ఉంటుంది అని ఈ సంస్థ పేర్కొంది. పలకల తయారీ ఆరెంచెల ప్రక్రియ అని చెప్పుకున్నాము. ప్రతి అంచెకి ఒక రకమైన టెక్నాలజీ వాడాలి. ఈ రంగంలో ఉన్న ఇతర సంస్థలయితే తమ స్వంత టెక్నాలజీని అభివృద్ధి చేసుకున్నాయి. లేదా అప్పటికే ఆ టెక్నాలజీని అభివృద్ధి చేసిన సంస్థల నుంచి దానికి లైసెన్స్ తీసుకోవడమో లేదా ఆ సంస్థలనే కొనుగోలు చేయడమో చేశాయి. ఇక్కడ ఇండోసోల్ ఏ టెక్నాలజీ వాడుతుందనే విషయమే తెలియదు. ఏ టెక్నాలజీ వాడుతున్నారనే దాని మీదే నీటి అవసరం, కాలుష్యం, ఇతర విషయాలు ప్రధానంగా ఆధారపడి ఉంటాయి. అటువంటి సమాచారం ప్రజలకు తెలియడం చాలా అవసరం. ఎందుకంటే వారి మనుగడకు, ఆరోగ్యానికి అవి చాలా ముఖ్యమైన విషయాలు. ప్రజాస్వామిక పారదర్శకత రీత్యా ఆ విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అసలు ఈ సమాచారం ప్రభుత్వం దగ్గరైన ఉందా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు షిర్డి సాయి

ఎలక్ట్రికల్స్ జగన్ బినామీ కంపెనీ అని, దానికి ఈ స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేసే సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలు లేవని తెలుగుదేశం పార్టీ జాతీయ కన్వీనర్ నారా లోకేష్ ప్రకటించారు. ఆ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఏకపక్షంగా ఆ కంపెనీకి భూపందేరం చేయడానికి సిద్ధమయింది. ఈ కంపెనీ తెలుగుదేశం పార్టీకి 40 కోట్లు ఎలక్ట్రికల్ బాండ్స్ ద్వారా నిధులు ఇచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఈ వ్యవహారం గురించి ప్రతిపక్ష వైసీపీ పార్టీ, ఆ పార్టీ అధినేత పూర్తి మౌనం వహిస్తున్నారు. ఈ సంస్థ యాజమాన్యానికి, జగన్ మోహన్ రెడ్డికి మధ్య ఉన్న సాన్నిహిత్యం దీనికి కారణం అనుకోవాలా? ఈ మొత్తం విషయానికి తెరలేపిందే వైసీపీ అనే విషయాన్ని మనం ఇక్కడ గుర్తుపెట్టుకోవాలి.

**మూడవది కాలుష్యం,** సౌర విద్యుత్తు ఉత్పత్తి కాలుష్య రహితమే కానీ ఆ విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన పలకల ఉత్పత్తి మాత్రం కాలుష్యరహితం కాదు. ముఖ్యంగా సిలికాన్ ఆధారిత పలకల ఉత్పత్తి. సిలికాన్ శుద్ధి అనేది చాలా కాలుష్యకారక ప్రక్రియ. దేశవ్యాప్తంగా లేదా ప్రపంచవ్యాప్తంగా చూసినా కూడా క్వార్ట్జ్, సిలికాన్ శుద్ధి అనేవి ఎంత కాలుష్యకారకాలో అనేకానేక పరిశోధనలు ఇప్పటికే తెలిపాయి. కాబట్టి ఇది చాలా కాలుష్య నివారణ చర్యలు తీసుకుంటూ చేయవలసిన పని. సౌర విద్యుత్తు వాడకం ద్వారా తగ్గే కర్బన ఉద్గారాలు ఈ పలకల ఉత్పత్తి ద్వారా తిరిగి పెరుగుతాయి. శాస్త్రీయ కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటూ ఇటువంటి పరిశ్రమ నడిపితే కాలుష్య రీత్యా ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు కాని పరిశ్రమలతో మనకున్న అనుభవం దృష్ట్యా అది దాదాపు అసాధ్యం. పైగా బంగాళాఖాతం తీరంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న, బహుళ పంటలు పండే కరేడు లాంటి ప్రాంతంలో దీన్ని స్థాపించడం ఏ విధంగా సబబు? 2013 భూసేకరణ చట్టం ప్రకారమైతే నీటి వసతి ఉన్న బహుళ పంటల భూములను సేకరించనే కూడదు.

**నాలుగవది వ్యవసాయం - పర్యావరణం,** 17 గ్రామాలున్న కరేడు పంచాయతీ పుష్కలమైన పంటలు పండే ప్రదేశమని ఇది వరకే చెప్పాను. ఇక్కడ వేసవి కాలంలో కూడా 15 అడుగుల లోపలే నీరు లభిస్తుంది. ప్రధానంగా మత్స్యకారులు, రైతులు, రైతు కూలీలు నివసించే గ్రామాలు ఇవి. పదహారో నెంబరు జాతీయ రహదారికి, బంగాళాఖాతానికి మధ్య ఉన్న ప్రాంతం ఇది. ఒక వైపు బంగాళాఖాతం, మరొక వైపు మన్నేరు వాగు. అలాగే కరేడు, చేవూరు, చెన్నాయపాలెంలలో పెద్ద చెరువులు. వరి, వేరుశనగ, పప్పు ధాన్యాలు, కూరగాయలు మొదలైన పంటలెన్నో పండుతాయి. మత్స్యకారులకు బంగాళాఖాతం ఎలాగూ ఉంది. ప్రసిద్ధిగాంచిన ఉలవపాడు మామిడిని కూడా ఈ గ్రామాలలో సాగు చేస్తారు. ఈ పరిశ్రమకు సంగం బరాజ్ ద్వారా సోమశిల రిజర్వాయర్ నుంచి రోజుకు ఒక కోటి 15 లక్షల లీటర్ల నీరు, చేవూరు, చెన్నాయపాలెం చెరువుల నుంచి రోజుకు 70 లక్షల లీటర్ల నీరు కేటాయించారు. మన్నేరు వాగును కూడా తమ అవసరాలకు ఉపయోగించుకునే విధంగా అనుమతించారు. వీటన్నిటి ప్రభావం ప్రజల మీద, వ్యవసాయం మీద, వారి ఆర్థిక-సామాజిక జీవితం మీద, పర్యావరణం మీద ఎంతగా ఉంటుందో ఎవరైనా అంచనా వేశారా? లేదు. పైగా వేయమని కూడా చెప్పారు.

2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013 నాటి భూసేకరణ చట్టాన్ని సవరించింది. అది చాలా ప్రమాదకరమైన, అప్రజాస్వామికమైన సవరణ. ఆ సవరణ ప్రకారం కొన్ని రకాల ప్రాజెక్టులను ప్రజల సమ్మతి, సామాజిక ప్రభావ అంచనా నుంచి మినహాయించారు. అందులో ఒకటి పారిశ్రామిక వాడలు. ఇప్పుడు ఈ భూసేకరణని పారిశ్రామిక వాడ పేరు మీద చేస్తున్నారు. కేవలం ఒక పరిశ్రమ కోసం చేస్తున్న భూసేకరణను పారిశ్రామికవాడ కోసం చేస్తున్నామనేది ఎంత వరకు చట్టబద్ధమనే విషయాన్ని పక్కనబెడితే, ఆ సవరించిన చట్టంలో కూడా 'ప్రజా శ్రేయస్సు' కోసమే ఈ మినహాయింపని ఉంది. ఇప్పుడు ఈ పరిశ్రమ ఏ విధంగా ప్రజా శ్రేయస్సు కిందికి వస్తుంది ? ఇందులో లాభపడేది ఎవరు, వారి లాభం కోసం నష్టపోయేది ఎవరు ? ఆ నష్టాలు ఎలా ఉంటాయి?లాంటి విషయాలు తెలిసేది సామాజిక ప్రభావ అంచనా ద్వారానే. అన్నిటికన్నా మూలమైన, ప్రధానమైన దానినే తొలగిస్తే దానికి ఏ పాటి విశ్వసనీయత, నమ్మకం, ప్రజామోదం ఉంటాయి ? చేతిలో దండం ఉంటే ఆమోదం ఎందుకు అని కాబోలు !

ఇక్కడ ప్రజామోదం ఆర్థిక కారణాల రీత్యా కూడా చాలా అవసరం. ఈ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా 5175 కోట్లని కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం అయితే అన్ని రకాల సబ్సిడీలు, ప్రోత్సాహకాలు కలిపి 41,254.50 కోట్లు కేటాయించింది. అంటే మొత్తం 46,429.5 కోట్లు. ఇదంతా ఎవరి డబ్బు ? ప్రజల ఆస్తి, ప్రజల డబ్బు. ప్రజల డబ్బు ప్రైవేటు సంస్థల లాభం కోసం ఇస్తూ, దానికి ప్రజామోదం అక్కర్లేదు అనటం ఏం ప్రజాస్వామ్యం ?

వీటన్నిటినీ గమనిస్తే కనుక ఇది మరొక అనంతపురం లేపాక్షి, కాకినాడ ప్రత్యేక ఆర్థికమండలి, ఎస్.కోట జిందాల్ లాంటి పరిశ్రమల జాబితాలోకే వచ్చేటట్టు ఉంది. ప్రజలకు, దేశానికి, పర్యావరణానికి మేలు చేసే పరిశ్రమలా కాకుండా భారీ భూపందేరం అనే అనుమానాలు తీవ్రంగా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం ఇండోసోల్ సంస్థ పరిశ్రమను ఈ ప్రాంతంలో నిర్మించుకునే ఆలోచన విరమించుకుని, తగిన చోట తక్కువ విస్తీర్ణంలో నిర్మించుకునే ఆలోచన చేయడం మంచిది. ❑

# సైన్స్ రచనల అవసరం ఎప్పుడూ ఎక్కువే!



- డాక్టర్ దేవరాజు మహారాజు

**మొదటి నుంచి శాస్త్రజ్ఞుడికి, సామాన్యుడికీ మధ్య చాలా దూరం ఉంటూ వచ్చింది. శాస్త్రవేత్త తన ప్రయోగాల ఫలితాలను ప్రచురిస్తాడు. కానీ అవి జాతీయ, అంతర్జాతీయ సైన్స్ జర్నల్స్‌లో ఉంటాయి. అవి సామాన్యులకు అందుబాటులో ఉండవు. ఉన్నా, శాస్త్రవేత్తలు ఉపయోగించిన శాస్త్ర సాంకేతిక పదాలు వారికి అర్థం కావు. తత్ఫలితంగా ఈ సగటు మనిషి, తాత్కాలికంగా రంగుల కలలను చూపించే కల్పనా సాహిత్యం వైపు మొగ్గు చూపుతాడే గానీ, ప్రకృతి రహస్యాలను, మానవుడి విజయాలను గురించి చెప్పే "విజ్ఞాన సారస్వతం" జోలికి పోడు. మనిషి కదలికలను, చేతి గీతలను, జాతకాలను, ముహూర్తాలను నమ్మేవారు నమ్ముకుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటూనే ఉన్నారు.**

మూఢాచారాలు, కర్మ సిద్ధాంతంపై విశ్వాసం ఇంకా పోలేదు. ఇందుకు ప్రభుత్వాధినేతల బాధ్యత ఎంతైనా ఉంది. కాబట్టి సామాన్యుడి కోసం సైన్సు రాయాల్సిన అవసరం ఎప్పుడూ ఎక్కువగానే ఉంటూ ఉంది. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో దేశం ప్రగతి సాధించాలంటే ప్రజలకు శాస్త్రీయ అవగాహన అలవడటం చాలా అవసరం ! హేతుబద్ధమైన దృష్టి, శ్రమశక్తి పట్ల గౌరవం, వ్యక్తి చేసే పనివల్ల సామాజిక ప్రయోజనం వంటి వాటిని శాస్త్రీయ అవగాహన స్పష్టం చేస్తుంది. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేసిన తెలుగు రచయితలు చాలా మందే ఉన్నారు.

పావులూరి మల్లన్న రాసిన "గణిత శాస్త్రం" దక్షిణ భారతంలో మొట్టమొదటి వైజ్ఞానిక రచన అని పలువురి అభిప్రాయం. తర్వాతి కాలంలో వేమూరి విశ్వనాథశర్మ, ఎం.నర్సింహము, కె.సీతారామయ్య, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి, నిడదవోలు, కాళీపట్నం కొండయ్య మొదలైనవారు 1914-1940 మధ్యకాలంలో తెలుగులో సైన్సు రచనలు విరివిగా రావడానికి కారణమయ్యారు. ఆ తర్వాత, త్రిపురనేని రామస్వామిచౌదరి, తాపీ ధర్మారావు, గోపరాజు రామచంద్రరావు, హరి ఆదిశేషువు, భేతనభట్ల విశ్వనాథం, డాజీ గోపాలరావు, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, ఆర్వీజీ సుందరరావులు విరివిగా సైన్సు రచనలు ప్రకటించారు.

తర్వాత తరంలో అంటే, 1950-80 మధ్య ఆధునిక దృక్కోణంలో నుంచి కొత్తతరం తెలుగు సైన్సు రచయితలు పుట్టుకొచ్చారు. వసంతరావు వెంకటరావు, నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామ్మోహన్‌రావు, కొడవటిగంటి కుటుంబరావు, డాక్టర్ మహీధర నళినీ మోహనరావు, గాలి బాలసుందరరావు, డాక్టర్ పి.దక్షిణామూర్తి, అయ్యగారి వీరభద్రరావు, రావూరి భరద్వాజ, రావిపూడి వెంకటాద్రి, కొడవటిగంటి రోహిణీప్రసాద్ మొదలైన వారు. ఇక్కడ ప్రముఖులైన వారి పేర్లను చెప్పింది ఎందుకంటే, సైన్సు రచయితలుగా నిలబడాలనుకున్న వారూ, ఇతరత్రా అభిరుచి ఉన్న వారు, వీరి రచనలు వెతుక్కుని తప్పక చదువుతారని నా ఆశ! గతాన్ని బాగా అవగతం చేసుకున్నప్పుడే కదా, మన వర్తమానాన్ని కావాల్సిన రీతిలో తీర్చిదిద్దుకునేది?

"కళ కళ కోసమే, కవిత్వం కవిత్వం కోసమే"లాగా సైన్సు సైన్సు కోసమేనని అనుకునే వారున్నారు. అలాంటి వారి వల్ల సమాజానికి పెద్దగా లాభం ఉండదు. అన్నీ సమాజ శ్రేయస్సు కోసమే అనుకుని పనిచేసే వారు కావాలి! సైన్సు సైన్సు పాఠంలాగా కాకుండా సమాజ గతికి అన్వయించి, సామాజిక కోణంలో నుంచి చెప్పే వారు కావాలి. ఇలాంటి వారు చాలా తక్కువ మందే ఉన్నారు. యువతరం ఇప్పుడీ పనిని చేపట్టాల్సి ఉంది. ఎవరి పరిధిలో వారు. ఎవరి స్థాయిలో వారు. ఎవరికి వీలైనంత వారు వైజ్ఞానిక - హేతువాద ప్రచారానికి కృషి చేస్తూ ఉండాలి. ముఖ్యంగా ఈ విషయాలు బాలబాలికలకు, యువతీ యువకులకు తెలియజేయడం చాలా అవసరం. ఎందుకంటే భావి భారత పౌరులు వారే, వారి దృక్పథంలో మార్పు వస్తే క్రమక్రమంగా రాగల కాలంలో సమాజంలో మార్పు దానంతట అదే వస్తుంది. ఇప్పటికే కొన్ని స్టడీ సర్కిల్స్‌లో చర్చలు నిర్వహించుకుంటున్నారు. ఆలోచనలు పంచుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం కొందరు ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు వైజ్ఞానిక స్పృహ కలిగించే పుస్తకాలు పరిచయం చేస్తున్నారు. పత్రికల్లోని ఇలాంటి వ్యాసాలు చదివి వినిపిస్తున్నారు. అవసరమైన చోట వారి అనుమానాలు తీరుస్తున్నారు. కొంతమంది ఉదార స్వభావులు తమ స్వంత డబ్బుతో సైన్సు, హేతువాద, మానవవాద పత్రికలకు చందాలు చెల్లించి, తమ ప్రాంతంలోని గ్రంథాలయాలకు ఆ పత్రికలు

అందేట్లు చేస్తున్నారు.

జన విజ్ఞానవేదిక, మానవ వికాస వేదిక, విజ్ఞాన దర్శిని, ప్రజాసైన్సులాంటి సంస్థలున్నాయి. వాటి శక్తి మేరకు అవి పని చేస్తున్నాయి. అలాగే హేతువాది, సైన్సు- హేతువాదం, స్వేచ్ఛాలోచన, గ్రీన్‌బెల్ట్, నాస్తిక దర్శిని, వాయిస్ ఆఫ్ చార్వాక, భౌతికవాది, ప్రజాసైన్స్ వేదిక, వివేక పథంలాంటి చిన్న, పెద్ద పత్రికలెన్నో ఉన్నాయి. చెకుముకి పిల్లల సైన్సు పత్రిక ఉంది. వీటి వెనుక అనుభవజ్ఞులైన సంపాదకులు, రచయితలు, కార్యకర్తలు ఉన్నారు. నిజమే! అయినా ఈ నివేదికలూ ఈ పత్రికలూ సరిపోవు. ఇంకా ఇంకా కావాలి. వేదికల సంఖ్య పత్రికల సంఖ్య ఎన్నో రెట్లు పెరగాలి. జనంలోని మూఢత్వాన్ని, మరీ ముఖ్యంగా విద్యావంతుల్లో మూర్ఖత్వాన్ని వదిలించాలంటే ఇంకా ఎక్కువ సంఖ్యలో సైన్స్ కార్యకర్తలు ముందుకు రావాలి!

అన్ని దిన, వార, మాస పత్రికల్లో వైజ్ఞానిక స్పృహను పెంచే రచనలు వస్తూ ఉండాలి. కొన్ని టెలివిజన్ ఛానళ్లలో మూఢ నమ్మకాలపై చర్చలు జరుగుతుంటాయి. సంతోషించాల్సిన విషయమే. కానీ, వాటికంటే నాలుగు రెట్లు ఎక్కువగా జ్యోతిష్యం, రంగుల రాళ్లు, అల్లా గొలుసులు (తాయెత్తులు), బాబా హారతి కార్యక్రమాలు-ప్రత్యక్ష ప్రసారాలు జరుగుతుంటాయి. సమాజంలో అన్ని వర్గాల వారిని, అన్ని ఆలోచనా ధోరణులను ఆదరించాలనుకుంటే, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. దర్శనీయ స్థలాల పేరిట ఉచితంగా కైలాస దర్శనం, వైకుంఠ దర్శనం, మక్కా, బెత్లాహేం వగైరాను కొన్ని చానళ్లు చూపిస్తూనే ఉంటాయి. భక్తిని, మూఢ నమ్మకాలను పోషించడంలో టెలివిజన్ ఛానళ్లు, పత్రికలు బహుశా పోటీ పడుతుంటాయి. వాస్తు, వారఫలాలు లేని పత్రిక ఏదైనా ఉందా ? సుప్రభాతాలు లేని రేడియో ఛానలుందా? ఇవన్నీ చెప్పుకోవడమెందుకంటే, ఎన్నెన్నో ప్రతికూల పరిస్థితుల నెదుర్కొంటూ సైన్స్ కార్యకర్తలు సమాజంలో వైజ్ఞానిక స్పృహను పెంచడం చాలా కష్టం. ఇదంత సులభమేమీ కాదు. అట్లని బాధ్యతను గాలికి వదిలేసి, చేతులు ముడుచుకుని కూర్చోకూడదు!

వయసులో ఉన్నప్పుడు కొంతమంది సైన్సు రచయితలు ఏదో చేసెయ్యాలని ఉబలాటపడతారు. కానీ, వాస్తవానికి వారు చేసింది ఏమీ ఉండదు. పైగా పెరిగే వయసు వల్ల శారీరక, మానసిక మార్పులు వస్తాయి. ఫలితంగా యోగుల కథలు, సాధువుల జీవిత చరిత్రలు చదువుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. ఇలాంటి ఆరిపోయే దీపాల వల్ల యువతరానికి ఏ మాత్రం లాభం ఉండదు. అలాంటి వారిని వదిలేసి ముందుకు దూసుకుపోవడం జరుగుతూనే ఉండాలి. సైన్స్ కార్యకర్త లెప్పుడూ పరిగెత్తే గుర్రాల్లాగా ఉంటేనే దూసుకుపోగలరు. అన్ని రంగాల్లో వలె, ఈ రంగంలో కూడా ప్రచార పటాటోపం ప్రదర్శించే వారున్నారు. కళానిధి, సాహిత్యకోవిదులు, సైన్స్ ధురీణలాంటి బిరుదులు తగిలించుకుని ప్రచార కార్యక్రమాలు చేపడుతుంటారు. వీరికి హేతువాదం, నిరీశ్వరవాదం, మానవవాదం లాంటి పదాలు మాట్లాడడమే ఇష్టం ఉండదు.

ఇలాంటి వారు ఒకే ఒరలో రెండు కత్తులు దూరుస్తారు. సంస్కృతి పేరుతో ఒక వైపు సంప్రదాయాన్ని, మరోవైపు సైన్సును కట్టగట్టి మాట్లాడుతారు. ఇంకా చోద్యమేమంటే వారి స్వీయ మూఢనమ్మకాలకు శాస్త్రీయ నేపథ్యం ఉందని దబాయిస్తుంటారు. జనం నవ్విపోతున్నారన్న స్పృహ కూడా వారికి ఉండదు. ఇంతెందుకూ? శ్రమజీవుల స్వేదంపై అమోఘంగా పాటలు పాడేవారు. అట్టడుగు వర్గాల పట్ల గాఢమైన సానుభూతి ఉన్నవారు. పెత్తందారీ వ్యవస్థ మీద మాటల తూటాలు పేల్చేవారు. దేవుడూ, మత విశ్వాసాల విషయానికి వచ్చేసరికి నిశ్శబ్దమై పోతారు. ఒక్కమాట మాట్లాడరు. "ఎందుకు? అలాంటి విషయాలు లేవనెత్తి- కొరివితో తలగోక్కోవడం?" అని అనుకుంటారేమో! తెలియదు. ఈ అరవై, డెబ్బై ఏళ్లుగా శాస్త్రీయ ఆలోచనా విధానానికి కొన్ని రాజకీయ పార్టీలైనా గట్టిగా నిలబడి ఉంటే, దేశం ఇంత అల్లకల్లోలమయ్యేది కాదు. ఇప్పటికైనా సరే ఆ మార్పు రావాలి. రాజకీయ, సామాజిక సంస్థలు, సంఘాలు మరింత చైతన్యవంతం కావాలి. వైజ్ఞానిక ప్రగతిని అడుగున పడేసే కార్యక్రమాల్ని అడ్డుకుంటూ ఉండాలి.

అయితే, సైన్సు నేపథ్యంలోంచి హేతువాదాన్ని ప్రచారం చేస్తున్నవారు బాబుగోగినేని. ఈయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీవీ చర్చలలో విరివిగా కనిపిస్తుంటారు. ఈ రంగంలో సీనియర్లు అయిన డాక్టర్ బ్రహ్మారెడ్డి, పెన్మెత్స సుబ్బరాజు, పసల భీమన్న, షరీఫ్‌గోరా కొత్తపల్లి రవిబాబు, డాక్టర్ గుమ్మా వీరన్న, మేడూరి సత్యనారాయణ మొదలయిన వారే కాకుండా కుర్రా హనుమంతరావు, షేక్ బాబు, రావు కృష్ణారావు, జీడీ సారయ్య, షేక్ దరియావలి వంటి వారు కూడా ఉన్నారు. "నేను ఎందుకు సైన్సు రాస్తున్నాను" అనే సంకలనం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, మల్యాద్రిల సంపాదకత్వంలో ప్రకటించారు. ఇలాంటివి ఇంకా రావాలి. ప్రచురణకర్తలు ముందుకొచ్చి ప్రోత్సహించాలి. ఇంకా కొన్ని పేర్లు నేను మరిచిపోయి ఉండొచ్చు. అందువల్ల వారి కృషి తక్కువదై పోదు. లేదా గతంలో మరోచోట మరికొందరిని గుర్తుచేసుకుని ఉంటాను. ఏమైనా సైన్సు మానవవాద-హేతువాద కార్యకర్తలు, రచయితలు, సంస్థలు నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. తప్పదు! ❑

# మహిళా హక్కులపై అంబేద్కర్ కృషి



- మాడభూషి శ్రీధర్

**ఆడ పిల్ల పుట్టుక దుఃఖమయంగా భావించకూడదని బౌద్ధం అంటుంది. బుద్ధుడు, ప్రసేన్‌జిత్ మహారాజుల మధ్య ఓ సంఘటన జరిగింది. తనకు ఆడపిల్ల జన్మించిందనే కారణంతో ప్రసేన్‌జిత్ మహారాజు బాధపడుతూ ఉంటే 'ఆడ బిడ్డ పుట్టిందని ఎంత మాత్రం దుఃఖించాల్సిన అవసరం లేదు. ఆడ బిడ్డ మగ బిడ్డకు ఏ మాత్రం తీసిపోదు' అని బుద్ధుడు అన్నాడని అంబేద్కర్ ఒకానొక సందర్భంలో గుర్తుచేశారు. 1951 సెప్టెంబర్ 9న కేంద్ర న్యాయ శాఖ మంత్రి పదవికి అంబేడ్కర్ రాజీనామా చేశారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో ఆడ వారి హక్కుల కోసం ఆ పదవిని వదులుకున్న మహానేతగా ఆయన మిగిలారు.**

రాజ్యాంగ రచనకంటే కష్టమైన సమస్య అంబేద్కర్ నిర్మించిన మొదటి హిందూ కోడ్. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్(1891–1956)ఒక పండితుడు, సామాజిక సంస్కర్త, దళితులు, మహిళల హక్కుల కోసం శక్తివంతమైన న్యాయవాదిగా, భారత రాజ్యాంగ సభలో రచనా సంఘం అధ్యక్షుడిగా, దేశ తొలి న్యాయమంత్రిగా పనిచేశారు. అటువంటిది, రాజ్యాంగ నిర్మాణం కంటే హిందూ కోడ్ తయారీ చాలా కష్టమని రాజీనామా చేయవలసి వచ్చింది.

సమానత లేకపోతే ఆర్టికల్ 14 కానీ, పీఠిక కానీ, ప్రాథమిక హక్కులూ ఎందుకూ అక్కరకు రావు. స్వాతంత్ర్యోదమం నుంచి గణతంత్రం వరకు రాజ్యాంగ రచన(1947–26 జనవరి 1950 వరకు) వలస భావాల బానిసత్వం నుంచి విముక్తికోసం పోరాడడం కూడా చాలా ప్రధానమైన అంశంగా చెప్పవచ్చు. హిందూ శాసనాలను సంస్కరించడానికి అంబేద్కర్ ఎంతో కష్టపడాల్సి వచ్చింది. వ్యతిరేకతలు, ప్రతిఘటనలు, అవమానాల ను భరిస్తూ మహిళా చైతన్యాన్ని అంబేద్కర్ రగిలించారు. స్త్రీశక్తిని తీవ్రంగా కదిలించి, సంస్కరణ ఉద్యమ సామాజిక విప్లవాన్ని ఆయనే ప్రారంభించారు.

రెండు హిందూ కోడ్‌ల మధ్య భారత దేశంలో పెద్ద పోరాటమే జరిగింది. మొదటి హిందూ కోడ్ పోరాటాన్ని అంబేద్కర్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రారంభించారు.



నెహ్రూ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచనలో పాల్గొన్న అనేక నాయకులకు అంబేడ్కర్‌కు హిందూ కోడ్‌పై తీవ్రమైన ప్రతిఘటనలు ఎదురయ్యాయి. ఎన్నో అభ్యంతరాలు వ్యతిరేక అభిప్రాయాలు వల్ల ఎన్నో మార్పులు చేసి మరో క్రోడీకరణ జరిగింది. వీటిని రెండు హిందూ కోడ్‌లుగా చెప్పవచ్చు.

**హిందూ సామాజిక సంస్కరణ..**

భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి 1947–1950 వరకు సమావేశమైన రాజ్యాంగ సభకు డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవ మామూలు కాదు. అసాధారణం, అద్భుతం. (అంబేద్కర్ రచనలలో 14వ సంపుటిలో హిందూ చట్టాన్ని 'సవరించేందుకు, క్రోడీకరించేందుకు' ఆయన రాజ్యాంగ సభలో చేసిన ప్రసంగాలు చదవవచ్చు. 1947 ఏప్రిల్ 11న అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లుపై పూర్తి చర్చ అందరూ చదవవలసిందే.)

బహుభార్యత్వాన్ని వ్యతిరేకించడం, విడాకుల చట్టాన్ని అమలు చేయడం వంటి అనేక ముఖ్యమైన తీర్మానాలను ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ మహిళా సమావేశం ఆమోదించింది. దురదృష్టవశాత్తు, ముఖ్యమైన మహిళా నాయకులు బిల్లుకు మద్దతు ఇవ్వడంలో ఆసక్తి చూపలేదని అంబేద్కర్ బాధపడ్డారు.

అంబేద్కర్ రాజ్యాంగానికి కంటే ముందు హిందూ కోడ్‌ను నిర్మించారు. దీనిని చాలా మంది వ్యతిరేకించారు. బిల్లు మీద చర్చించారు, తిరస్కరించారు. చాలా వరకు హిందూ కోడ్‌లో ఆయన చేర్చిన అంశాలు తొలగించడం సాధ్యం కాని అంశాలు అని అర్థమైంది. అందులో ముఖ్యమైన అంశాలు ఇవి:

1) ప్రధానమైన సంస్కరణ హిందూ వివాహానికి

సంబంధించినది.

2) దత్తత కోసం చాలా సమగ్రంగా నియమాలు తయారు చేశారు.

3) పిల్లలను ఏ విధంగా సంరక్షించుకోవాలి? అంటే అమాయకులను, మతిస్థితి ఆధారంగా పెంచుకోవలసిన వారనే పోషకుల నియమాలు ముఖ్యమైనవి.

4) వీలునామా, ఉమ్మడి-కుటుంబ ఆస్తి, దాని విధానం, మహిళలకు సాంప్రదాయేతర ఆస్తి కేటాయించడం కూడా చాలా వివాదాస్పదమైంది.

హిందూ శాస్త్రాల ఆధారంగా అమలులో ఉన్న మితాక్షర, దాయభాగ రకాల ఆస్తిసంక్రమణ, తదితర అంశాలను, వీలునామాతో మార్చే ఆస్తి వివరాలు అన్నీ సమస్యలమయమైనవే. వీలునామా లేని సందర్భాలలో ఆస్తి వారసత్వం ఏ విధంగా పంచుకోవాలనేది కూడా సంక్లిష్టమైనది. (మితాక్షర అనేది 'పుట్టుక ద్వారా వారసత్వం' అనే సిద్ధాంతానికి ప్రసిద్ధి చెందిన యాజ్ఞవల్క్య స్మృతి, దయాభాగ చట్టానికి అధికారంగా ప్రబలంగా ఉంది. 'దాయభాగం' అనేదానిని ఇంగ్లీష్‌లో ఇన్హెరిటెన్స్ అంటారు.)

1) మగ వారికి మహిళల ఆస్తికి సంబంధించిన విధానాలు వేరుగా ఉన్నాయి. ఇదే పెద్ద చారిత్రక వివాదం. కోర్టులో కూడా తేలవు. స్త్రీ ధన, వారసత్వ ధనం. సర్వైవర్షిప్ ఆస్తుల బదిలీ, సంక్రమించడం చిన్న విషయాలేమీ కావు. లాయర్లకు సవాలు విసిరే అంశాలు, బోలెడు డబ్బు తెచ్చే వివాదాలు కూడా అవే. ఎవరు కష్టపడి సంపాదించిన డబ్బయినా సరే, వారసులు వేరే అయినా, నిజంగా దాదాపు సగం, లేదా అంతకన్నా ఎక్కువ సంపాదించే వారు న్యాయవాదులే అవుతారు.

2) వీటితోపాటు వారసత్వం, ఆస్తుల సంక్రమణ విధానాలను కోడ్ తయారీకి ఏర్పాటు చేశాయి.

## హిందువులు ఎవరు ?

హిందువుల నిర్వచనం, కుల వ్యవస్థను తొలిగించింది. ముస్లిం, పార్సీ, క్రైస్తవులు లేదా యూదులు కాని ఎవరికైనా హిందూ కోడ్ వర్తిస్తుంది. అందరికీ యూనిఫాం (ఉమ్మడి) కోడ్ ఇది. కానీ అందరూ ఒప్పుకుంటారా ? ఈ బిల్లులోని 'కోడ్ అప్లికేషన్' గురించి చర్చించే క్లాజ్ 2తో చర్చ ప్రారంభమైంది.

హిందువులెవరు అనే ప్రశ్నతో ఈ చర్చ కీలకంగా మారింది. ఈ క్లాజ్‌లో హిందువులతో పాటు బౌద్ధులు, జైనులు సిక్కులకు కూడా కోడ్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇది ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు లేదా యూదులకు వర్తించదు. ఈ క్లాజ్‌ను పార్లమెంటులోని చాలా మంది సభ్యులు వ్యతిరేకించారు. ఇదే వివక్షకు ఆధారమనీ విమర్శించారు. అదే ఉండాలనే వారు కూడా ఎక్కువమందే ఉన్నారు.

ఈ బిల్లును హిందువులకు మాత్రమే కాకుండా 'మన అధికార పరిధిలోని మనం చట్టం చేయగల అన్ని మతాలకు చెందిన పౌరులకు' వర్తింపజేయాలి అని మధ్యభారత్ రాష్ట్రానికి చెందిన వి.ఎస్. సర్వతే అన్నారు. బిహార్‌కు చెందిన సభ్యులు బనార్సి ప్రసాద్ జున్‌జున్‌వాలా ఈ బిల్లుకు భారతదేశంలోని అందరు పౌరులకు 'ఏ కులానికి, ఏ మతానికి చెందినవారనే దానితో సంబంధం లేకుండా' వర్తించే సవరణను ప్రతిపాదించారు.

## స్వయం ప్రతిపత్తి..

భారతీయ మహిళలకు స్వయం ప్రతిపత్తి, స్వాతంత్ర్యం అనే హక్కులు ఉన్నాయా లేవా అనేది అనుమానమే కదా. మగా ఆడ అనే పదాలతో సంబంధం లేకుండా వీలునామా రాయకుండా మరణించే హిందువు ఆస్తి హక్కు ఎప్పుడొస్తుంది?

అంబేద్కర్ కోడ్ మహిళలను సమాన పౌరులుగా గుర్తించింది. ఈ ప్రయత్నం వారి వ్యక్తిత్వం దెబ్బతినకుండా చూడాలన్న కోరికగా చెప్పవచ్చు. మహిళలకు ఆస్తి పై హక్కు లేకపోవడం తీవ్రమైన లోపంగా చూడాలి. ఆస్తి హక్కు కూడా లింగ ఆధారిత అణచివేత కుల-ఆధారిత అణచివేతతో ముడిపడి ఉంది. ఈ సంబంధం అర్థం చేసుకోవాలంటే కులం, బ్రాహ్మణ పితృస్వామ్యంలాంటి అంశాలు అర్థం కావాలి. కాబట్టి సంస్కరణతో పాటుగా ఈ సంస్కరణాలన్నిటి క్రోడీకరణ అవసరమైంది. అయితే, దీంట్లో మతపరమైన పునాది ఉందని అంబేద్కర్ పదే పదే చెప్పారు. అయినా ఇంకా చాలా మంది అర్థంచేసుకోవాల్సి ఉంది.

## కాపురం హక్కు, వ్యక్తిగత గోప్యత హక్కు?

భారతీయ హిందూ వివాహాల చట్టంలో కాపురం హక్కు ఉంది. రైట్ టు కాంజుగల్ లైఫ్. అసలేమిటీ హక్కు? ఇక్కడ ఒక విచిత్రమైన విషయాన్ని ప్రస్తావించాలి. సినీ నటి సరితకు ఎప్పుడో పెళ్లయిందంటారు. ఆమె, ఆమె భర్త కూడా ఆ విషయాన్ని మరిచిపోయారు. ఆమె పెద్ద ప్రసిద్ధమైన నటి అయిన తరువాత భర్త కోర్టులో కేసు వేశాడు. అయితే దీని మీద స్పందించిన కొందరు బలవంతంగా కాపురం చేయిస్తారాని అడిగారు. దీని గురించి జస్టిస్ పిఎ చౌదరి సంచలనమైన తీర్పు వెలువరించారు. అది ప్రైవసీ హక్కు అని మొదట చెప్పి, కొన్ని దశాబ్దాల తరువాత ఇది అన్యాయమని అన్నారు. అప్పటి వరకు పోలీసులతో కాపలా పెట్టి కాపురాలను రక్షిస్తారా? ఇది విచిత్రం కాదు, పిచ్చి అనకూడదా..!

## రాజ్యాంగం సరే, విడాకుల పోరాటం ఏమిటి?

ఓ సారి పెళ్లయిన తరువాత ఆ బంధానికి మోక్షం అసలు దొరికే అవకాశమే లేదనే స్థితి వచ్చింది. హిందూ సనాతన

ధర్మంలో పెళ్లయిన భార్యకు ఎటువంటి పరిస్థితుల్లోనూ మరో జీవితం లేదు. న్యాయం కోసం, రాజ్యాంగం కోసం కూడా సమానత హక్కులు అవసరం. సమానత లేకుండా భారత రాజ్యాంగం రాసుకోవడం ఒక వృథా.

ఓ సారి పెళ్లయిన తర్వాత బంధం ఎంత నరకమైనా కొనసాగించాలా? ఆడవారా మగవారని కాదు. ఎవరైనా సరే విడాకులు అవసరమని ఎన్నాళ్ల తరువాత తెలుస్తుంది? వివాహం రద్దు చేసే అవకాశాలు ఉండి తీరాలనేది అంబేద్కర్ తీవ్రమైన ప్రతిపాదన అంటారు. కులం దుర్మార్గాన్నే కాదు, స్త్రీ మీద అణచివేత ధోరణులను కూడా అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. భర్తతో తేడాలు వస్తే విడాకుల ద్వారా పెళ్లిని రద్దు చేసుకునే అవకాశాన్ని హిందూ కోడ్ బిల్లుతో అంబేద్కర్ కల్పించారు.

విడాకులు ఉండనే ఉండవంటారు. విడిపోయి కూడా బతకనివ్వరు. కోర్టులో అడిగినా విడాకులు ఇవ్వరు. విడాకులు ఉండాలని, వాటికి అనుమతించాలని సంస్కరణలు కోరుతున్నాయి. తప్పనిసరి విడాకుల స్వేచ్ఛ నిబంధన కోసం అంబేద్కర్ వాదించారు. అంతేకాకుండా భారతదేశంలో చట్టాల బ్రాహ్మణీకరణతో భారతీయ సంస్కృతి విచ్ఛిన్నం అవుతుందంటూ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు.

భారతీయ సంస్కృతిలో 90% ఉన్న శూద్రులలో విడాకులు ఒక అలవాటు. చట్టం కాబట్టి మెజారిటీపై మైనారిటీ పాలన విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. సాంప్రదాయ హిందూ మతం రక్షణ కోసం ధర్మ సంఘం అనే సాంస్కృతిక సంస్థ హిందూ కోడ్ బిల్‌కు వ్యతిరేకంగా అనేక ఆందోళనలను నిర్వహించింది.

### విడాకులు రావడానికి ఎన్నేళ్లు ?

మరో ప్రశ్న ఏమిటంటే విడాకులు సులభం చేయలేరా? విడాకులు ఇవ్వరు, వదలరు. చంపేస్తారే గాని బతకనివ్వరు. కోర్టుకు వెళ్తే పదేళ్లు ఇరవై ఏళ్లు దాటినా సుప్రీంకోర్టుకు ఆ కేసు చేరదు. అయినా ఎంత ఆశ్చర్యపోయినా సుప్రీంకోర్టు మందలింపులు మాత్రం పత్రికల్లో ప్రచురిస్తుందే కాని వారికి ఏం లాభం. విడాకులు సులభం చేస్తే కోట్ల కేసులు ఓ వారంలో రద్దైపోతాయి.

### ఏకపత్నీవ్రతం ఎక్కడ?

వివాహం తప్పనిసరి, కానీ ఏకపత్నీ వ్రతం ఎవరు చేస్తారు? ఒక భర్త ఒక భార్య అనేమాటే గొప్ప విప్లవకరమైన సంస్కరణగా చెప్పుకోవాలి. భార్యలకు రకరకాల పేర్లు ఉంటాయి. కొన్ని మాటలు దారుణంగా ఉంటాయి. స్త్రీని హీనంగా బలహీనం చేసే నియమాలే అన్నీ. విడాకులు, మహిళలకు సమాన ఆస్తి హక్కులను సాకారం చేసుకోవడానికి కుల ఆధారిత పరిమితుల తొలిగింపు ముఖ్యమని అంబేద్కర్ అంటే విన్నదెవరు ? వాటిని వ్యతిరేకించినందుకు ఎన్నో సమస్యలు, వివాదాలు వచ్చాయి.

భారత రాజ్యాంగ సభ చైర్మన్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతులైన మహిళలు మాత్రమే బిల్లుకు మద్దతు ఇస్తారని అతని భార్య విడాకుల నిబంధనను ఎప్పటికీ సమర్థించదని అన్నారు. అదే పరిస్థితి. బహుభార్యత్వాన్ని సమర్థించడం చాలా పాశ్చాత్యమని బిల్లు విమర్శకులకు ప్రతి స్పందిస్తూ అంబేద్కర్ హిందూ స్మృతి శాస్త్రాలను ఉదహరణగా చూపారు. చాలా వరకు బహు భార్యత్వాన్ని పరోక్షంగా సమర్థిస్తున్నాయి.

### బహు భార్యత్వం, స్త్రీకి శాశ్వత బానిసత్వం

రాజ్యాంగ సభలోని కొంత మంది సభ్యులు సమర్థించిన వివాహం అనే భావన 'స్వేచ్ఛ లేదా సమానత్వం ఆదర్శానికి' అనుగుణంగా లేదని అంబేద్కర్ పేర్కొన్నారు. హిందూ చట్టాల ప్రకారం వివాహాన్ని 'పురుషుడికి బహు భార్యత్వం, స్త్రీకి శాశ్వత బానిసత్వం' అని ఆయన తీవ్రగా విమర్శించారు. ఈ బిల్లులో విడాకుల నిబంధనను ఆయన గట్టిగా సమర్థించారు.

### ఒకే బాణమూ ఒకటే మాట ఒక్క భామకే ఈ ప్రేమ..

లవకుశ సినిమాలో అద్భుతమైన పాట 'ఒకే బాణమూ ఒకటే మాట ఒక్క భామకే ఈ ప్రేమ' చాలా మంది ఒక భర్తకు ఒక భార్య అనే నియమాలు పాటిస్తున్నారు. కాని పాటించని వారు ఉన్నారు కదా. అది లేకుండా రామరాజ్యం సాధ్యమా? రాముడి తండ్రికే బోలెడు మంది భార్యలు, దశరథుడికి ముగ్గురు భార్యల నుంచి నలుగురు సంతానం జన్మించారు కదా.. రామరాజ్యం గురించి చెప్పేవారు కనీసం భార్యల సంఖ్యను ఒకటికి తగ్గించడం సాధ్యం కాదా ? పేదరికం భయంకరంగా ఉన్నా చదువు సంధ్యలు లేకపోయినా ముస్లింలు నలుగురు భార్యలను చేసుకోవడాన్ని సంస్కృతి, సంస్కరణ అనుకోవడం న్యాయమా? తలాక్ తలాక్‌తో విడాకులను చట్టం ఇప్పుడు వింటున్నాం కాని దాన్ని ఆపగలరా?

### కొడుకులకు కుమార్తెల వారసత్వం ఎందుకు ఇవ్వరు?

సమానతలో రెండు అవసరాలు ఉంటాయి. ఒకటి అబ్బాయిలకు ఆడ బిడ్డలకు ఎందుకు సమానత ఇవ్వడం లేదు? రెండు బహు భార్యత్వం కొనసాగితే సమస్యలు ఉండి తీరతాయి. బాల్య వివాహాలు, వితంతువు తంతు, ముసలి వాళ్లకు పెళ్లిళ్లు తీవ్ర సమస్యలుగా మారుతాయి. అంబేద్కర్ కోడ్‌లో కుమార్తెలకు వారసత్వ భాగాలను కేటాయించింది. వితంతువులకు గతంలో పరిమితం చేయబడిన పూర్తి ఆస్తి హక్కులను ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను

కాంగ్రెస్, హిందూ మహాసభ, ఇతర హిందూ మత అధికారులు తీవ్రంగా వ్యతిరేకించారు.

**హెచ్‌యూఎఫ్**

హిందూ యూనైటెడ్ ఫ్యామిలీ అనేమాట ఒక జోక్ అయిపోయింది. హిందూ అవునో కాదో కానీ యునైటెడ్ మాత్రం కాదు. ఇక ఫ్యామిలీ అన్నా, వసుధైక కుటుంబమని కవిత్వం చెప్పడమన్నా అది ఉందా లేదా? హెచ్‌యూఎఫ్ కేవలం పన్ను ఎగొట్టడానికి, లాయర్లు డబ్బు సంపాదించడానికే కాక ఇంకెక్కడైనా అమలులో ఉందా? అన్నదమ్ములు కొట్టుకు చావడానికి కాక ఇంకెందుకు? బ్రహ్మ పదార్థమా? ఒక పెద్ద పత్రిక యజమాని హెచ్‌యూఎఫ్‌ను బ్రహ్మాండంగా వాడుకుంటున్నారు.

కానీ హిందూ కోడ్ సంస్కరణ సాంప్రదాయ హిందూ వ్యక్తిగత చట్టంతో విభేదించింది. అర్థం కాని సంగతి ఉమ్మడి కుటుంబాలు. 'అన్ని హిందువులకు ఆస్తి యాజమాన్యం ఒక ఉమ్మడి కుటుంబ వ్యవస్థను స్థాపించింది' అంటారు. కొన్నాళ్ల కిందట ఉండవచ్చు. కాని ఇప్పటి సంగతేంటి ?

**దత్తత హక్కు కూడా లేదా !**

ఆర్టికల్ 14 మాట చెబుతూ ఉంటారు. కానీ మహిళలకు సమాన హక్కులు మాత్రం ఇవ్వరు. పిల్లలను కనే స్త్రీలకు కనీసం పిల్లలను దత్తత తీసుకునే అధికారం ఇవ్వరు. ఇదెంత దారుణం కదా. ఆడవారికి ఆత్మగౌరవం అవసరం లేదా! ఒక భర్త అనేకమైన భార్యలనే బహుభార్యత్వాన్ని రద్దు చేయాలని, ఇది అసమానతని పెద్దవారు ఆలోచించకపోవడం అన్యాయం కూడా.

**ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందూ ఉమెన్**

'ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందూ ఉమెన్' పేరుతో రాసిన వ్యాసంలో స్త్రీని చీకటి అగాధంలోకి నెట్టే వేసిన సామాజిక పరిస్థితుల గురించి లోతుగా చర్చించారు. ఆడబిడ్డ పుట్టుకను బౌద్ధ సంప్రదాయం దుఃఖమయ ఘటనగా భావించదని బుద్ధుడికి, ప్రసంజిత్ మహారాజుకు మధ్య జరిగిన సంఘటన వివరిస్తుందని అంటారు. ఇప్పటికీ పుట్టేది ఆడపిల్లని తెలిస్తే ముందే గర్భం తీయించుకునే టెక్నాలజీని వాడుకుంటున్నారు.

**అంబేద్కర్ హిందూ కోడ్**

139 ఆర్టికల్స్‌తో ఉన్నటువంటి హిందూ కోడ్ బిల్లు భారతదేశంలోని హిందూ చట్టాలను సంస్కరించడాన్ని క్రోడీకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది బహుభార్యత్వం, కులాంతర వివాహాలు, విడాకులు, దత్తత వారసత్వం వంటి అంశాలను పరిశీలించింది. ఈ బిల్లుపై ప్రారంభ చర్చ 1947 నవంబర్ 17–1948 ఏప్రిల్ 9 మధ్య జరిగింది. దీని తర్వాత, బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు. కమిటీ సవరణలను సూచించి, బిల్లును తిరిగి పంపిన తర్వాత 1949 ఫిబ్రవరి 11–1950 డిసెంబర్ 14 మధ్య రాజ్యాంగ సభలో దీనిపై మరింతగా చర్చ జరిగింది. 1951 ఫిబ్రవరి 5న డాక్టర్ అంబేద్కర్ పార్లమెంటులో బిల్లుపై నిబంధనల వారీగా చర్చను కోరారు.

ఓ వైపు రాజ్యాంగ నిర్మాణం ముగుస్తున్న దశలో అంబేద్కర్ బిల్లును ప్రవేశపెట్టారు. మనస్థాపానికి గురై 1951 సెప్టెంబర్ 9న రాజీనామా చేయక తప్పలేదు. హిందూ కోడ్ బిల్లుపై చర్చ ప్రారంభించాలనే ప్రతిపాదనపై యాభై గంటలకు పైగా చర్చ జరిగింది. ఆ తర్వాత చర్చ ఒక సంవత్సరం పాటు వాయిదా కూడా పడింది.

**బిల్లును చంపేశారు, ఏడవకుండా నోరుమూశారు..**

ఈ కోడ్ రాజ్యాంగ చెల్లుబాటుపై కూడా వాదనలు జరిగాయి. పండిత్ ఠంకూర్ దాస్ భార్గవ, జెఆర్ కపూర్ వంటి సభ్యులు, బిల్లులోని నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(1), 25(1) కింద వివక్ష లేకుండా ఏ మతాన్ని అయినా ఆచరించే స్వేచ్ఛకు హామీ ఇచ్చే ప్రాథమిక హక్కులను తగ్గించాయని పేర్కొన్నారు.

దీంతో ప్రభుత్వానికి మతపరమైన ఆచారాలలో జోక్యం చేసుకునే హక్కు లేదు. దీనికి ప్రతిస్పందనగా, పార్లమెంటు వారి మతం తప్ప అన్ని వర్గాల వ్యక్తిగత చట్టాలపై అధికారాన్ని ఉపయోగించిందని డాక్టర్ అంబేద్కర్ నొక్కి చెప్పారు. 'పార్లమెంటు సార్వభౌమ అధికారం నుండి తమకు మినహాయింపు ఉంటుందని ఏ సమాజమూ భావించకూడదు' అని ఆయన అన్నారు. చివరకు 'బిల్లు చంపబడింది, ఏడవకుండా నోరు మూసింది' అని అంబేద్కర్ బాధపడ్డారు.

**అంబేద్కర్ రాజీనామా..**

మళ్లీ మితాక్షర ఉమ్మడి కుటుంబ వ్యవస్థను తిరిగి స్థాపించడం, సోదరులు కుమార్తెల వారసత్వ వాటాను కొనుగోలు చేయడానికి అనుమతించే సవరణ, వివాహమైన మూడు సంవత్సరాల తర్వాత మాత్రమే విడాకులను అనుమతించే నిబంధన వంటి విమర్శకుల డిమాండ్లకు అనుగుణంగా ఉన్న కొత్త ముసాయిదాను నెహ్రూ అంబేద్కర్ కమిటీతో పంపిణీ చేయించారు. ఆ బిల్లులు మళ్ళీ అసెంబ్లీలో ఓడిపోయిన తరువాత, అంబేద్కర్ రాజీనామా చేశారు.

**ప్రభుత్వం - హిందూ కోడ్**

ఇప్పుడు హిందూ బిల్లు అంబేద్కర్ బిల్లు కాదు. అది నెహ్రూ కోడ్ బిల్లు. దానికి 4 భాగాలు : హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనారిటీ సంరక్షణ చట్టం,

హిందూ దత్తత నిర్వహణ చట్టాలు. దీనిపట్ల ఎదురైన వ్యతిరేకత తక్కువే. ఆ మాత్రం మార్పులు, సంస్కరణలు చేయడానికి కూడా నెహ్రూ నానా తంటాలు పడ్డారు. ఆయనే ఎన్నోసార్లు ఇందులో మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. 1952, తరువాత 1956 సంవత్సరాల మధ్య, ప్రతి ఒక్కటి పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. ఆమోదించారు కూడా.

### అంబేడ్కర్ అసంతృప్తి..

ఈ నేపథ్యంలో అంబేడ్కర్‌కు అసంతృప్తి, బాధ ఎక్కువగానే ఉంది. హిందూవులకు ఇతరులకు మధ్య తేడా తరువాత చర్చించాలి. కానీ హిందువుల మగ, ఆడవారి మధ్య తేడా సంగతేంటో చర్చించాలనీ, వారసత్వ క్రమం ఎవరు నిర్ణయిస్తున్నారన్నది మార్చకుండా రాజ్యాంగంలో సమానత ఏ విధంగా సాధ్యమవుతుంది అనేది ఆయన ప్రశ్న.

### 10 శాతం జనాభాకు వర్తించే చట్టం 90 శాతం జనాభా జీవితాల్ని కట్టి పడేస్తుంది

తన ప్రసంగాల్లో, పార్లమెంట్‌లో అంబేడ్కర్ 'హిందువులలో 90 శాతం మంది శూద్రులు ఉంటారనడంలో సందేహం లేదు. ద్విజులు 10 శాతం మంది జనాభాలో ఉంటారు. 90 శాతం మంది అనుసరించే చట్టాన్ని అందరి శాసనంగా చేద్దామా లేక కేవలం 10 శాతం మంది అనుసరించే చట్టాన్ని వంద శాతం మంది మీద రుద్దుదామా?' అని అంబేడ్కర్ ప్రశ్న

### ధర్మశాస్త్రాలలో విడాకులు..

హిందూ ధర్మశాస్త్రాలలో నారదస్మృతి పరాశరస్మృతిలో కూడా విడాకులు ఉన్నాయని ఉంది. కాని ఆమాట చెప్పడం లేదు. విడాకులు ఉండే పరిస్థితులు ఇవి : భర్తలు వదిలినపుడు, మరణించినపుడు, పరివ్రజం(సన్యాసం) తీసుకున్నపుడు వివాహ బంధం నుంచి బయటపడవచ్చు. ఎంతో మంది మతం మారతారు. భర్త మతం మారితే భార్య విడాకులు తీసుకోవచ్చని చాలా కాలం నుంచి ఓ నియమం అమలులో ఉంది. ఎవరికీ తెలియదు. తెలిసినా ఏదో ఒకటి పోనీ అని సర్దుకుంటూ ఉంటారు.

> చట్టంలో సివిల్ డెత్ అని ఒక నియమం ఉంది. మూడు సందర్భాలలో ఈ పౌరత్వ మరణం ఉంటుంది. భర్త విడాకులు తీసుకున్నా అది భార్యకు సివిల్ డెత్‌గా ఉంటుంది. రెండో సారి సన్యాసం తీసుకున్నవారు, వివాహం తెగిపోయి భార్య వేరే పెళ్లి చేసుకోవచ్చు. ఇవన్నీ ఎవరికీ చెప్పరు అర్థం కాదు. లాయర్లకు కూడా తెలుసో లేదో చెప్పలేం. ఇక మూడో పరిస్థితి. ఎక్కువగా భర్తలు చెప్పాపెట్టకుండా ఏదో దేశానికి వెళ్లిపోతారు, వాళ్ల గొంతు వినబడదు. వాళ్లు కనబడరు. మొత్తం ఏడేళ్లు ఎదురుచూసినా రాకపోతే వేరే పెళ్లి చేసుకోవచ్చు.
> (Civil Death, Divorce, Renouncing, Unheard of 7 years)

### కౌటిల్యుడి అర్థశాస్త్రం..

కౌటిల్యుడు రచించింది మొదటి రాజ్యాంగం. Practical Constitution is his creation. ఒక ప్రభుత్వాన్ని యుద్ధం లేకుండానే కూలగొట్టిన వాడు కౌటిల్యుడు. చాణుక్యుని అర్థ శాస్త్రంలో ప్రపంచమంతా ఒకే వివాహ ప్రశస్తమైన నియమాన్ని పాటిస్తున్నారు. మరుముక్కతాయం అలియ సంతానం చట్టాలు ఏక వివాహాల నియమాలు రూపొందించాయి. కౌటిల్యుడు రెండో పెళ్లి హక్కుపైన చాలా పరిమితులు విధించారు. ఒకరు మొదటి 10, 12 సంవత్సరాల వరకు రెండో పెళ్లి చేసుకోవద్దు. పిల్లలు కనడానికి అవకాశం ఉందో లేదో వేచి చూడాలి. ఇదో ప్రధాన పరిమితి. రెండో పెళ్లి చేసుకోదలచుకున్న వ్యక్తి మొదటి భార్యకు ఆమెతో పెళ్లికి వచ్చిన సొమ్మంతా తిరిగి ఇవ్వాలని కౌటిల్యుడు నిర్దేశించాడు. ఇదీ కౌటిల్యుడి అర్థశాస్త్రం.

### స్త్రీ చైతన్యానికి నాంది అంబేడ్కర్..

అంబేడ్కర్ బిల్లు పోతే పోయింది కాని, ఒక ఉద్యమ విత్తనాన్ని నాటింది. స్త్రీ చైతన్యం కోసం అంబేడ్కర్ ఆ విత్తనాన్ని నాటారు. మారుతున్న సమాజంతోపాటు మారాలని, మూఢాచారాలను వదిలి వేయాలని, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉండాలని చెప్పేవారు. ఇప్పుడు చూస్తే విపరీతమైన డబ్బు వెదజల్లుతూ ఆర్భాటాల కోసం దారుణంగా ఖర్చుచేస్తున్నారు. వేశ్యవృత్తిలో ఉన్న కొందరు మహర్ మహిళలు, ఆ నరక చీకట్లో నుంచి వెలుగులోకి రావడానికి, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అంబేడ్కర్ ప్రసంగాలు, నినాదాలు, వివాదాల మాటలు అన్నీ ఎంతో దోహదపడ్డాయి.

### రాజ్యాంగం - మహిళా సాధికారత..

మహిళా సాధికారత కోసం రాజ్యాంగంలో ఎన్నో నియమాలు అంబేడ్కర్ చేర్చారు. మహిళల పట్ల వివక్షను అంతం చేస్తూ రూపొందించిందే ఆర్టికల్ 15(3). (Article 15(3) of the Constitution of India allows the state to make special provisions for women and children. It also states that these provisions cannot be challenged on the basis of discrimination.)

ఆడ, మగ అనే వివక్ష లేకుండా అందరూ జీవనోపాధి పద్ధతులను కలిగి ఉండటానికి 39(ఎ) ఆర్టికల్‌ను రచించారు.

(Articles 36 to 51 are Directive Principles of State Policy. Article 39A of the Constitution of India states that the state must ensure equal justice and provide free legal aid to all citizens. This article was added to the Constitution in 1976 through the 42th Amendment. Citizens should not be denied justice due to economic or other disabilities. It ensures that legal services are available to women, children, elderly, and people with disabilities)

భారత దేశంలో చాలా కాలంపాటు ఒకే పనిని ఆడ, మగ ఇద్దరూ చేసినా వేతనం విషయంలో మాత్రం వివక్ష ఉండేది. మగవాళ్లకు ఎక్కువ వేతనం, ఆడవారికి తక్కువ వేతనం ఇచ్చేవాళ్లు. ఈ దుర్మార్గానికి అంబేద్కర్ ముగింపు పలికారు. సమానపనికి సమానం వేతనం ఇచ్చే ఆర్టికల్ 39(డి)ను రూపొందించారు. (Article 39(d) of the Constitution of India states that men and women should be paid equally for the same work. It is a Directive Principle of State Policy.) మగవాళ్లతో పోలిస్తే మహిళలు తక్కువ అనే అన్యాయయపు ఆలోచనల ఆధారంగా అనేక దురాచారాలు ఉండేవి.

మహిళల గౌరవాన్ని తగ్గించే పాతకాలపు ఆచారాలను చట్ట విరుద్ధమని పేర్కొంటూ ఆర్టికల్ 51(ఎ)(ఇ)ను రాజ్యాంగంలో అంబేద్కర్ ప్రవేశపెట్టారు. (Article 51A(e) directs the citizens to renounce practices derogatory to the dignity of women) తమ వ్యక్తిగత(మత) చట్టాలలో కానీ, ఏ ఇతర చట్టాలలో కానీ జోక్యం చేసుకోవద్దని చెప్పే హక్కు పార్లమెంట్‌కు లేదనే వాదన కరెక్ట్ కాదు. అప్పుడిక రాజ్యాంగం ఎందుకు?

### అంబేద్కర్ - నెహ్రూ ప్రభుత్వం..

ఈ బిల్లును వ్యతిరేకిస్తే తన ప్రభుత్వం కూలిపోతుందని నెహ్రూ మొదట బెదిరించినప్పటికీ, బిల్లు ప్రవేశపెట్టడం వాయిదా పడింది. ఈ బిల్లు మంచిదే అని నెహ్రూ ముందు ఒప్పుకున్నా సామాజిక, చారిత్రిక, రాజకీయ కారణాలతో ఈ ఆలోచన వెనుకబడింది. రాజ్యాంగ నిర్మాణంలో సాధ్యమైనా హిందూ బిల్లు గెలవడం కష్టం అని నెహ్రూకు తెలిసింది. బిల్లు ఆమోదం పొందాలంటే గణనీయమైన రాయితీలు ఇవ్వాలని నెహ్రూకు అర్థమైంది. అనేక విభాగాలుగా విభజించాలని సూచించారు. వివాహం విడాకులకు సంబంధించిన మొదటి 55 నిబంధనలతో మాత్రమే తాము పోటీ చేస్తామని, మిగిలిన వాటిని మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత భారత పార్లమెంట్ పరిశీలిస్తుందని నెహ్రూ రాజ్యాంగ సభకు చెప్పారు. రాజీ మార్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి నిలువలేదు. సంప్రదాయవాదులను ఒప్పించడంలో రాజీ పెద్దగా ప్రభావం చూపలేదు. మరో వారం రోజుల చర్చ తర్వాత 55 నిబంధనలలో మూడింటిని మాత్రమే ఆమోదించారు.

సామాజిక పితృస్వామ్య సోపానక్రమానికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం జరిగిన ప్రజాస్వామ్య పోరాటాల చరిత్రలో, హిందూ కోడ్ బిల్లుకు అనుకూలంగా డాక్టర్ అంబేద్కర్ చేసిన వాదనలు తర్వాత మంత్రివర్గం నుంచి రాజీనామా తప్పలేదు. ప్రస్తుతం భారత రాజ్యాంగానికి చాలా కీలకమైన అంశం సమానత. రాజ్యాంగ రచన చాలా క్లిష్టమైన పని. కాని హిందూ కోడ్ నిర్మాణం అంతకన్న కష్టమైంది. డాక్టర్ అంబేద్కర్ రాజీనామా, భారతదేశ మహిళా హక్కుల చరిత్రలో ఒక మలుపుగా నిలిచింది.

### 2005లో సమాన హక్కులు..

> 2005లో హిందూ చట్టాలను సవరించిన సమాన హక్కులు కూడా గొప్ప మార్పుగా చూడాలి. అంతకుముందు తమిళనాడులో మగవారికి మహిళలకు సమాన హక్కులను కల్పించారు. తరువాత ఎన్‌టి రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మార్పును తెచ్చారు. ఆ తరువాత దేశవ్యాప్తంగా సమాన హక్కులను తేవడం 2005లో మాత్రమే సాధ్యమయింది. 2005లో సమాచార హక్కును తెచ్చినా, అది నీరసించి హాస్పిటల్ ఐసియులో ఎప్పుడో చేరింది. ఈ సమానత హక్కు ఉంచుతారో లేదో తెలియదు.

కొన్ని మంచి మార్పులు వచ్చినప్పటికీ అంబేద్కర్ హిందూ కోడ్‌లో ఇప్పటికీ సవరణల, సంస్కరణల అవసరం ఎంతైనా ఉంది. హిందువులకు, ఇతరులకు కూడా వర్తించే యూనిఫాం సివిల్ కోడ్‌ను చేయగలరా? అనే ప్రశ్న ఇప్పటికీ మిగిలిపోయి ఉంది. సతి, బాల్య వివాహాలు, వితంతుల వివాహం చాలావరకు ఆగిపోయినా, ఒకే భర్త ఒకే భార్య అనే సమానత అందరికీ సమానంగా సాధ్యమా?

హిందూ చట్టాలు బోలెడు. స్పెషల్ వివాహ చట్టాలు, ముస్లిం, క్రైస్తవ వివాహ సమస్యలు ఎన్నెన్నో ఉంటాయి. 'మనం నా నుంచి ఇంకా మా దాకా రాలేదు. మనం అన్నపుడు కదా మన అన్నది ప్రగతి' కాళోజీ అన్నట్టు ఇంకా 'మన' అనే నాగరికత ఎప్పుడు వికసిస్తుంది? ❑


# ది గ్రేట్ డిక్టేటర్‌లో చార్లీ చాప్లిన్ భావోద్వేగ ప్రసంగం

"క్షమించండి, చక్రవర్తి కావాలనే కోరిక లేదు. అది నా పని కాదు. పాలించాలని, జయించాలని కోరుకోను. ప్రతి ఒక్కరికి సాయం చేయాలన్నదే నా అభిమతం. సాయానికి యూదులా, క్రైస్తవులా, నల్లజాతీయులు, తెల్లవారా అనే భేదం లేదు. పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలి. ఇది మానవ ధర్మం. కలిసి మెలిసి సుఖసంతోషాలతో జీవించాలి. ఒకరి నొకరం బాధపెట్టుకోవడం, ద్వేషించుకోవడం, తిరస్కరించు కోవడం వంటివి నివారించాలి. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ చోటు ఉంది. భూమి చాలా గొప్పది. ప్రతి ఒక్కరిని పోషించగలదు. స్వేచ్ఛగా జీవించగలగడం ఓ అందమైన అనుభూతి. కానీ మనం ఆ మార్గాన్ని పోగొట్టుకున్నాం. అత్యాశతో మనుషుల ఆత్మలు కలుషితమయ్యాయి. ప్రపంచాన్ని ద్వేషం ఆవహించింది. మానవాళికి కాఠిన్యాన్ని నేర్పింది. రక్తపాతం, హింసకు అలవాటు చేసింది.

మనం గతి(స్పీడ్)ని కనుగొన్నాం కానీ మనల్ని మనం పరిమితం చేసుకున్నాం. యంత్రాల ద్వారా లభిస్తున్నది చాలక అత్యాశకు పోతున్నాం. విజ్ఞానం మనల్ని నిరాశావాదులను చేసింది. తెలివి మనలో దయను మరిపించింది. అతిగా ఆలోచిస్తూ మితిగా అనుభవించే స్థితిలో మనం ఉన్నాం. యంత్రాలు కాదు మానవాళి విలువైనది. తెలివి తేటలకంటే దయ, సౌమ్యత మనకు అవసరం. ఈ లక్షణాలు లేకపోతే మానవ జీవితం హింసాత్మకంగా మారి... అంతా నశించిపోతుంది. విమానం, రేడియో మనల్ని దగ్గరకు తెచ్చాయి. ఈ ఆవిష్కరణల స్వభావం మానవత్వాన్ని.. సౌభ్రాతృత్వాన్ని, ఐక్యతాభావాన్ని చాటుతుంది. ఈ క్షణం నా మాటలు ప్రపంచ వ్యాప్తంగా కొన్ని లక్షల మందికి చేరుతున్నాయి. నిస్సహాయులు, పసివారు, అమాయకులను నిర్బంధించి వేధించే వ్యవస్థల బాధితులు వినగలుగుతున్నారు. వారందరికీ నేను చెప్పేది ఒక్కటే నిరాశపడవద్దు. మీరు అనుభవిస్తున్న కష్టాలు మానవుల అత్యాస పర్యవసానం.

మానవ పురోగతికి విఘాతం కలిగిస్తూ ద్వేషాన్ని పంచేదే అత్యాశ. పరిస్థితులు మారుతాయి. ద్వేషం నశిస్తుంది. నియంతలు చనిపోతారు. ప్రజల నుంచి లాక్కున్న అధికారం తిరిగి ప్రజలకు చేరుతుంది. మనుషులు కాలగర్భంలో కలిసిపోతారు కానీ స్వేచ్ఛకు అంతరించిపోదు.

సైనికులారా ! మీరు మీ జీవితాలను శక్తిమంతుల కోసం



పణంగా పెట్టవద్దు. మిమ్మల్ని ద్వేషించే వారికి బానిసలు కావద్దు. మిమ్మల్ని ఎవరో శాసించే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీరు ఏం చేయాలి, ఎలా ఆలోచించాలి, మిమ్మల్ని మీరు ఎలా ఉంచుకోవాలి, ఏమి తినాలి, ఎలా జీవించాలన్నది మీరే నిర్ణయించుకోవాలి. మీ జీవితం మీ సొంతం. మీ అనుభవాలు, ఇష్టాయిష్టాలు మీ సొంతం. మీ జీవితాలను శాసిస్తూ, మిమల్ని పశువుల్లా చూస్తూ, మిమ్మల్ని తుపాలకు ఆహారంగా చేసేవారికి తలొగ్గవద్దు. అలాంటి అసహజ, యాంత్రిక మనుషులకు, ఆలోచనలకు దాసోహం కావద్దు. మీరు యంత్రాలు కాదు! మీరు పశువులు కాదు! మీరు మనుషులు! మీ గుండెల నిండా మనుషుల కోసం ప్రేమ ఉంది! మీలో ద్వేషం లేదు! ప్రేమ తెలియని వారే ద్వేషించగలరు– అది అసహజం! సైనికులారా! బానిసత్వం కోసం కాదు స్వేచ్ఛ కోసం పోరాడండి!

సెయింట్ లూక్ గ్రంథంలోని 17వ అధ్యాయంలో ఇలా వుంది : 'దేవుని రాజ్యం మనుషులలో ఉంది'. ఇది ఒక మనిషి.. సమూహానికి పరిమితం కాదు. ప్రతి ఒక్కరిలోనూ దేవుడి వాస ముంది. అవును మీలో శక్తి ఉంది. యంత్రాలు తయారు చేయగలిగే శక్తి.. సంతోషాన్ని సృష్టించే శక్తి మీలో ఉంది! ఈ జీవితాన్ని అందంగా, ఆనందంగా, స్వేచ్ఛగా తీర్చిదిద్దుకోగలిగిన శక్తి మీలో ఉంది ! ఈ జీవితాన్ని అద్భుత అనుభూతిని మీరు మలుచుకోగలరు ! ప్రజాస్వామ్యం పేరిట మనం మనలోని శక్తిని వాడుదాం. ఏకమవుదాం! సరికొత్త ప్రపంచం కోసం కలిసి కట్టుగా పాటుపడదాం! ప్రతి ఒక్కరికి ఉపాధి లభించే కొత్త ప్రపంచాన్ని సృష్టిద్దాం! **(మిగతా 38వ పేజీలో)**

# అమెరికా యువతలో కమ్యూనిజంపై ఆసక్తి

అమెరికాలో మెజారిటీ యువత కమ్యూనిజానికి మొగ్గు చూపుతున్నారు. గాలప్ నిర్వహించిన కొత్త పోల్ ప్రకారం, యువ అమెరికన్లు పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడింట ఒక వంతుకంటే ఎక్కువ మంది కమ్యూనిజాన్ని ఆమోదిస్తున్నారు. 2018 నుంచి పెట్టుబడిదారీ విధానంపై ప్రజాదరణ మరింతగా క్షీణించిందని గాలప్ నివేదిక తెలిపింది. 62శాతం యువ అమెరికన్లు కమ్యూనిజం, సోషలిజం భావజాలంపై సానుకూలతను వ్యక్తం చేశారు.

గత రెండేళ్లలో పెట్టుబడిదారీ విధానంపై ప్రపంచవ్యాప్తంగా యువతలో సానుకూల దృక్పథాలు 12 పాయింట్ల తగ్గుదలకు దారితీశాయి. 2010 నుంచి ప్రపంచవ్యాప్తంగా యువత భావజాలంలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. పెట్టుబడిదారీ విధానంపై యువత అసహనాన్ని వ్యక్తం చేస్తోంది. 19-29 సంవత్సరాల అమెరికన్లలో 68 శాతం మంది కమ్యూనిజం, సోషలిజం విధానాలపై ఆసక్తి చూపుతున్నారు. యూనివర్సిటీల్లో మార్క్స్, ఎంగెల్స్ రచించిన కేపిటల్ గ్రంథంపై కుస్తీ పడుతున్నారు. కేవలం 38 శాతం మంది అమెరికన్లు మాత్రమే ప్రతికూలతను వ్యక్తంచేశారు.

కాటో ఇనిస్టిట్యూట్, యుగోవ్ నిర్వహించిన తాజా సర్వేలో అమెరికా ఆర్థిక విధానాలపై యువతను ప్రశ్నించారు. అమెరికా యువత పెట్టుబడిదారీ విధానాలపై తీవ్ర అసహనాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేసింది. సమాజంలోని పేద, ధనిక వ్యత్యాసాలపై అనేక ప్రశ్నలు సంధించారు. కార్మికుల హక్కులపై స్పందిస్తున్నారు. ప్రపంచంలోని సంపద మొత్తం కొద్ది మంది ధనికుల చేతుల్లోనే ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిజాన్ని ప్రత్యామ్నాయ శక్తిగా శానోజోస్ విశ్వ విద్యాలయ విద్యార్థులు పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని హెూబర్ట్, విలియం స్మిత్ కళాశాలలో రాజకీయ శాస్త్ర ప్రొఫెసర్ జోడి డీన్ యువతరంలో కమ్యూనిజం, మార్క్సిజం అత్యంత ప్రజాదరణ పొందిందన్నారు. పెట్టుబడిదారీ విధానం ప్రపంచవ్యాప్తంగా విఫలమవడంతో ఆర్థికంగా, రాజకీయంగా, వాతావరణ విపత్తులకు ప్రత్యక్ష బాధ్యత వహిస్తోందన్నారు.

సర్వే ప్రకారం, మెజారిటీ అమెరికా యువతకు సోషలిజంపై పరిజ్ఞానం కలిగి ఉన్నారని భావించినప్పటికీ, స్కాండినేవియా, సోవియట్ యూనియన్ దేశాలు ఉత్తమ ఉదాహరణలా అనే దానిపై సందిగ్ధత వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న



ఆర్థిక అసమానతలకు ప్రధాన కారణం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద నియంతృత్వ విధానాలని మెజారిటీ ప్రజలు అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులను ఆశిస్తున్నారు. అమెరికా జీవన విధానంలో కొన్నేళ్లుగా తీవ్ర మార్పు చోటుచేసుకుంది. అక్కడ రోజువారీ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా వేతన విధానాలలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. వేతనాలు సరిగ్గా లేకపోవడం అక్కడి పౌరుల ప్రధాన సమస్యగా ఉంది. ఆర్థిక దుర్బలత్వానికి, అస్థిరతకు ప్రధాన కారణం వ్యవస్థలో చోటు చేసుకున్న సామాజిక అసమానతలు, ఉద్యోగ అభద్రత. తమ ప్రాథమిక అవసరాలు తీర్చడానికి జీత,భత్యాలు గతంలో ఉన్నంతగా లేకపోవడంతో అమెరికన్లు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. 10 మందిలో నలుగురు అమెరికన్లు ఏదో ఒక రకమైన రెండవ ఉద్యోగాన్ని కోరుకుంటున్నారు. అమెరికా విద్యా విధానం, మీడియాలో దశాబ్దాలుగా తీవ్రమైన కమ్యూనిస్టు భావజాలంపై వ్యతిరేక ప్రచారం ఉన్నప్పటికీ, యువతీ, యువకులలో గణనీయమైన సంఖ్యలో సోషలిజం కమ్యూనిజం భావనలపై సానుకూల అభిప్రాయాలను వ్యక్త పరుస్తున్నారు. కాటో/యుగోవ్ సర్వే ప్రకారం, 18-29 ఏళ్ల వయస్సు గల అమెరికన్లలో 62 శాతం మంది తాము సోషలిజం పట్ల "సానుకూల దృక్పథాన్ని" కలిగి ఉన్నామని చెబుతుండగా, 34 శాతం మంది కమ్యూనిజం సిద్ధాంతానికి తాము మక్కువ చూపుతున్నట్లు చెబుతున్నారు.

ముఖ్యంగా, సర్వే 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల 2,000 మందిని అమెరికన్ల ఆర్థిక విధానం గురించి "మీకు సోషలిజం, కమ్యూనిజం పట్ల సానుకూలత లేదా ప్రతికూల దృక్పథం ఉందా?" అని ప్రశ్నించగా.. 43 శాతం మంది

సోషలిజం పట్ల తమకు "సానుకూల" దృక్పథం ఉందని చెప్పగా, 18-29 సంవత్సరాల వయస్సు గల వారిలో 62 శాతం మంది కమ్యూనిజం సిద్ధాంతానికి తాము మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. మొత్తం 14 శాతం మంది తమకు కమ్యూనిజం, సోషలిజం భావజాలంపై సానుకూలతను వ్యక్తంచేశారు. ముఖ్యంగా 18-29 వయసుగల వారిలో 34 శాతం మంది కమ్యూనిస్టు సిద్ధాంతాలకు తాము కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. యువ అమెరికన్లు వారి తల్లిదండ్రులు, తాతామామ్మలు ఎక్కువగా ఆధారపడే పెన్షన్లు ఇకపై అందుబాటులో ఉండవని, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు మరింత భారం కానున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఏదేమైనా, సర్వే ఫలితాలు కాటో ఇనిస్టిట్యూట్ వంటి కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థలకు ప్రతికూలంగా ఉన్నాయి. ఈ సంస్థలు సోషలిజం-కమ్యూనిజానికి ప్రతికూలంగా పెట్టుబడి దారీ సామ్రాజ్యవాద విధానాలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా పెట్టుబడిదారీ విధానంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు నిరుద్యోగం, పేదరికం, సామాజిక అన్యాయం. 2019లో సీఐఏ నిధులతో నడిచే "విక్టిమ్స్ ఆఫ్ కమ్యూనిజం మెమోరియల్ ఫౌండేషన్" తరపున యూగొవ్ నిర్వహించిన సర్వేలో 36 శాతం మంది కమ్యూనిజాన్ని తాము ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది 2018లో 28శాతం నుంచి ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది.

అమెరికాలో 70 శాతం అంటే 23-38 సంవత్సరాల మధ్య వయస్సులోని స్త్రీ, పురుషులు తాము అమెరికా అధ్యక్ష పదవికి సోషలిస్టు భావజాలం ఉన్న అభ్యర్థికి మద్దతు ఇస్తామని సమాధానమిచ్చారు. గత ఎనిమిది సంవత్సరాలుగా యువత సోషలిజంపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఇకపై పెట్టుబడి దారీ విధానానికి కాలం చెల్లిందని, కుళ్లిపోయిందని సామ్రాజ్యవాద విధాన నియంతృత్వ పోకడలు ఇకపై చెల్లుబాటు కావని అమెరికన్ యువత స్పష్టం చేసింది. ❑

**(ఐడీ కమ్యూనిజం సౌజన్యంతో..విశాలాంధ్ర నుండి సేకరణ)**

## నస్ బందీ, నోట్ బందీ దారిలో వోట్ బందీ!

**(20వ పేజీ తరువాయి)**

చేర్పులూ చేయడం పునర్నవీకరణలో కీలకమైన అంశాలు. ఇటువంటి మార్పులు జరిగి 2003 నుంచి ఇప్పటివరకూ జరిగిన ఐదు లోకసభ ఎన్నికలలో, ఐదు శాసనసభ ఎన్నికలలో వోటు వేసినవారందరినీ ఇప్పుడు అనర్హులుగా, అర్హత రుజువు చేసుకోవలసిన వారిగా ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నది. అంటే ఆ ఐదు లోకసభలూ, శాసనసభలూ ఈ అనర్హులైన వోటర్ల వల్ల ఏర్పడ్డాయని ఎన్నికల సంఘం భావిస్తున్నదా? అలా అయితే వాటి సాధికారత, చట్టబద్ధత ఎంత?


వోటర్ల జాబితాల సవరణ ఎప్పటికప్పుడు చేయవలసిన పనే గనుక ఎన్నికల నిబంధనలు అది ఎట్లా చేయాలో నిర్దేశించాయి. ఆ నిబంధనల్లో ఇంటెన్సివ్ రివిజన్ ఉంది గాని ఇప్పుడు ప్రకటించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లేదు. అటువంటి పని చేసే అధికారం చట్టప్రకారం ఎన్నికల సంఘానికి ఉందా అనే ప్రశ్నకు జవాబు లేదు. బిహార్ నుంచి ప్రతి జూన్-జూలై-ఆగస్ట్ నెలల్లో కనీసం 21 శాతం వోటర్లు ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వలస వెళ్తారని ఎన్నికల సంఘమే ఇదివరకు అంచనా వేసింది. మరి సరిగ్గా అదే సమయంలో ప్రతి వోటర్ నూ కలిసి జాబితాను సంస్కరించాలనడంలో ఔచిత్యం ఏమిటి? ఇంకా విచిత్రం, ఇదే ఎన్నికల సంఘం గత సంవత్సరం జూన్‌లో వోటర్ల జాబితాను సంస్కరించమని బిహార్ ఎన్నికల అధికారులను ఆదేశించింది. వారు ఆరు నెలల పాటు శ్రమించి 2025 జనవరిలో జాబితా ప్రకటించారు. దాన్ని జూన్ 24 వరకూ ఎన్నికల సంఘం కూడా ఆమోదిస్తూ వచ్చింది.

ఇప్పుడు హఠాత్తుగా బిహార్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే, ప్రతిపక్షానికి వోటు వేస్తారనే అనుమానం ఉన్న లక్షలాది వోటర్లను అనర్హులుగా మార్చడమే ఏకైక మార్గంగా ఏలినవారు భావించినట్టున్నారు. అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఈ వోట్ బందీ ప్రకటించినట్టుంది. నస్ బందీ తలపెట్టినవారు 1977లో ఓటమి పాలయ్యారు. 2016 నోట్ బందీ ప్రకటిత లక్ష్యాలు సాధించలేక బొక్కబోర్లా పడింది. ఇప్పుడు 2025 వోట్ బందీకి ఏమవుతుంది? ❑

## ది గ్రేట్ డిక్టేటర్‌లో చార్లీ చాప్లిన్ భావోద్వేగ ప్రసంగం


**(36వ పేజీ తరువాయి)**


అందులో యువతకు ఉజ్వల భవిష్యత్తుకు హామీ.. వృద్ధాప్యానికి భద్రత ఉంటాయి. ఇటువంటి హామీలు ఇవ్వడం ద్వారానే పాశవికులు అధికారాన్ని చేజిక్కించుకోగలి గారు. కానీ వారు అబద్దాలే చెప్పారు! ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేరు. ఏ ఒక్క హామీకి కట్టుబడరు! నియంతులు తమను తాము విముక్తులను చేసుకుంటారు కానీ ప్రజలను బానిసలు చేస్తారు! బానిసత్వ సంకెళ్లు తెంచుకుంటూ నిరంకుశత్వాన్ని జయించే హామిని నెరవేర్చేందుకు మనమంతా ఐక్యంగా పోరాడదాం! స్వేచ్ఛ ప్రపంచం కోసం పోరాడదాం! అత్యాస, ద్వేషం, అసహనం లేని ప్రపంచం సృష్టించుకుందాం! మానవాళి సంతోషానికి దారి తీసే విజ్ఞత, విజ్ఞానంతో కూడిన సంతృప్తికర జీవితాన్ని అందించే ప్రపంచాన్ని నిర్మిద్దాం. సైనికులారా! ప్రజాస్వామ్యం పేరిట ఏకమవుదాం!" ❑




కలహాల కాపురం

న్యాయం కావాలి









మేం చెప్పిందే వినాలి

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 10 July 2025




కొత్త పుస్తకాల
స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.